అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
శనివారం 15-7-2023
సమగ్ర తెలుగు దినపత్రిక

మణిపూర్‌లో హింసను ఆపండి
భారత్‌ను కోరుతూ ఈయూ పార్లమెంట్ తీర్మానం



మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ పారిస్‌లో నిరసన తెలుపుతున్న దృశ్యం

వివరాలు 11లో

సంపుటి : 9 | సంచిక : 195 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50




జాబిల్లి కోసం..
నింగిలోకి దూసుకెళ్లిన చంద్రయాన్-3

- చంద్రుడిపై అధ్యయనానికి భారత్ మూడో ప్రయోగం
- నాలుగేండ్ల పాటు రేయింబవళ్లు శ్రమించిన శాస్త్రవేత్తలు

ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న తరుణం రానే వచ్చింది. జాబిలిపై అడుగు పెట్టాలన్న భారత చిరకాల స్వప్నం శుక్రవారం కార్యరూపం దాల్చింది. శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ నుంచి బాహుబలి రాకెట్ ఎల్‌వీఎం-3,ఎం 4 ఉపగ్రహ వాహక నౌక ద్వారా చంద్రయాన్-3ని శుక్రవారం మధ్యాహ్నం 2.35 నిముషాలకు ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రయోగించారు. ఈ ప్రయోగానికి 25.30 గంటలు కౌంట్‌డౌన్ ప్రక్రియ జరిగింది. గురువారం మధ్యాహ్నం 1.05కు కౌంట్ డౌన్ ప్రారంభమయ్యింది. ఇప్పటిదాకా ప్రపంచంలోని ఏ దేశమూ వెళ్లని చంద్రుడి రెండో వైపుకు ల్యాండర్, రోవర్‌లను పంపారు.

సూళ్లూరుపేట : చంద్రయాన్-3 విజయవంతమైంది. ఇప్పుడు అన్ని దేశాల చూపూ భారత్‌వైపే ఉంది. చంద్రయాన్-2 పాఠాలు నేర్చుకున్న శాస్త్రవేత్తలు.. నాలుగేండ్లపాటు రేయింబవళ్లూ శ్రమించారు. ఈసారి గురి తప్పొద్దనే పట్టుదలతో ఇస్రో సకల జాగ్రత్తలూ తీసుకుంది. ఇస్రో చైర్మెన్ ఎస్.సోమనాథ్ బుధవారం నుంచీ షార్‌లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలతో సమీక్షించారు. చంద్రున్ని లోతుగా అధ్యయనం చేసి, అక్కడ దాగున్న అనేకానేక రహస్యాలను వెలికి తీయడమే చంద్రయాన్-3 ప్రయోగం ప్రధాన లక్ష్యం. ఇప్పటి దాకా ఎన్నో దేశాలు చంద్రునికి ముందు వైపు అంటే ఉత్తర ధ్రువంపై పరిశోధనలు చేశాయి. భారత్ మాత్రం చంద్రయాన్-1 నుంచి తాజా చంద్రయాన్-3 వరకూ చంద్రుని వెనుక వైపు, అంటే దక్షిణ ధ్రువాన్ని పరిశోధించేందుకే ప్రయత్నిస్తూ వస్తోంది. అందులో భాగంగా చంద్రయాన్-3 ల్యాండర్‌ను సూర్యరశ్మిపడని చంద్రుని దక్షిణ ధ్రువపు చీకటి ప్రాంతంలో దించనున్నారు.

చంద్రయాన్-3 బరువు 3,920 కిలోలు. ఇందులో ప్రొపల్షన్ మాడ్యూల్ 2,145 కిలోలు, ల్యాండర్ 1,749 కిలోలు, రోవర్ 26 కిలోలుంటాయి. చంద్రయాన్-2 వైఫల్యంతో చంద్రుడిపై ఇస్రో ...5లో



ప్రశంసల వెల్లువ

చంద్రయాన్-3 ప్రయోగం విజయం సాధించడంతో ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్, ప్రధానమంత్రి మోడీ శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. భారత అంతరిక్ష చరిత్రలో ఇది ఒక కొత్త అధ్యాయమని మోడీ ట్వీట్ చేశారు. ప్రయోగం విజయవంతంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పందిస్తూ ఇది దేశానికి చారిత్రాత్మక విజయమని అభివర్ణించారు. ఈ విజయం దేశంలో ప్రజలందరికీ గర్వకారణమైన క్షణమని, అంతరిక్ష పరిశోధనలో ఈ మిషన్ సంచలనాత్మక ఫలితాలను తెస్తుందని విజయన్ ట్వీట్ చేశారు. అలాగే, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ తదితరులు అభినందనలు తెలిపారు.



బెంగాల్ పంచాయతీ హింసకు వ్యతిరేకంగా
లెఫ్ట్ ఫ్రంట్,మిత్రపక్షాల నిరసన
పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు, నాయకులు,కార్యకర్తలు

- టీఎంసీ, బీజేపీల దౌర్జన్యాలపై ఆగ్రహం



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో పెద్ద ఎత్తున జరిగిన హింస, రిగ్గింగ్, దాడులకు వ్యతిరేకంగా లెఫ్ట్ ఫ్రంట్, దాని మిత్రపక్షాలు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. ఎస్ప్లానేడ్‌లోని లెనిన్ విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ సెంట్రల్ కోల్‌కతాలోని ఎంటాలి మార్కెట్‌లో ముగిసింది. అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ హింసాత్మక మోసపూరిత చర్యలపై లెఫ్ట్‌ఫ్రంట్, దాని మిత్రపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. లెఫ్ట్ ఫ్రంట్ చైర్మెన్ బిమన్ బోస్, సీపీఐ(ఎం) నాయకులు మహ్మద్ సలీం, సూర్యకాంత మిశ్రా, సుజన్ చక్రవర్తి, ఐఎస్ఎఫ్ ఎమ్మెల్యే నౌషాద్ సిద్ధిఖీ, కాంగ్రెస్, ఫార్వర్డ్ బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, సీపీఐ నాయకులు నిరసన ర్యాలీకి నాయకత్వం వహించారు. పాదయాత్రగా బయలుదేరారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి సలీం మాట్లాడుతూ... "ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నకిలీ సర్టిఫికెట్లతో తొలి ఎన్నికల్లో పోరాడారు. దేశ ప్రధాని కూడా నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి అధికారంలోకి వచ్చారు. పంచాయతీ ఎన్నికలకు కూడా నకిలీ సర్టిఫికెట్లు తయారు చేయడం ద్వారా అధికారాన్ని తృణమూల్ చేజిక్కించుకుంటున్నది. కానీ బెంగాల్ ప్రజలు నకిలీ సర్టిఫికెట్లపై సృష్టించిన పంచాయతీని అంగీకరించరు" అని తెలిపారు.

ఎన్నికల్లో బీజేపీ వ్యవహారం పైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఆరెస్సెస్.. పశ్చిమ బెంగాల్‌లో...11లో

వీధుల్లో దొరికిన సీపీఐ(ఎం) ఓట్లు

పశ్చిమబెంగాల్‌లోని తూర్పు బుర్ద్వాన్‌లో ఓ బ్లాక్‌లోని కౌంటింగ్ కేంద్రం దగ్గర పడి ఉన్న సిపిఐ(ఎం) ఓట్లను గుర్తించారు. తూర్పు బుర్ద్వాన్‌లోని ఈ బ్లాక్‌కు సంబంధించిన కౌంటింగ్‌పటులి కిషన్ మండిలో జరిగింది. ఓట్ల లెక్కింపు అనంతరం కిషన్ మండి గోడల పక్కన పడి ఉన్న బ్యాలెట్ పత్రాల దొంతరలను గుర్తించారు. బ్యాలెట్ పేపర్లలో సీపీఐ(ఎం) గుర్తు సుత్తి కొడవలి నక్షత్రంపై ఓటరు ముద్రలను స్థానికులు గుర్తించారు. సీపీఐ(ఎం) స్థానిక నాయకులు మాట్లాడుతూ... ప్రతి బ్యాలెట్ పేపర్‌పైనా ప్రిసైడింగ్ అధికారి సంతకం...11లో

మిజోరంలో బీజేపీకి షాక్
ఆ పార్టీ ఉపాధ్యక్షుడు రాజీనామా


- మణిపూర్ విధ్వంసానికి మద్దతిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- ఈ ఘటనలను ఖండించని సీఎం, కేంద్ర హోం మంత్రి అంటూ ఆరోపణాస్త్రాలు




ఐజ్వాల్ : రెండు నెలలకు పైగా కొనసాగుతున్న మణిపూర్ అల్లర్ల ఎఫెక్ట్ మిజోరంలోని బీజేపీ పార్టీపై పడింది. మిజోరం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. వన్రమ్ముచ్వంగ ఆ పార్టీకి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖలో మణిపూర్, కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆయన ఆరోపణలు ...11లో

చీమను చంపేందుకు సుత్తిని వాడలేం కదా!

- కొత్త ఐటీ నిబంధనలపై బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు



ముంబయి: నకిలీ, తప్పుడు సమాచార వ్యాప్తిని నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఐటీ నిబంధనలపై బాంబే హైకోర్టు విచారిస్తూ "ఒక చీమను చంపేందుకు సుత్తిని వాడలేం కదా..?" అంటూ కీలక వ్యాఖ్యలు చేసింది. బాంబే హైకోర్టు వ్యాఖ్యలు ఆ నిబంధనల తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఆన్‌లైన్ కంటెంట్‌లో నకిలీ, తప్పుడు సమాచారాన్ని గుర్తించేందుకుగాను ఫ్యాక్ట్‌చెక్ యూనిట్‌ను తీసుకువస్తామని కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లో పేర్కొంది. ఇందుకోసం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్-2021కు సవరణలు చేసింది. అయితే, ఈ కొత్త నిబంధనలు ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ ఐటీ నిబంధనల చెల్లుబాటును సవాల్ చేస్తూ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మ్యాగజైన్స్.. బాంబే హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. దీనిపై బాంబే డివిజనల్ బెంచ్ విచారణ జరుపుతోంది.

సోషల్ మీడియాలో నకిలీ సమాచారాన్ని కట్టడి చేసేందుకు తేలికైన మార్గాలు కూడా ఉన్నాయంటూ పిటిషనర్ల తరపు న్యాయవాది కోర్టులో తమ వాదనలు వినిపించారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. 'ఫ్యాక్ట్ చెకింగ్ ఉండాలి. కొంతస్థాయి వరకు సోషల్ మీడియా కంటెంట్‌ను ఫ్యాక్ట్ చెక్ చేయాలి. అయితే ఈ నిబంధనలు మితిమీరినవని మీరు చెప్పిన మాట సరైంది కావొచ్చు. ఒక చీమను చంపడానికి సుత్తిని వాడటం ఎంతవరకు సమంజసం..?' అని ఆ నిబంధనల తీవ్రతను ప్రశ్నించింది. 'ఈ ఐటీ నిబంధనలకు సవరణ చేయాల్సిన అవసరం ఏంటో ఇప్పటికీ అర్థం కాలేదు?' అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. 'అలాగే...11లో

షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో
వేతనాలు పెంచాలి

- కనీసవేతనాల జీవో సవరించాలి : సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లాల్లో ధర్నాలు



నవతెలంగాణ-విలేకరులు

రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ కనీస వేతనాల జీవోలను సవరించి వేతనాలు పెంచాలని, కార్మికులకు పరిశ్రమల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, వలస కార్మికుల జీవోను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో శుక్రవారం ధర్నాలు నిర్వహించారు. వందలాది మంది కార్మికులు.. ఎర్రజెండాలు చేతబూని కనీస వేతనాలు పెంచాలని నినాదాలు చేస్తూ కలెక్టరేట్ల ఎదుట బైటాయించారు.

సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక కార్యాలయం (అంజయ్య భవన్) ఎదుట జరిగిన ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్, వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మూడుసార్లు కనీస వేతన సలహా మండలి ఏర్పాటు చేసినా మండలి సిఫార్సులు మాత్రం అమలు చేయకుండా తొక్కి పెట్టిందని విమర్శించారు. అనంతరం కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో హైదరాబాద్‌లోని సీఐటీయూ హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం వెంకటేష్, అధ్యక్షులు కుమారస్వామి, నాయకులు అజయ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ తక్షణమే షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాల సవరణకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. మెదక్ జిల్లాలో నిర్వహించిన ధర్నాలో అదనపు కలెక్టర్ రమేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సిద్దిపేటలో జరిగిన ధర్నాలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి జి. శ్రీనివాస్ మాట్లాడుతూ.. షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ కార్మికులకు రూ. 26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికులకు జీఓ 11ను సవరించి వేతనాలు చెల్లించాలని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో...11లో

31మంది ఐఏఎస్‌ల బదిలీలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. పోస్టింగుల కోసం ఎదురు చూస్తున్న సీనియర్ ఐఏఎస్‌లతో పాటు యువ అధికారులు నూతన బాధ్యతలు స్వీకరిస్తుండటం గమనార్హం. మొత్తం 31 మంది ఐఏఎస్ అధికారుల్ని బదిలీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న సీనియర్ ఐఏఎస్ (1990) అధికారి శశాంక్ గోయల్‌ను మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎమ్‌సీహెచ్ఆర్డీ) డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. ఇప్పటి వరకు ఈ విభాగం అదనపు బాధ్యతల్ని నిర్వహిస్తున్న బెన్హర్ మహేష్ దత్ ఎక్కా (1995)ను రిలీవ్ చేశారు. మరో సీనియర్ ఐఏఎస్ (1997) అధికారి శైలజా రామయ్యర్‌ను యువజన సర్వీసు లు, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. సందీప్ కుమార్ సుల్తానియా (1998) ఈ విభాగం బాధ్యతల్ని ఇప్పటి వరకు అదనంగా నిర్వహిస్తున్నారు. ఆయన్ని రిలీవ్ చేశారు. జీహెచ్ఎంసీలో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న ప్రియాంక అలా (2016) ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ఇక్కడే అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా పనిచేస్తున్న అనుదీప్ దురిశెట్టి (2018) ఇప్పటి వరకు ఈ జిల్లా కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు కూడా నిర్వహించారు. ఆయన్ని రిలీవ్ చేసి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా నియమించారు. వివరాలు ఇలా....

పోస్టు	ఐఏఎస్ పేరు
1. హైదరాబాద్ జిల్లా కలెక్టర్	అనుదీప్ దురిశెట్టి
2. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్	డాక్టర్ శశాంక్ గోయల్
3. యువజన సర్వీసులు, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి	శైలజా రామయ్యర్
4.ఆయుష్ డైరెక్టర్	దాసరి హరిచందన
5.కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి	కష్ణ ఆదిత్య
6. తెలంగాణ స్టేట్ ఫుడ్స్ మేనేజింగ్ డైరెక్టర్	సంగీత సత్యనారాయణ
7. భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్	ప్రతీక్ జైన్
8.సెర్ప్ సీఈఓ	పాట్రు గౌతమ్
9.గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి	నవీన్ నికోలస్...

11లో

నేరస్థుడు, మోసగాడు సుఖేష్
నాపై మతిలేని ఆరోపణలు : మంత్రి కేటీఆర్

- బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'నేరస్థుడు, మోసగాడు సుఖేష్..నాపై మతిలేని ఆరోపణలు చేశాడు. మీడియా ద్వారా అవి నా దష్టికి వచ్చాయి. సుఖేష్ అనే వాడి గురించి నేనెప్పుడూ వినలేదు. వాడెవడో కూడా నాకు తెలియదు. సుఖేష్ అనే ఒక రోగ్ చేసిన అడ్డమైన మాటలపై న్యాయపరంగా గట్టి చర్యలు తీసుకుంటా. ఈ అడ్డగోలు వ్యాఖ్యలను మీడియాలో ప్రసారం చేసే ముందు లేదా ప్రచురించే ముందు జాగ్రత్తగా ఆలోచించుకోవాలని విజ్ఞప్తి' అని మంత్రి కేటీఆర్ శుక్రవారం ట్వీట్ చేశారు. మరోవైపు ఢిల్లీ మద్యం కేసు నిందితుడు సుఖేష్ చంద్రశేఖర్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. తనపై తప్పుడు విషయాలతో కేంద్రానికి, సీబీఐకి ఫిర్యాదు చేశాడని ఆ నోటీసులో...11లో

ఓసారి కరెంటు తీగలు పట్టుకోండి..
విద్యుత్ ఉందో లేదో తెలుస్తుంది...

- కాంగ్రెస్ నేతలనుద్దేశించి మంత్రి హరీశ్ ఎద్దేవా
- వారు అధికారంలోకి వస్తే పాత పాలనే తెస్తారంటూ విమర్శ
- కరెంటు నుంచే తెలంగాణ ఉద్యమం పుట్టిందంటూ వ్యాఖ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇరవై నాలుగు గంటల విద్యుత్ ఎక్కడుందంటూ ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ నేతలు... ఒకసారి కరెంటు తీగలు పట్టుకుని చూడాలని ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చురకలంటించారు. అప్పుడు కరెంటు ఉందో లేదో తెలుస్తుందంటూ ఆయన ఎద్దేవా చేశారు. రైతులకు ఉచిత విద్యుత్‌కు సంబంధించి వారు కుడితలో పడ్డ ఎలుకల్లాగా తలోమాటా మాట్లాడుతు న్నారని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ... వ్యవసా యానికి మూడు గంటల కరెంటు చాలంటూ చెప్పటం ద్వారా ఉచిత విద్యుత్ అంశాన్ని పక్కదారి పట్టించేం దుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు కేవలం నాలుగైదు గంటల కరెంటే వచ్చేదని గుర్తు చేశారు. వారికి ఏడు గంటలపాటు విద్యుత్‌ను సరఫరా చేయలేమంటూ ఆనాటి కాంగ్రెస్ సీఎంలు అధికారికంగా ప్రకటించారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన నేతలు పదే పదే ఉచిత విద్యుత్ గురించి మాట్లాడటం, మూడు ...11లో

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సత్తాచాటిన
తెలంగాణ జిల్లాలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణలో తెలంగాణ జిల్లాలు మరోసారి సత్తా చాటాయి. కేంద్రం ప్రకటించిన 12 జిల్లాల్లో తెలంగాణ నుంచే 4 జిల్లాలున్నాయి. అచీవర్స్, హై అచీవర్స్ విభాగాల్లో 2, 3 స్థానాల్లో తెలంగాణ జిల్లాలు నిలిచాయి. అచీవర్స్ కేటగిరీలో రెండో స్థానంలో హనుమకొండ, మూడో స్థానంలో కొమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలు, హై అచీవర్స్ కేటగిరీలో రెండో స్థానంలో జనగాం, మూడో స్థానంలో కామారెడ్డి జిల్లాలు నిలిచాయి.

పారదర్శకంగా దళితబంధు

- అమలుపై అపోహలొద్దు :మంత్రి కొప్పుల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన దళిత బంధు పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నట్టు రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పారు. శుక్రవారం కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లబ్ది దారుల ఎంపికలో అవకతవకలు, అక్రమాలు జరుగుతున్నట్టు వస్తున్న ఆరోపణల్లో ఎంత మాత్రం వాస్తవం లేదని తెలిపారు. మొదటి దశలో ఎమ్మెల్యేల సూచనలనే లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టడంపై అపోహలు వచ్చాయని తెలిపారు. దీంతో.. కలెక్టర్లకే ఆ బాధ్యత అప్పగించామన్నారు. సంబంధిత జిల్లా మంత్రులు కలెక్టర్లతో కలిసి లబ్దిదారుల ఎంపికపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. దళిత బంధు రెండో విడతలో ప్రభుత్వం కేటాయించిన రూ. 17 వందల కోట్ల నిధుల్లో ఇప్పటికే రూ. 850 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. దశల వారీగా ప్రతి దళిత కుటుంబానికీ పథకాన్ని వర్తింపజేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. విద్య, వైద్య పరంగా అట్టడుగు వర్గాల పేదల కోసం అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. స్వాతంత్ర్యానంతరం నుంచి కూడా అంటరానితనానికి, వివక్షకు గురైన దళిత కుటుంబాల్లో మార్పులు తేవాలన్న లక్ష్యంతో దళితబంధుకు రూపకల్పన చేశామని గుర్తుచేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ కార్యదర్శి రాహుల్ బొజ్జ కూడా పాల్గొన్నారు.

మళ్లీ లొల్లి..

- మంత్రి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మధ్య ఆగని వివాదం
- తారా స్థాయికి చేరిన గొడవలు
- మంత్రి కేటీఆర్ సర్ది చెప్పినా మారని నేతలు..!
- రెండ్రోజుల కింద జెడ్పీ చైర్మెన్ రాజీనామా డ్రామా!

నవతెలంగాణ-సిటీబ్యూరో

మంత్రి మల్లారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి మధ్య మళ్లీ లొల్లి మొదలైంది. అది ఇద్దరు నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయికి చేరింది. తాజాగా ఇరు గ్రూపుల మధ్య మరోసారి విభేదాలు భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే టికెట్ కేటాయింపు మొదలు జెడ్పీ చైర్మెన్‌పై అవిశ్వాసం వరకు వారి మధ్య గొడవలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే రెండు సార్లు మంత్రి కేటీఆర్ మాట్లాడినా ఫలితం లేదు. పార్టీ అధిష్టానం సీరియస్‌గా తీసుకుని నేతల మధ్య సఖ్యత పెంచాలని ఆ పార్టీ కార్యకర్తలు కోరుతున్నారు.


(ఫైల్)

2014 ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి మంత్రి మల్లారెడ్డి ఎంపీగా, మలిపెద్ది సుధీర్‌రెడ్డి మేడ్చల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇద్దరు నేతలూ మూడేండ్లపాటు సఖ్యతగానే ఉన్నారు. 2018 ముందస్తు ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డికి కాకుండా మంత్రి మల్లారెడ్డికి మేడ్చల్ ఎమ్మెల్యే టికెట్ దక్కింది. దాంతో ఇద్దరి మధ్య తగాదాలు మొదలయ్యాయి. అప్పటి నుంచి సుధీర్‌రెడ్డి తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. 2018 ఎన్నికల్లో తన టికెట్‌ను బలవంతంగా లాక్కుని మల్లారెడ్డి ఎమ్మెల్యే అయ్యారని ఆవేదనతో ఉన్నారు. బీఆర్ఎస్ అధిష్టానం సుధీర్‌రెడ్డిని సంతృప్తి పర్చేందుకు ఘట్‌కేసర్ జెడ్పీటీసీగా గెలుపొందిన ఆయన కుమారుడు శరత్‌చంద్రారెడ్డికి జిల్లా పరిషత్ చైర్మెన్ పదవిని కట్టబెట్టింది. కీసర నుంచి జెడ్పీటీసీగా గెలుపొందిన మంత్రి అనుచర గ్రూపునకు చెందిన బెస్త వెంకటేశ్‌కు జెడ్పీ వైస్ చైర్మెన్ పదవి దక్కింది. మంత్రి మల్లారెడ్డికి సమానంగా శరత్‌చంద్రారెడ్డికి క్యాబినెట్ హోదా కట్టబెడుతూ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించింది. హై కమాండ్ వారికి పదవులను పంచింది కానీ.. వారి మధ్య దూరాన్ని మాత్రం తగ్గించలేకపోయింది.

మంత్రి హరీశ్‌రావు ఎదుట వాగ్వాదం

మున్సిపల్ ఎన్నికల సన్నాహక సభలో మంత్రి హరీశ్‌రావు ప్రసంగిస్తున్న సమయంలో ఇద్దరు నేతల మధ్య వాగ్వాదం జరిగింది. హరీశ్‌రావు సమక్షంలోనే మంత్రి మల్లారెడ్డిని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పలు కామెంట్స్ చేశారు. ఇద్దరూ మాటల దాడి చేసుకున్నారు. బోడుప్పల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలోనూ జెడ్పీ చైర్మెన్ శరత్‌చంద్రారెడ్డిని పిలువకపోవడంతో ఆ సమయంలోనూ ఘర్షణ వాతావరణం ఏర్పడింది. సభలోనే ఒకరినొకరు దూషించుకున్నారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో వివాదం అప్పటికి సద్దుమనిగింది.

కలెక్టరేట్ వద్ద రాజీనామా హైడ్రామా..

రెండ్రోజుల కిందట మేడ్చల్ జెడ్పీ వైస్ చైర్మెన్ బెస్త వెంకటేశ్ రాజీనామా డ్రామా ఆసక్తికరంగా మారింది. బెస్త వెంకటేశం తన రాజీనామా లేఖను కలెక్టర్‌కు అందజేసేందుకు వెళ్లారు. కానీ వెంటనే మనస్సు మార్చుకుని రాజీనామాను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారు. వైస్ చైర్మెన్ పదవికి రాజీనామా చేసి జెడ్పీ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టొచ్చనే ప్లాన్ వేసినట్టు తెలిసింది. అయితే బెస్త వెంకటేశ్‌కు బీఆర్ఎస్ హైకమాండ్ నుంచి హెచ్చరికలు రావడంతో వెనుదిరిగారని సమాచారం. తన మండలానికి అభివృద్ధి నిధుల కోసమే రాజీనామా చేస్తున్నట్టు వెంకటేశ్ ప్రకటించినా.. రాజీనామా వెనుక అసలు కథ వేరే ఉన్నట్టు బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. జెడ్పీ చైర్మెన్‌పై అవిశ్వాసం నెగ్గితే వైస్ చైర్మెన్‌కు చైర్మెన్ పదవి దక్కే అవకాశం ఉంది. వైస్ చైర్మెన్‌తో మొదట రాజీనామా చేయించి ఆ తర్వాత కీసర, మేడ్చల్, శామీర్‌పేట జెడ్పీటీసీలతో కలిసి అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వొచ్చని మరో గ్రూపు ప్లాన్ వేసినట్టు బీఆర్ఎస్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

నేడు విజయవాడలో బిఎస్ రావు అంత్యక్రియలు

- తాడిగడప శ్రీచైతన్య మెయిన్ క్యాంపస్ నుంచి అంతిమయాత్ర

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


(ఫైల్)

శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బిఎస్ రావు అంత్యక్రియలు శనివారం విజయవాడలో జరగనున్నాయి. ఉదయం 8.30 గంటలకు అక్కడి తాడిగడప శ్రీచైతన్య మెయిన్ క్యాంపస్ నుంచి అంతిమయాత్ర ప్రారంభమవుతుందని శుక్రవారం కుటుంబ సభ్యులు ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో గుండెపోటుతో బిఎస్ రావు మరణించిన విషయం తెలిసిందే. ఆయన పార్థివ దేహాన్ని విజయవాడ తాడిగడప శ్రీచైతన్య మెయిన్ క్యాంపస్‌కు తరలించి సందర్శనార్థం ఉంచారు. రాజకీయ నాయకులు, విద్యా, వ్యాపారవేత్తలతోపాటు పలు రంగాలకు చెందిన ప్రముఖులు వచ్చి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితోపాటు ప్రజలు తాడిగడపకు వచ్చి శ్రద్ధాంజలి ఘటించారు. అమెరికా నుంచి ఆయన చిన్న కుమార్తె సీమ శుక్రవారం విజయవాడకు చేరుకున్నారు. శనివారం ఉదయం 8.30 గంటలకు ఆయన అంతిమయాత్రను ప్రారంభిస్తారు. ఈడుపుగల్లులోని వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలను నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

పాలిటెక్నిక్ కాలేజీల్లో మిగిలిన సీట్లు 9,595

22,144 మందికి సీట్లు కేటాయింపు

- 17 వరకు కాలేజీల్లో చేరేందుకు గడువు
- 21 నుంచి తరగతులు ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, పాలిసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ ఒక ప్రకటన విడుదల చేశారు. 118 పాలిటెక్నిక్ కాలేజీల్లో 31,739 సీట్లున్నాయని తెలిపారు. 22,144 (69.76 శాతం) సీట్లు కేటాయించామని వివరించారు. ఇంకా 9,595 (30.24 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. 56 ప్రభుత్వ కాలేజీల్లో 13,494 సీట్లుంటే, 11,336 (84 శాతం) సీట్లు భర్తీ చేశామని తెలిపారు. 2,158 (16 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. 62 ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 18,245 సీట్లకుగాను 10,808 (59.23 శాతం) మందికి సీట్లు కేటాయించామని వివరించారు. 7,437 (40.77 శాతం) సీట్లు మిగిలిపోయాయని తెలిపారు. సీట్లు కేటాయించిన అభ్యర్థులు తప్పనిసరిగా వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. ఈనెల 16 వరకు ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. సీట్లు కేటాయించిన కాలేజీల్లో చేరేందుకు ఈనెల 17 వరకు గడువుందని వివరించారు. లేదంటే సీట్లు రద్దవుతాయని స్పష్టం చేశారు. శనివారం నుంచి విద్యాసంవత్సరం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈనెల 20 వరకు ఓరియెంటేషన్ తరగతులను నిర్వహిస్తామని పేర్కొన్నారు. 21 నుంచి పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. పూర్తి వివరాలకు https://tspolycet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వైవిధ్యభరిత పంటలతోనే అధిక ఆదాయం

ఉద్యాన, కూరగాయ పంటల సాగుపై దృష్టి సారించాలి

- సాగుకు ముందుకొచ్చే రైతుల వివరాలు సేకరించాలి : వర్క్‌షాపులో మంత్రులు దయాకర్‌రావు, నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



వైవిధ్యభరితమైన పంటల సాగుతోనే రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. రైతులు ఉద్యాన, కూరగాయల పంటలపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో ఉద్యాన పంటల సాగుకు ముందుకొచ్చే రైతుల వివరాలు సేకరించాలనీ, టార్గెట్‌ను ఆగస్టు 31వ తేదీలో లోపు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఉద్యానశాఖల సంయుక్త ఆధ్వర్యంలో 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు పెంచడమే లక్ష్యంగా కన్వర్జెన్స్ వర్క్‌షాపును నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రావు, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, స్పెషల్ కమిషనర్లు వీఎన్ఎస్‌వీ ప్రసాద్, ప్రదీప్‌శెట్టి, గ్రామీణాభివృద్ధి, ఉద్యాన శాఖలకు చెందిన 32 జిల్లాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ..ఉపాధి హామీ చట్టం, ప్రధానమంత్రి కృషి సించయి యోజన, ఉద్యానవన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో ఆయిల్‌ఫామ్ సాగు ప్రారంభమైందని గుర్తుచేశారు. ప్రతి జిల్లాకో పామాయిల్ కంపెనీ వచ్చే అవకాశముందని తెలిపారు. వైవిధ్యభరితమైన పంటలను సాగు చేసేలా రైతుల ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లో కూరగాయల పెంపకం దారులు డ్రిప్ ఇరిగేషన్ గురించి అడుగుతున్నారనీ, వారిని గుర్తించి లబ్దిచేకూరేలా చూడాలని అధికారులకు సూచించారు. 50వేల ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగు టార్గెట్ ను అనుకున్న సమయం కంటే ముందే పూర్తి చేస్తే కేంద్రానికి లేఖ రాసి మరింత మందికి లబ్ధికలిగేలా అనుమతులు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుత రోజులల్లో ఎంతోమంది ఉద్యోగులు, ఇంజినీర్లు, డాక్టర్లు, సాఫ్ట్‌వేర్లు వ్యవసాయం చేయడానికి ముందుకు వస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో బాగా చదువుకున్న రైతులకు కొత్త రకాల పంటలు, బాగా ఆదాయం వచ్చే ఆహార పంటలు, పండ్ల తోటలు పెంచేందుకు అవసరమైన అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం, పీఎమ్‌కేఎస్‌వై, ఉద్యానశాఖల ద్వారా అన్ని అవకాశాలను రైతులు ఉపయోగిం చుకోవాలని సూచించారు. జిల్లాస్థాయి ల్లో సమావేశాలు నిర్వహించాలనీ, రైతు వేదికల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

దేశంలోనే తెలంగాణ నెంబర్‌వన్ టూరిజం స్పాట్

- వికలాంగుల శిక్షణ ప్రారంభోత్సవంలో మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆతిథ్యం, సహకారం అందించడంలో తెలంగాణ ముందు వరుసలో ఉంటుందనీ, దేశంలోనే నెంబర్‌వన్ టూరిజం స్పాట్ అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో తలపెట్టిన దివ్యాంగుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సెర్ప్ డైరెక్టర్ వైఎస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మనస్సున్న మహారాజు అనీ, ఆయన వికలాంగుల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. పెన్షన్‌ను రూ.4000కు పెంచారని తెలిపారు. హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. మన రాష్ట్ర ఆతిథ్యం కోసం ఇతర దేశాల వాళ్ళు పోటీపడే పరిస్థితి వచ్చిందని తెలిపారు. హైదరాబాద్‌కున్న అనుకూలతలు, సౌకర్యాలతో పెద్దపెద్ద కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. శిక్షణ ద్వారా ప్రతి ఒక్కరూ ఈ రంగంలో నిష్ణాతులు కావాలని ఆకాంక్షించారు.

గ్యాస్ లీకేజ్ ఘటనలో మరో ముగ్గురు మృతి

నవతెలంగాణ-అడిక్‌మెట్

హైదరాబాద్ దోమలగూడ గ్యాస్ లీకేజ్ ఘటనలో శుక్రవారం మరో ముగ్గురు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. దోమలగూడ రోజ్ కాలనీలోని ఓ ఇంట్లో ఈనెల 11న గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు తీవ్రంగా గాయపడగా వారిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన ధనలక్ష్మి కూతురు శరణ్య పరిస్థితి విషమించి ఈనెల 12న మృతిచెందింది. పద్మ(53), ఆమె కూతురు ధనలక్ష్మి (28), ధనలక్ష్మి కుమారుడు అభినవ్(7) పరిస్థితి విషమించి శుక్రవారం చనిపోయారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది.

హామీలు అమలు చేయనందుకే సమ్మె..

దాన్ని విచ్ఛిన్నం చేయాలని చూడటం న్యాయమా?

- చర్చలు జరపండి.. సమస్యలు పరిష్కరించండి
- లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తాం : పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయనందుకే..తిరిగి కొట్లాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ,కార్మిక సంఘాల జేఏసీ నేతలు గుర్తుచేశారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ యజ్ఞనారాయణ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ గతంలో 46రోజులు ప్రభుత్వంతో కొట్లాడటంతో మూలంగా సంబంధిత శాఖ మంత్రి, అధికారులు జేఏసీతో చర్చలు జరిపి, పలు సమస్యలను పరిష్కారిస్తామంటూ ప్రభుత్వం తరుపున హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీలు ఏ ఒక్కటి అమలు కానందు వల్లే తిరిగి సమ్మెలోకి పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.చట్టబద్ధంగా, న్యాయసమ్మతంతో కార్మికులు తమ హక్కులు సాధించుకునేందుకు, సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా సమ్మె చేస్తుంటే..ప్రారంభం రోజు నుంచే సర్కార్ సమ్మె విచ్ఛిన్నానికి పాల్పడటం ఎంత వరకు సబబో చెప్పాలని ప్రశ్నించారు. స్వచ్ఛ తెలంగాణ కోసం నిరంతరాయంగా కష్టపడుతున్న కార్మికులకు కనీసం గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందా? అని పలువురు అడుగుతుంటే బాధేస్తున్నదని తెలిపారు. సామాజికంగా అత్యంత వెనుకబడిన తరగతులనుంచి వచ్చిన ఉద్యోగులు, కార్మికుల పట్ల సర్కారుకు ఇంత నిర్లక్ష్యం తగదని హితవు పలికారు. బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు..కానీ..ఆ వాగ్దానం ఏ గంగలో కలిసిందో అర్థం కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.' అందరి జీతాలు పెరిగాయి. కానీ..గ్రామ పంచాయతీ కార్మికుల, ఉద్యోగుల జీతాలు పెరగలేదు. వీరు ఏం పాపం చేసుకున్నారో..జీతాలు ఎందుకు పెంచటం లేదో సర్కార్ సమాధానం చెప్పాలి'అని ప్రభుత్వాన్ని నిలదీశారు. పొట్టకూటి కోసం, హక్కుల కోసం కార్మికులు చేసే సమ్మె ఇది, దీన్ని అణచాలనీ, పోటీ కార్మికులతో సమ్మెను విచ్ఛిన్నం చేయా లని చూడటమంటే..మా బతుకులను బుగ్గిపాలు చేసేందుకు ఈ ప్రభుత్వం కంకణం కట్టుకున్నదా? అని ప్రశ్నించారు. అదే సర్కార్ లక్ష్యమైతే వీపు విమానం మోత మోగక తప్పదని హెచ్చరించారు. మీ పన్నాగాల పప్పులుడకవ్ అని హెచ్చరించారు. 558 గ్రామీణ మండలాలకు గానూ, 483 మండలాల్లో సమ్మె విజయవంతంగా జరుగుతున్నదని తెలిపారు. మొదటి రోజు 34వేల మంది సమ్మెలో పాల్గొంటే..ప్రస్తుతం 43వేల మంది సమ్మెలో ఉన్నారన్నారు. భవిష్యత్‌లో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వం ముందు పలు డిమాండ్లు..

గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి.వేతనాలకు ప్రభుత్వమే బడ్జెట్ కేటాయించాలి.పీఆర్సీలో నిర్ణయించిన బేసిక్‌పే రూ.19వేల వేతనం ఇవ్వాలి. జీవో నెంబర్ 60 ప్రకారం మున్సిపల్ సిబ్బంది మాదిరిగా గ్రామ పంచాయతీ సిబ్బందికి కూడా సమానంగా చెల్లించాలి. కారోబార్, కలెక్టర్లకు సహాయ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించాలి. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి,జీవో నెంబర్ 51ని సవరించాలి ఈ డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే జేఏసీతో చర్చలు జరపాలని తీర్మానాన్ని ఆమోదించింది.

భవిష్యత్ కార్యాచరణ..

ఈ నెల 18న నియోజక వర్గ కేంద్రాల్లో మహాప్రదర్శనలు నిర్వహించి, ఎమ్మెల్యేలకు సామూహిక వినతిపత్రాలు ఇవ్వాలి. 19న రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, సామాజిక, ప్రజాసంఘాలతో కలిసి మండల కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించాలి.20న సమ్మె డిమాండ్లను పరిష్కరించాలంటూ తీర్మానాలు చేయాలి. కుటుంబ సభ్యులతో దీక్షలు నిర్వహించాలి. 21న వాటర్, స్టీల్ ప్లాంట్లు బంద్ పెట్టాలి.

ఈ సమావేశంలో జెఏసి కన్వీనర్లు పి. వెంకట రాజం (ఏఐటీయూసీ) ఎన్ దాసు (ఐఎఫ్‌టీయూ), పి అరుణ్ (ఐఎఫ్‌టీయూ), శివబాబు (ఐఎఫ్‌టీయూ), సదానందం (టీజీవీయూ), చాగంటి వెంకటయ్య, పాండు, పాలడుగు సుధాకర్, పి గణపతిరెడ్డి, పొట్ట యాదమ్మ, (సీఐటీయూ), యాదయ్య (ఐఎఫ్‌టీయూ), మధుసూదన్ (ఐఎఫ్‌టీయూ), ఆర్కేనాయుడు (టీజీకేబీయు), వెంకన్న(ఐఎఫ్‌టీయూ)తో పాటు వివిధ జిల్లాల జేఏసీ చైర్మెన్లు, ప్రధాన కార్యదర్శులు, యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

టీయూ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా వాకాటి కరుణ



నవతెలంగాణ-డిచ్‌పల్లి/హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ) ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ (వీసీ)గా విద్యాశాఖ కార్యదర్శి, ఉన్నత విద్యాశాఖ ఇన్‌చార్జి కమిషనర్ వాకాటి కరుణను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ పదవిలో ఆమె కొనసాగుతారని తెలిపారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. టీయూ వీసీగా ఉన్న రవీందర్ గుప్తా లంచం తీసుకుంటూ ఇటీవల ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. దీంతో ఆయన్ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలోనే టీయూ ఇన్‌చార్జి వీసీగా వాకాటి కరుణను ప్రభుత్వం నియమించింది. ఆమె ప్రస్తుతం విద్యాశాఖ కార్యదర్శిగా, ఉన్నత విద్యాశాఖ, సాంకేతిక విద్యాశాఖకు ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేస్తున్నారు.

పరిహారం కోసం 3 గంటలు నిర్వాసితుల పడిగాపులు

- వారికి మద్దతుగా ఎమ్మెల్యే.. ఫలించిన నిరీక్షణ..
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి చొరవతో చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-తొగుట

పరిహారం కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద 3 గంటలు వేచి ఉన్న నిర్వాసితులకు.. కలెక్టర్ ఆదేశాలతో అదనపు కలెక్టర్ చెక్కులు పంపిణీ చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లాలోని మల్లన్న సాగర్ ప్రాజెక్టులోకి అదనపు టీఎంసీ నీటిని తరలించేందుకు ప్రభుత్వం ఓపెన్ కెనాల్ నిర్మాణం చేపట్టింది. భూసేకరణ సమయంలో తొగుట మండలంలోని బండారుపల్లి 127, ఘనపూర్ 72, ఎల్లారెడ్డిపేట 85 మంది రైతులకు రూ.13 లక్షల పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. హామీ ప్రకారం ప్రభుత్వం రూ.8లక్షల పరిహారం అందించారు. మరో రూ.5 లక్షలు కోర్టు ద్వారా పొందాలని సూచించారు. కాగా, రైతులకు రూ.5 లక్షలు అందించాలని కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో.. శుక్రవారం పరిహారం చెక్కులు వచ్చాయని తెలుసుకున్న నిర్వాసితులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అధికారులు శనివారం కలెక్టర్ కార్యాలయంలో పంపిణీ చేస్తారని చెప్పడంతో నిర్వాసిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ.. భూములు కోల్పోయిన తమకు ఇంతకు ముందు కెనాల్ నిర్మాణంలో తహసీల్దార్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేయగా.. ఇప్పుడు కలెక్టరేట్‌లో ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. హైదరాబాద్ నుంచి అన్నం లేకుండా, టిఫిన్ చేయకుండా, తిండి తిప్పలు మాని చెక్కుల కోసం వస్తే ఇలా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. చెక్కులు పంపిణీ చేసేంతవరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు. కాగా, గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపేందుకు వచ్చిన దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు.. నిర్వాసితుల ఆందోళన విషయం తెలుసుకొని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌ను చెక్కుల విషయం అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ నుంచి తమకు ఆదేశాలు లేవని తహసీల్దార్ ఎమ్మెల్యేకు వివరించారు. విషయం మీడియా, సోషల్ మీడియా ద్వారా బహిర్గతం కావడంతో వెంటనే అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తొగుటకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఎమ్మెల్యేతో మాట్లాడి అనంతరం కలెక్టర్‌కు విషయాన్ని తెలిపారు. దాంతో తహసీల్దార్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయడంతో నిర్వాసితులు ఆందోళన విరమించారు.

టీఎస్ ఐపాస్‌తో ఉపాధి అవకాశాలు

వస్తు తయారీ రంగంలో జపాన్ అగ్రగామి

- పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-షాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని ఐటీ, మున్సిపల్, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందన్‌వెల్లి పారిశ్రామిక వాడలో జపాన్‌కు చెందిన డైపూర్ ఇంట్రాలాజిస్టిక్స్ ఇండియా, నికోమాక్ కిషా ఆటోమోటెడ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ ఏర్పాటుకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. హిరోషిమా, నాగసాకిపై అణుబాంబుల విధ్వంసాన్ని తట్టుకొని జపాన్ తనదైన శైలిలో అభివృద్ధి చెంది, ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. జపాన్ కంపెనీల ఆధ్వర్యంలో నిర్మించనున్న పరిశ్రమతో.. చందన్‌వెల్లి రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక హబ్‌గా రూపాంతరం చెందుతుందన్నారు. రూ.575 కోట్ల పెట్టుబడితో ప్రారంభిస్తున్న ఈ కంపెనీ ద్వారా ప్రత్యక్షంగా 1800 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. వికారాబాద్ జిల్లాలోని ఐటీఐని ఈ సంస్థ దత్తత తీసకొని, ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చి.. ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. చందన్‌వెల్లి పారిశ్రామిక వాడలో ప్రతిష్టాత్మకమైన ఆమెజాన్, వెల్సన్, కుందన్, కటెరా, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు ఈ ప్రాంతవాసులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు.

అలాగే సీతారాంపూర్‌లోని పారిశ్రమికవాడలో వోలెక్ట్రా ఎలాక్ట్రానిక్ వెహికిల్ ఉత్పత్తి ప్లాంట్‌ను త్వరలోనే ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ఐ పాస్ ద్వారా పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు ఇస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్‌లో షాబాద్ మండలానికి ప్రపంచస్థాయిలో గుర్తింపు వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో జపాన్ కాన్సులేట్ జనరల్ మైసూకి తాగా, ఎండీ శ్రీనివాస్ గరిమెళ్ల, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయష్ రంజన్, టీఎస్ ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కార్తీక్‌రెడ్డి, చందన్‌వెల్లి సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం!

నేడు ప్రభుత్వ పాఠశాలల్లో 'పీటీఎం'

- విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆహ్వానం

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థుల చదువు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచేలా పీటీఎం(పేరెంట్స్-టీచర్స్ మీటింగ్) నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతేడాది ఆగస్టులో ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం పీటీఎం నిర్వహించి తరగతుల వారీగా విద్యార్థుల ప్రగతిని సమీక్షిస్తున్నది.

అన్ని పాఠశాలల్లో నిర్వహణకు అధికారుల ఏర్పాట్లు

ఈ విద్యాసంవత్సరం తొలి పీటీఎం సమా వేశం శనివారం నిర్వహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు ఏర్పాట్లు చేశారు.

హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 691 పాఠశాలల్లో ప్రారంభించడానికి హెచ్ఎంలు, సమగ్ర శిక్షణ అధికారులు పీటీఎంకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ప్రధానో పాధ్యాయులు విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు చేరవేశారు. ప్రతి తరగతిలోని విద్యార్థి తల్లిదండ్రులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు హెచ్ఎంలకు ఆదేశాలు జారీచేశారు. ఆపై పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో చర్చించిన అంశాల నివేదికను మండల విద్యాధికారులు, డీఈవోకు సమర్పించాలి.

మీటింగ్ ఫొటోలు విధిగా ఉన్నతాధికారులకు పంపించాలి. పీటీఎంను అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాల్సి బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పీటీఎం నిర్వహణపై సూచనలు

- పిల్లల విద్యాపరమైన ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర అతి కీలకం. అందువల్ల పీటీఎంలో తల్లిదండ్రుల హాజరు వందశాతం ఉండేటట్టుగా చూడాలి.
- ప్రధానోపాధ్యాయులు ముందుగానే విద్యార్థుల ద్వారా రాతపూర్వకంగా, ఆహ్వానం పంపడం ద్వారా తల్లిదండ్రులకు ముందస్తు సమాచారం అందించాలి.
- ఇప్పటివరకు హాజరుకాని తల్లిదండ్రులపై హెచ్ఎంలు ప్రత్యేకంగా దృష్టి సారించి, వారు తప్పకుండా హాజరయ్యేటట్టు చూడాలి.
- గ్రామీణ ప్రాంతంలో చాలా మంది తల్లిదండ్రులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండటం.. పట్టణ ప్రాంతాల్లో ఇతర పనుల్లో నిమగ్నమై ఉండటం వల్ల తల్లిదండ్రులు సమావేశానికి హాజరయ్యేలా చేయడానికి, వారికి అనుకూలమైన సమయానికి పీటీఎం నిర్వహించాలి.
- ప్రధానోపాధ్యాయులు పీటీఎం సమావేశ విషయాలను రికార్డ్ (మినిట్స్) చేయాలి.
- మండల విద్యాశాఖాధికారులు నేడు(శనివారం) జరగనున్న పేరెంట్ - టీచర్స్ మీటింగ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు, అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలు అందించాలని తెలియజేశారు.

కూలిరేట్ల పోరాటాలను ఉధృతం చేయాలి

- పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాలు వెంటనే ఇవ్వాలి : అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా కూలిరేట్ల పోరాటాలను ఉధృతం చేయాలని వ్యవసాయ కూలీలకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాలను వెంటనే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వేతనాలు పెరగకపోవడం వల్ల వ్యవసాయ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక కనీస వేతన జీవోను సమీక్షించకపోవడం విచారకరమని తెలిపారు. వెంటనే ఆ జీవోను సమీక్షించి కేరళ ప్రభుత్వం మాదిరిగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కూలిరేట్లపై రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్లు, లేబర్ అధికారుల ద్వారా గ్రామాల్లో ప్రచారం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పోరేట్ విధానాల వల్ల దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయనీ, దీంతో వ్యవసాయ కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని వాపోయారు. వంటగ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయనీ, విద్య, వైద్యం పేదలకు అందుబాటులో లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇంటి స్థలం పట్టాలివ్వాలనీ, గృహలక్ష్మి ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు, రాష్ట్రంలో 14 లక్షల ఎకరాల పోడు భూములుండగా ప్రభుత్వం సగం మందికి కూడా పట్టాలివ్వలేదని విమర్శించారు. దరఖాస్తు చేసుకున్న సాగుదారులందరికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, మచ్చ వెంకటేశ్వర్లు, బి.పద్మ, పొన్నం వెంకటేశ్వరరావు, నారి అయిలయ్య, ములకలపల్లి రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీసీ కొత్త పరిశ్రమతో గ్రామాల అభివృద్ధి

- 8వ ప్లాంట్ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు : పర్యావరణ ప్రజా అభిప్రాయ సేకరణలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు



నవతెలంగాణ -బూర్గంపాడు

ఐటీసీ సంస్థ.. కొత్త పరిశ్రమను ఏర్పాటు చేయటంతో గ్రామ అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ సంస్థ భద్రాచలం యూనిట్ వద్ద కాగితం, కాగితం బోర్డు కెపాసిటీని పెంచడానికి ప్రతిపాదిత మిల్లు నిర్మాణానికి భద్రాచలం పబ్లిక్ స్కూల్ ప్లే గ్రౌండ్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రణాళికా పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రేగా కాంతారావు పాల్గొని మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఎవరి అభిప్రాయం వారు చెప్పారన్నారు. కంపెనీని విస్తరించడంతో కంపెనీకి లాభాలతో పాటు స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. గతేడాది వరదలు వచ్చినప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా ఐటీసీ యాజమాన్యం సహాయ సహకారాలు అందించిందని గుర్తు చేశారు. మంత్రి కేటీఆర్ నాయకత్వంలో పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందుతుందని వివరించారు. అనంతరం మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత మాట్లాడుతూ.. ఐటీసీ పరిశ్రమ విస్తరణ వల్ల నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, పాయం వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీ వైస్ చైర్మెన్ బి.అయోధ్య, బూర్గంపాడు జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, మాజీ జెడ్పీటీసీ తాళ్ళూరి పంచాక్షరయ్య, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎన్జీవోలు, ఐటీసీ విస్తరణ ప్రతిపాదిత ప్రాజెక్టుపై పర్యావరణ కాలుష్య నియంత్రణపై మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రిక మండలి ఈఈ రవీందర్, పీఏసీఎస్ చైర్మెన్ బిక్కసాని శ్రీనివాసరావు, ఐటీసీ యూనిట్ హెడ్ సిద్ధార్థ్ మహంతి, ఐటీసీ (హెచ్ఆర్) శ్యామ్ కిరణ్, ఐటీసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చంగల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విచ్ఛిన్నానికి కుట్రలు

తమ జీవితాలకు భద్రత.. జీవనానికి అవసరమైన వేతన పెంపు కోసం జీవో 60 అమలు చేయాలంటూ సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం కనికరం చూపడం లేదు. పైగా సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అధికారులు, పోలీసులు కలిసి కుట్ర చేస్తున్నారు. పలు చోట్ల పోటీ కార్మికులతో పనులు చేయించే ప్రయత్నం చేయగా జీపీ కార్మికులు, సీఐటీయూ నాయకులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

- పలు చోట్ల పోటీ కార్మికులతో పనులు చేయించే యత్నం
- అడ్డుకున్న కార్మికులు, సీఐటీయూ నేతలు
- కనికరం చూపని ప్రభుత్వం
- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె
- ఎమ్మెల్యేలకు వినతి పత్రాలందజేత

నవతెలంగాణ- విలేకరులు

తమ జీవితాలకు భద్రత.. జీవనానికి అవసరమైన వేతన పెంపు కోసం జీవో 60 అమలు చేయాలంటూ సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం కనికరం చూపడం లేదు. పైగా సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అధికారులు, పోలీసులు కలిసి కుట్ర చేస్తున్నారు. పలు చోట్ల పోటీ కార్మికులతో పనులు చేయించే ప్రయత్నం చేయగా జీపీ కార్మికులు, సీఐటీయూ నాయకులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రంలో పోటీ కార్మికులతో పనులు చేయించేందుకు యత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తోపులాట జరిగి ఉద్రిక్తంగా మారింది. నవీపేట్ పంచాయతీ స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో ఎంపికైంది. దాంతో శనివారం కేంద్ర బృందం తనిఖీలకు రానుండటంతో ప్రత్యేక అధికారి, డీఎల్‌పీఓ నాగరాజు పోటీ కార్మికులతో పారిశుధ్య పనులు నిర్వహించేందుకు గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను సమ్మె శిబిరం ముందు నుంచి తీసుకెళ్లే యత్నం చేశారు. కార్మికులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడి శ్రీనివాస్ అడ్డుకున్నారు. దీంతో ఎంపీడీవో సాజిద్ అలీ, ఎంపీఓ రామకృష్ణ, ఎస్ఐ రాజారెడ్డి పోలీసు బందోబస్తుతో కార్మికులు, నాయకులను అడ్డు తొలగించేందుకు ప్రయత్నించగా.. తోపులాట జరిగి ఘర్షణ వాతావరణం ఏర్పడింది. గ్రామాల్లో కార్మికులతో వెట్టి చాకిరీ చేయించే జీవో 51ను వెంటనే రద్దు చేయాలని నూర్జహాన్ డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ సమ్మె విరమించబోమని తేల్చి చెప్పడంతో ఎస్ఐ రాజారెడ్డికి సీఐటీయూ నాయకులు, కార్మికుల మధ్య గంటకు పైగా వాగ్వివాదం జరిగింది.



చివరకు కార్మికులు పట్టువీడకపోవడంతో పోలీసులు, అధికారులు వెనుదిరిగారు.నల్లగొండ జిల్లాలోని అడవిదేవులపల్లి మండలంలో జీపీ కార్మికుల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మద్దతు తెలిపారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం జేఏసీ ప్రతినిధులతో వెంటనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి తక్షణమే సమస్యల్ని పరిష్కరించాలన్నారు. డిండిలో జీపీ కార్మికుల సమ్మె శిబిరాన్ని ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సందర్శించగా.. వినతి అందజేశారు. నల్లగొండ జిల్లా కనగల్లులో సమ్మెకు తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) మద్దతు తెలిపింది. సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో వేరే వారితో పనులు చేయిస్తున్నారని గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. గ్రామ కార్యదర్శి ఫాతిమా పోటీ కార్మికులతో పని చేయిస్తుండగా జీపీ కార్మికులంతా గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లారు. ప్రయివేట్ కార్మికులకు దండాలు పెడుతూ మా పొట్ట కొట్టొద్దని అభ్యర్థించారు. అనంతరం ఎంపీపీ చింతా కవితరాధారెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఖమ్మం జిల్లా తల్లాడలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు కార్మికులు వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రంలో జీపీ కార్మికుల దీక్షలకు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ మద్దతు తెలిపి మాట్లాడారు. ఇబ్రాహీంపట్నం కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంకు మురళి కార్మికులకు సంఘీభావం తెలిపారు. షాబాద్‌లో కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు.

వరంగల్ రైల్వేస్టేషన్‌లో 'కూలిన వాటర్ ట్యాంక్'

ఐదుగురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-వరంగల్/మట్టెవాడ

వరంగల్ రైల్వే స్టేషన్‌లో వాటర్ ట్యాంక్ కూలి ప్రయాణికులపై పడటంతో ఐదురుగురికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుల బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సుమారు 1.30 గంటలకు వరంగల్ రైల్వే స్టేషన్ ఒకటవ ప్లాట్‌ఫామ్ రేకుల షెడ్డుపైనున్న వాటర్‌ట్యాంక్ ఒక్కసారిగా కుప్పకూలడంతో ప్రయాణికులు రైలు పట్టాల మీదికి పరుగులు తీశారు. ఐదుగురికి తీవ్రగాయాలు కాగా వారికి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. బాధితులు.. వరంగల్ నగరంలోని 16వ డివిజన్ కీర్తినగర్‌కు చెందిన నమిండ్ల శకుంతల, నమిండ్ల కిషన్‌రావు, వరంగల్‌కు చెందిన రమాదేవి, రామబ్రహ్మం, వారి కుమారుడు హరీష్‌గా గుర్తించారు. శకుంతలకు స్వల్ప గాయాలు కాగా.. కిషన్‌రావుకు తొడ ఎముక విరిగింది. రమాదేవి, రామబ్రహ్మం, హరీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని మెరుగైన వైద్యం కోసం హన్మకొండలోని రోహిణి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. వైద్య సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కాగా, వాటర్ ట్యాంక్ పడిపోవడానికి గల కారణాలపై రైల్వే సిబ్బంది ఆరా తీస్తున్నారు. డీఆర్ఎం సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై వివరాలు సేకరించారు. నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగి ఉంటే బాధ్యులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సంపాదకీయం


'చంద్ర'యానం...

పడిపోవటమే కాదు... పడితే లేచి నిలబడటం... దాన్నుంచి తడబడకుండా నడవడం... అన్నింటినీ ఎదుర్కొని ముందుకు సాగడం... చివరకు గెలిచి చూపించడం... అంటే ఏమిటో నిరూపించింది మన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో). చంద్రమండలంపై పరిశోధనలకు ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 భారత కీర్తిని మరోసారి చరిత్ర పుటలకు

ప్రపంచంలో అనేక దేశాలు, పరిశోధనా సంస్థలు ఎన్నో ప్రయోగాలు చేస్తున్నాయి. మరెన్నో అద్భుతాలు సృష్టిస్తున్నాయి. ఇరవై ఏండ్ల కిందట మనం ఎవరితోనైనా మాట్లాడాలంటే ల్యాండ్‌ఫోనే దిక్కు. కానీ పరిశోధనలతో 2జీ నుంచి మొదలుకుని ఇప్పుడు 5జీ వరకు స్మార్ట్‌ఫోన్ సేవలు పొందుతున్నాం. ఇవన్నీ పరిశోధనలు అందించిన ఫలితాలే. మనం సాధించిన అత్యాధునిక సాంకేతికతకు ప్రతీకలే. వీటన్నింటిలోకి అత్యున్నతమైనది అంతరిక్ష పరిశోధన. ఇందులో భారత్ సాధించిన ఒక అద్భుత విజయం చంద్రయాన్-3.

చేర్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా శ్రీహరికోట సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2:35 గంటలకు అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన రాకెట్ విజయవంతంగా భూకక్ష్యలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయంలో వ్యోమనౌక నుంచి విడిపోయిన ఉపగ్రహం నిర్దేశిత గమ్యం వైపు వేగంగా పయనిస్తోంది. దాదాపు 24 రోజులు చంద్రుని చుట్టూ ప్రదిక్షణ చేసి ఆగస్టు 23 తర్వాత చంద్రునిపై దీని ల్యాండర్ అడుగుపెట్టనుంది. ఇది ఇస్రోకు అతిపెద్ద విజయం. ఈ రాకెట్ తయారీ కోసం రాత్రింబవళ్లు అహర్నిశలు కృషిచేసిన ఇస్రో బృందానికి యావత్తూ దేశం అభినందనలు తెలుపుతోంది.

కొత్త తరహాలో పరిశోధనలు, వాటి ఫలితాలు దేశానికి చాలా అవసరం. అయితే వైఫల్యాల నుంచి వచ్చే విజయాలు ప్రగతిని మరోమెట్టుకు ఎక్కిస్తాయి. అలాంటిదే నేటి చంద్రయాన్-3 విజయం. చంద్రునిపై వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేయడం, భవిష్యత్తులో మానవ సహిత చంద్రయాన్ ప్రయాణానికి అవసరమైన పరిశోధనలను చేపట్టడం ఈ చంద్రయాన్-3 లక్ష్యం. దీనికంటే ముందే 2008లో చంద్రయాన్-1 ప్రయోగంతో పంపిన ఆర్బిటర్ చంద్రునిపై నీటి ఆనవాళ్లను గుర్తించింది. కానీ 2019లో చేపట్టిన చంద్రయాన్-2 ఇస్రో చరిత్రలో పాక్షిక విజయాన్నే నమోదు చేసింది. అంతరిక్షంలోకి ఆర్బిటర్ ద్వారా ఒక ల్యాండర్‌ను, ఒక రోవర్‌ను పంపగా సాఫ్ట్ ల్యాండింగ్ జరగకపోవడంతో అందులోని ప్రజ్ఞాన్ రోవర్ నిరుపయోగమైంది. ఆర్బిటర్ మాత్రం చాలాకాలం చంద్రుని చుట్టూ తిరిగి తన పరిశోధనలందించింది. అప్పట్లో ఇస్రో దీనిగురించి స్పందిస్తూ తొంభై ఎనిమిది శాతం ఈ ప్రయోగం విజయవంతమైనట్లు స్పష్టం చేసింది. మొదటి, రెండు ప్రయోగాల తర్వాత ఇస్రో ఆకాశమంత అనుభవాన్ని సాధించింది. అపజయాలను విజయాలకు సోపానాలుగా మలుచుకుంది. రెట్టించిన ఉత్సాహంతో కొత్త సాంకేతిక పరికరాలకు రూపకల్పన చేసింది. అదే చంద్రయాన్-3. ఈసారి ప్రయోగంలో ఆర్బిటర్‌ను ప్రవేశపెట్టలేదు. కేవలం లాండర్, రోవర్‌లను మాత్రమే చేర్చింది. మూడు వేల తొమ్మిది వందల కిలోల బరువు ఉన్న లాండర్, రోవర్, ఇతర ఉపకరణాలను ఎస్‌వీఎం3-ఎం4 భారీ రాకెట్ నింగికి మోసుకెళ్లింది.



ప్రపంచంలో అనేక దేశాలు, పరిశోధనా సంస్థలు ఎన్నో ప్రయోగాలు చేస్తున్నాయి. మరెన్నో అద్భుతాలు సృష్టిస్తున్నాయి. ఇరవై ఏండ్ల కిందట మనం ఎవరితోనైనా మాట్లాడాలంటే ల్యాండ్‌ఫోనే దిక్కు. కానీ పరిశోధనలతో 2జీ నుంచి మొదలుకుని ఇప్పుడు 5జీ వరకు స్మార్ట్‌ఫోన్ సేవలు పొందుతున్నాం. ఇవన్నీ పరిశోధనలు అందించిన ఫలితాలే. మనం సాధించిన అత్యాధునిక సాంకేతికతకు ప్రతీకలే. వీటన్నింటిలోకి అత్యున్నతమైనది అంతరిక్ష పరిశోధన. ఇందులో భారత్ సాధించిన ఒక అద్భుత విజయం చంద్రయాన్-3. మరి ఇలా చంద్రునిపై ప్రయోగం చేసినవాళ్లే లేరా? అంటే ఇప్పటికే చంద్రునిపై అడుగుపెట్టి సత్తాచాటిన వాటిలో చైనా, రష్యా, అమెరికా ఉన్నాయి.అ సరసన చేరే దేశాల్లో నాలుగో దేశంగా భారత్ తన కీర్తిప్రతిష్టలను ప్రపంచానికి చాటింది ఈ చంద్రయాన్ విజయం. చంద్రునిపై నీటి జాడలను కనుగొన్న హిస్టరీ కూడా ఇండియాదే. చంద్రయాన్-3 విజయవంతమైతే ప్రపంచ శాస్త్రవేత్తలు అనేక విషయాలను నేర్చుకునే అవకాశం ఉన్నది. భారత్ పరిశోధనల పట్ల ప్రపంచ మార్కెట్‌లో దీని డిమాండ్ కూడా అదే తీరుగా ఉండనుంది. ఇక ఇతర దేశాలు ఈ రాకెట్ లాంచింగ్‌కు దాదాపు రూ.5వేల కోట్లు ఖర్చు పెడుతుంటే భారత్ మాత్రం కేవలం రూ.615కోట్లతో రూపొందించడం ఇస్రో సాధించిన మరో ఘనత. చంద్రయాన్-3 విజయవంతమైన నేపథ్యంలో పిఎస్ఎల్‌వి అనే రాకెట్‌ను వాణిజ్యపరంగా ప్రయోగిస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ప్రకటించారు. అలాగే వచ్చే నెల చివరిలో ఆదిత్య ఉపగ్రహ ప్రయోగం కూడా ఉంటుందని, దానికి సంబంధించిన పరీక్షలు జరుగుతున్నాయని వివరించారు. దీన్నిబట్టి చూస్తే రానున్న రోజుల్లో దేశమంతా సాంకేతిక విప్లవమే.

ఏకరూపత వర్సెస్ సమాన హక్కులు

"ద్వంద్వ విధానాల్ని" భారత రాజ్యాంగం ఏర్పరచిందన్న విషయం భారత ప్రధానికి తెలియదా? దురదృష్టవశాత్తు, భారత ప్రధాని భారతదేశాన్ని రాజ్యాంగం దృష్టితో కాక, సంఘ్ పరివార్ రాజకీయ దృష్టితో చూస్తున్నాడు. అందుకే ఆయన ఉద్దేశపూర్వకంగానే ముస్లిం మతంపై ఏకరూప పౌరస్మృతి విధించడం వల్ల దేశంలో మొత్తంగా ఉత్పన్నమయ్యే చిక్కుల్ని విస్మరించాడు. లా కమిషన్ తన నివేదికలో ఏకరూప పౌరస్మృతి సంబంధిత సాధ్యాసాధ్యాల్ని ముందుగా ఊహించదగిన (రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌కి సంబంధించిన)సమస్యను ప్రత్యేకంగా పేర్కొంది.

మహిళాహక్కుల కోసం సామాజిక సంస్కరణోద్యమాలు, పురుషుల ఏకరూపతా ప్రత్యేకతపై చారిత్రక పోరాటాలు చేశాయి. ప్రతీ అడుగు నిర్దిష్టమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ సందర్భంలోనే ముందుకు పడుతూ వచ్చింది. 75 సంవత్సరాల స్వతంత్రభారతంలో, మహిళా హక్కుల కోసం తయారైన చట్టపరమైన చట్రం (బాగా మెరుగైనప్పటికీ కూడా) ఇప్పటికీ వివక్షతలు, పక్షపాతాలు, సాంస్కృతిక పక్షపాతాలతో నిండిపోయింది. చేయాల్సింది ఇంకా చాలా ఉంది. అయితే 2023 భారతదేశంలో ఈ లక్ష్యాన్ని సాధించే మంచి మార్గం ఏమిటనేదే ప్రశ్న.


బృందాకరత్

ఒకే దేశం, ఒకే చట్టమనే నినాదంతో మోడీ ప్రభుత్వం ఏకరూప పౌరస్మృతి (యూనిఫాం సివిల్ కోడ్)ని ప్రోత్సహిస్తుంది. భారతదేశం ఉన్న ప్రస్తుత సందర్భంలో ఒకే చట్టం, లింగ న్యాయంతో సమానం కాదు. అన్ని వర్గాల మహిళలందరికీ సమాన హక్కులు సాధించే లక్ష్యాన్ని చేరే ద్విముఖ వ్యూహాన్ని, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సమర్థిస్తుంది. మొదటిది, అన్ని వర్గాల మహిళలకు వర్తించే విధంగా ప్రస్తుతం ఉన్న లౌకిక చట్టాల్ని బలోపేతం చేసి, విస్తరించడం. రెండోది, అన్ని వర్గాల వారికి వ్యక్తిగత, ఆచార చట్టాల్లో సంస్కరణల ఉద్యమం ముందుకు సాగేందుకు ఆయా వర్గాల పురుష, మహిళా ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలి. ఇది హిందూ స్త్రీ, పురుషులు, ముస్లిం స్త్రీ పురుషులు, గిరిజన స్త్రీ పురుషుల మధ్య, అదేవిధంగా హిందువులు, ముస్లింలు, గిరిజనులు, పార్శీలు, క్రైస్తవులు, సిక్కుల లాంటి మతాలకు చెందిన మహిళలకు సమాన హక్కులు పొందే అవకాశం కల్పిస్తుంది.

లా కమిషన్ నిర్ధారణలు

2016లో జస్టిస్ బి.ఎస్.చౌహాన్ అధ్యక్షతన మోడీ ప్రభుత్వం 21వ లా కమిషన్‌ను నియమించింది. ఏకరూప పౌరస్మృతి అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వం ఈ కమిషన్‌ను ఆదేశించింది. ఈ ఏకరూప పౌరస్మృతి 'అవసరమైనదీ కాదు, కోరదగినదీ' కాదని, లా కమిషన్ దీనిని తిరస్కరించింది. ఈ కమిషన్ మొదట ప్రత్యేక వివాహ చట్టం, గృహహింస నుండి రక్షణ చట్టం లాంటి ఇతర లౌకిక చట్టాల్ని బలోపేతం చేసి, విస్తరించాలని స్పష్టమైన సిఫార్సులు చేసింది. హిందువులు, ముస్లింలు (సున్నీలు, షియాలు కూడా), క్రైస్తవులు, పార్శీలు, సిక్కులు, అనేక గిరిజన తెగలకు వర్తించే భిన్నమైన వ్యక్తిగత, ఆచార చట్టాల్ని వివరంగా అధ్యయనం చేసిన తర్వాతే వివాహం, విడాకులు, పిల్లల సంరక్షణ, దత్తత, వారసత్వం లాంటి కుటుంబానికి సంబంధించిన ముఖ్యమైన విషయాలపై కమిషన్ సిఫార్సులు చేసింది.

విస్తృతమైన సంప్రదింపులు జరిపి, 75,378 ప్రతిస్పందనలను స్వీకరించిన తర్వాత, అన్ని వర్గాల మహిళల సమాన హక్కుల కోసం చేసే పోరాటాల్ని ముందుకు తీసుకొనిపోయే విధంగా లా కమిషన్ ఓ ప్రయోజనకరమైన పథకాన్ని తెచ్చింది. ప్రస్తుత హిందూ వ్యక్తిగత చట్టాల్లో హిందూ మహిళలు ఎదుర్కొంటున్న అనేక వివక్షతలను లా కమిషన్ నివేదికలో స్పష్టంగా వివరించింది. 2005 సంస్కరణ తర్వాత కూడా మహిళలకు అన్యాయం చేస్తూ, కో-పార్సినరీ అనే హిందూ చట్ట భావనను రద్దు చేయాలనీ, హిందూ అవిభాజ్య కుటుంబ భావన నుండి వచ్చే పన్ను రాయితీలను కూడా రద్దు చేయాలని లా కమిషన్ సిఫార్సు చేసింది. ముస్లింలకు అవసరమైంది సంస్కరణ ఒక్కటేనన్న బీజేపీ కథనానికి భిన్నంగా కమిషన్ చేసిన సిఫార్సులను అందుకే తొక్కి పట్టారా?

ట్రిపుల్ తలాక్ వ్యతిరేక చట్టం ద్వారా "మన ముస్లిం బిడ్డలకు" సహాయపడేందుకు చర్యలు చేపట్టింది ఈ ప్రభుత్వం మాత్రమేనని పేర్కొన్న మోడీ ప్రభుత్వ వాదనలు ఇబ్బందికరంగా మారాయి. ఇది అవసరంలేని మతాచారమనే కారణంతో సుప్రీంకోర్టే దానిని చట్ట విరుద్ధమైనదిగా పేర్కొన్నదని లా కమిషన్ నివేదికలో తెలిపింది. మోడీ ప్రభుత్వ చట్టాన్ని ప్రత్యక్షంగా విమర్శించకుండానే, గృహహింస నిరోధంపై పౌర చట్టంలోని నిబంధనల్ని వర్తింపచేయడం ద్వారా బాధిత ముస్లిం మహిళల్ని రక్షించడానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆ నివేదిక పేర్కొంది. ఎందుకంటే మోడీ ప్రభుత్వం తెచ్చిన చట్టం మహిళలకెలాంటి ఉపశమనం సమకూర్చక, కేవలం ముస్లిం పురుషుడిని జైలుకు మాత్రమే పంపిస్తుంది.

మోడీ ప్రభుత్వం తన ఎజెండాను అమలు చేయడానికి సంకుచిత రాజకీయ ఆలోచనల్ని చేయడం దురదృష్టకరం. 2018లో ప్రభుత్వానికి అందించిన విలువైన లా కమిషన్ నివేదికను తిరస్కరించి, వ్యక్తిగత చట్టసంస్కరణల కోసం ఏ ఒక్కరితోనూ సంప్రదింపులు జరపకుండా, ఒక్క చట్టం కూడా చేయకుండా ప్రభుత్వం తన రెండోదఫా పాలనాకాలాన్ని దుర్వినియోగం చేసింది. ఏకరూప పౌరస్మృతి కోసం చేసిన ప్రయత్నం 21వ లా కమిషన్ తిరస్కరించిన తరువాత ఎలాంటి కారణాలు లేకుండా జస్టిస్ రీతూ రాజ్ అవస్తీ అధ్యక్షతన ఏర్పాటైన 22వ లా కమిషన్‌ను ఏకరూప పౌరస్మృతి అంశాన్ని మరోసారి పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించింది కాబట్టి, మరోసారి అభిప్రాయాలను కోరారు. ఇది కచ్చితంగా ప్రజల సమయాన్ని, ప్రజాధనాన్ని దుర్వినియోగపరచి, తన బాధ్యతలు, ప్రాధాన్యతల నిర్వహణ నుండి కమిషన్ దృష్టిని మళ్లించడమే అవుతుంది. కానీ మోడీ ప్రభుత్వంలో ఈ అసంబద్ధత సాధ్యమే. ప్రభుత్వ ఎజెండాకు మహిళా హక్కులకు స్పష్టంగా ఎలాంటి సంబంధం లేదు, కానీ ప్రభుత్వ ప్రతీ చర్య, ప్రజల్ని విభజించి, ఎన్నికల్లో లబ్దిపొందేందుకు ఉద్దేశించబడిందే.

ఈ క్రమంలోనే అన్ని వర్గాల మహిళలందరికీ సమానత్వం కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లు, పరువు సంబంధిత నేరాల వ్యతిరేక చట్టం, వివాహ సమయంలో సృష్టించబడిన అన్ని ఆస్తుల ఉమ్మడి యాజమాన్య చట్టం, వైవాహిక లైంగికదాడిని నేరంగా పరిగణించే చట్టాల లాంటి పెండింగ్‌లో ఉన్న లౌకిక చట్టాల్ని విస్మరించడం లేదా తిరస్కరించడం జరిగింది. మహిళలకు అనుకూలమైన ఏ ఒక్క చట్టాన్ని కూడా ఇంతవరకు మోడీ ప్రభుత్వం (మొదటి లేదా రెండో పాలనా కాలంలో) తీసుకురాలేదు.

గిరిజనుల చట్ట నిబంధనల్ని బలహీనపర్చడం

ఇటీవల భోపాల్‌లో ఒక కార్యక్రమంలో ప్రధాని ప్రసంగిస్తూ, ఏకరూప పౌరస్మృతిని తీసుకొని రావాలన్న తన ప్రభుత్వ నిర్ణయాన్ని పునరుద్ఘాటించాడు. దీనిని వ్యతిరేకించే వారంతా "బుజ్జగింపు" రాజకీయాలను అనుసరిస్తున్నారని ఆరోపించాడు. ఒకే ఇంట్లో, ఒకవేళ ఒక కుటుంబ సభ్యుడు ఒక చట్టం, మరొక సభ్యుడు మరొక చట్టాన్ని కలిగి ఉంటే, ఆ ఇల్లు, కుటుంబం సరైన రీతిలో ఉంటుందా? కాబట్టి ద్వంద్వ విధానంతో దేశమెలా ఉంటుంది? తన అవగాహనలో ద్వంద్వ విధానాన్ని లక్ష్యంగా చేసుకోవాల్సి ఉంటుందనీ, "మా ముస్లిం బిడ్డలు" అని అదే పనిగా ప్రస్తావిస్తూనే ముస్లింల వ్యక్తిగత చట్టాల్ని లక్ష్యం చేసుకోవాలనే విషయాన్ని స్పష్టం చేశాడు.

"ద్వంద్వ విధానాల్ని" భారత రాజ్యాంగం ఏర్పరచిందన్న విషయం భారత ప్రధానికి తెలియదా? దురదృష్టవశాత్తు, భారత ప్రధాని భారతదేశాన్ని రాజ్యాంగం దృష్టితో కాక,



సంఘ్ పరివార్ రాజకీయ దృష్టితో చూస్తున్నాడు. అందుకే ఆయన ఉద్దేశపూర్వకంగానే ముస్లిం మతంపై ఏకరూప పౌరస్మృతి విధించడం వల్ల దేశంలో మొత్తంగా ఉత్పన్నమయ్యే చిక్కుల్ని విస్మరించాడు. లా కమిషన్ తన నివేదికలో ఏకరూప పౌరస్మృతి సంబంధిత సాధ్యాసాధ్యాల్ని ముందుగా ఊహించదగిన (రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌కి సంబంధించిన)సమస్యను ప్రత్యేకంగా పేర్కొంది. త్రిపుర, అస్సాం, మిజోరాం, మేఘాలయలోని కొన్ని ప్రాంతాలకు వర్తించే ఆర్టికల్ 244లోని ఆరవ షెడ్యూల్, ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన జిల్లాలకు, ప్రాంతీయ కౌన్సిళ్లకు వివాహం, విడాకులు, ఆస్తి హక్కులు లాంటి కుటుంబ చట్టాలను, ఇతర చట్టాల్ని గవర్నర్ అనుమతితో రూపొందించే హక్కుల్ని కల్పిస్తుంది. దానితోపాటు ఆర్టికల్స్ 371ఏ, బి, సీ, ఎఫ్, జీ, హెచ్‌లు 6 ఉత్తర ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక హక్కుల్ని, మినహాయింపుల్ని సమకూర్చుతాయి. ఉదా:- నాగా ప్రజలకు 371 ఏ, మిజోరాం ప్రజలకు 371జీ మతపరమైన, సాంఘిక ఆచారాలు, పౌర, నేర న్యాయాల పరిరక్షణకు ప్రత్యేక నిబంధనల్ని సమకూర్చుతాయి. ఉత్తర ఈశాన్యంలోని ఈ రాష్ట్రాల గిరిజన ప్రజలు (వారి ఆచార వ్యవహారాలకు సంబంధించిన చట్టాల విషయంలో) రాజ్యాంగ హక్కులపై ప్రభావం చూపే ఈ చర్యలపై ఎలా ప్రతిస్పందిస్తారు? ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో "షెడ్యూల్డ్ ప్రాంతాల పంచాయతీ విస్తరణ చట్టం" అమలు చేయడం ద్వారా గ్రామ సభలకు చట్టపరంగా హక్కులిచ్చి, స్వయం పాలన ద్వారా ఆచార, సాంఘిక పద్ధతులకు రక్షణ కల్పించడం జరుగుతుంది. తమ అడవులను, భూమిని ఆక్రమించుకుంటున్న ఆర్థిక విధానాల ద్వారా మధ్య, తూర్పు భారతదేశంలోని గిరిజనులు ఇప్పటికే దాడులకు గురవుతున్నారు. భారతదేశ వ్యాప్తంగా గిరిజన ప్రజలకు కల్పించబడిన రాజ్యాంగపరమైన, చట్టపరమైన నిబంధనలతో ఏకరూప పౌరస్మృతికి ప్రత్యక్ష వైరుధ్యం ఏర్పడుతుంది.

ప్రధానమంత్రి, ఆయన ప్రభుత్వం, ఆయన పార్టీ గిరిజనుల కోసం ఏర్పరచిన "ద్వంద్వ విధానాలకు", రాజ్యాంగ పరమైన, చట్టపరమైన నిబంధనలు వ్యతిరేకమా? ఏకరూప పౌరస్మృతిని విధించడానికి ఆయన ఈ రక్షణ వ్యవస్థల్ని రద్దు చేయబోతున్నారా? లేక ఏకరూప పౌరస్మృతి గిరిజన ప్రజలకు వర్తించకుండా కేవలం ముస్లింలకు మాత్రమే వర్తిస్తుందా? తన వైఖరి ఏమిటో భారత ప్రధాని స్పష్టం చేయాలి.

బీజేపీ ద్వంద్వ కపటత్వం: నాగాలాండ్ ఉదాహరణ

ప్రధానమంత్రి, బీజేపీ నాయకులు దేశానికి ఒకే చట్టం లాంటి ఏకరూపత గురించి వాదిస్తుంటే, నాగాలాండ్‌లో మహిళల హక్కుల గురించి బీజేపీ కపటపూరితంగా వ్యవహరిస్తుంది. నాగా ఆచార చట్టానికి వ్యతిరేకంగా ఉందని భావించబడుతున్న 1/3 వంతు మహిళా రిజర్వేషన్లను అనేక నాగా గ్రూపులు వ్యతిరేకిస్తున్న కారణంగా 2012 నుండి నాగాలాండ్‌లో స్థానికసంస్థలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. నాగా విమెన్స్ అసోసియేషన్ లాంటి వారి మహిళా సంఘం నాయకత్వాన, దేశ వ్యాప్తంగా మహిళా సంఘాల మద్దతుతో నాగా మహిళలు 1/3 వంతు మహిళా రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేస్తున్నారు. వాస్తవానికి ఇలాంటి రిజర్వేషన్లకు నాగా ఆచార చట్టంలో ఎలాంటి వ్యతిరేకత లేదని వారంటున్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఓ పిటీషన్‌పై వాదనలు కూడా సాగుతున్నాయి.

గడచిన కొన్ని తేదీలలో ఈ సమస్యపై ఉద్దేశపూర్వకంగానే అఫిడవిట్ సమర్పించనందుకు ఆగ్రహించిన కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించింది. ఇది మహిళా హక్కుల సంబంధిత అంశమని స్పష్టంగా కనిపిస్తుంది. "ముస్లిం బిడ్డల" గురించి ఎంతో చింతించి, జోక్యం చేసుకున్న ప్రధానమంత్రి, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లకు నోచుకోని "నాగా బిడ్డల" విషయంలో పూర్తిగా మౌనం వహించాడు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనం వహించింది? ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో ఎన్నికలు జరిగిన తర్వాత బీజేపీ భాగస్వామ్యంతో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ఉప ముఖ్యమంత్రిగా ఎన్నికైన ఆ పార్టీ నాయకుడు స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో మహిళలకు 1/3వంతు రిజర్వేషన్లను నిరాకరిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. గిరిజన సంఘాలతో చర్చించేందుకు ఇంకా సమయం అవసరమని చెప్తూ, ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు తెమ్జెన్ ఇమ్నా తమ ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించాడు. బీజేపీకి నచ్చితే "ద్వంద్వ విధానం" మంచిది, ఆ పార్టీకి ఏదైనా ఒక మతం లక్ష్యంగా ఉంటే బీజేపీ "ఒకే చట్టం" గురించి అదే పనిగా మాట్లాడుతుంది.

(మిగతా రేపటి సంచికలో)
("పీపుల్స్ డెమోక్రసీ" సౌజన్యంతో)
- అనువాదం:బోడపట్ల రవీందర్, 9848412451



నాణ్యమైన విద్యలో మనమెక్కడ?

75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో ప్రజలకు నాణ్యమైన విద్య అందించడంలో పాలకులు విఫలమయ్యారు. ప్రజల జీవన ప్రమాణాలు వారి సామాజిక ఆర్థిక స్థితిగతులు వారికి అందించే విద్యపై మాత్రమే ఆధారపడి ఉంటాయి. ప్రపంచాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధం విద్యకు మాత్రమే ఉంది అని నెల్సన్ మండేలా చెప్పిన మాటలు పాలకులు గమనంలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రఖ్యాత అమెరికా సంస్థ బిఏవి గ్రూప్, వార్టన్ స్కూల్ ఆఫ్ యూనివర్సిటీ తయారుచేసిన వార్షిక నివేదిక ప్రకారం నాణ్యమైన విద్యను అందించడంలో అమెరికా, ఇంగ్లాండ్ మొదటి రెండు స్థానాల్లో ఉండగా భారతదేశం 32వ స్థానంలో ఉంది. ఈ సర్వేను 78దేశాల్లో కొన్ని వేల మంది ప్రజలతో ఈ సంస్థ నిర్వహించింది.

26.5కోట్ల మంది విద్యార్థులు, 14.9లక్షల పాఠశాలలు, 95లక్షల మంది ఉపాధ్యాయులతో భారతీయ విద్యా వ్యవస్థ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యా వ్యవస్థగా గుర్తింపుపొందింది. అతి పెద్ద ప్రజాస్వామిక దేశం, అతిపెద్ద విద్యావ్యవస్థలో ఉన్న మనం విద్యారంగంలో అనేక విద్యాసంస్కరణలు తీసుకొచ్చినప్పటికీ కూడా దేశ ప్రజలకు నాణ్యమైన విద్య అందించడంలో సఫలీకృతం కాలేకపోయాం.

నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్(ఎన్ఎస్ఎస్ఒ) ప్రకారం భారతదేశంలో నాణ్యమైన విద్య అందించకపోవడానికి ప్రధాన కారణాలుగా విద్యారంగానికి సరైన బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం, దేశంలో 33శాతం టీచర్లు అర్హత కలిగిన వారు అందుబాటులో లేకపోవడం, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు టీచర్లు అందిపుచ్చుకోకపోవడం, మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా ఆధునిక ప్రపంచంలో విద్యార్థులు రాణించేలా వారిలో సృజనాత్మకతను పెంచేలా కరికులం లేకపోవడం, దేశంలోని మెజారిటీ బడుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించకపోవడం ప్రధానంగా మంచినీరు, పారిశుధ్య నిర్వహణ, విద్యుదీకరణ తరగతి గదులు చాలినంత అందుబాటులో లేకపోవడం. 21వ శతాబ్దంలో భారతీయ యువత ప్రపంచంతో పోటీపడాలని వారికి నాణ్యమైన విద్యను అందించాలని, వారిలో సృజనాత్మకతను పెంచాలని భారత ప్రభుత్వం జూలై 29న నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి) 2020ని తీసుకొచ్చింది. ఈ విద్యా విధానం ప్రకారం భారతదేశ జీడీపీలో విద్యారంగానికి కనీసం ఆరుశాతం నిధులను కేటాయించాలి. కానీ ఈ ఆర్థిక సంవత్సరంలో భారత ప్రభుత్వ బడ్జెట్లో కేవలం 2.9శాతం నిధులు (రూ.1,12,899 కోట్లు) మాత్రమే కేటాయించింది. ప్రపంచంలో నాణ్యమైన విద్యను అందించే దేశాలు వాటి బడ్జెట్లో ఆరుశాతం కన్నా ఎక్కువ నిధులనే కేటాయిస్తున్నాయి. ఉదాహరణకి నార్వే, చీలి దేశాల్లో 6.6శాతం, ఇజ్రాయిల్, న్యూజిలాండ్‌లు 6.2శాతం, ఇంగ్లాండ్ 6.1శాతం, అమెరికా 6శాతం నిధులు కేటాయించి నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. భారత ప్రభుత్వం పార్లమెంట్‌లో అధికారికంగా తెలిపిన వివరాల ప్రకారం భారతదేశం నుండి ఉన్నత చదువులకు వివిధ దేశాలకు వెళ్తున్న విద్యార్థులు ప్రతి సంవత్సరం పెరుగుతున్నారు. గతంతో పోలిస్తే ఈ సంవత్సరంలో 68శాతం పెరుగుదలతో 7,50,365 మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం వేరే దేశాలకు తరలివెళ్లారు. ఒక సర్వే ప్రకారం ఇది ఇలాగే కొనసాగితే 2024 సంవత్సరం వరకు భారతదేశం నుండి 1.8మిలియన్ల విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం కోసం వేరే దేశాలకు వెళ్లే అవకాశం ఉంది. భారతదేశంలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీలలో చదివిన వారిలో మొదటి 10ర్యాంకర్లలో 9మంది, 100 ర్యాంకులోపు 62శాతం మంది, 1000 ర్యాంకులోపు 36శాతం మంది ఉన్నత చదువుల కోసం ఉద్యోగాల కోసం వలస వెళ్తున్నారు. ఈ మేధోవలసలను నివారించాల్సిన అవసరం ఉంది. దేశంలోని బడుగు బలహీన వర్గాలకి నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఇప్పటికైనా పాలకులు కళ్ళు తెరిచి విద్యకు అధికంగా నిధులు కేటాయించి ప్రజలకు నాణ్యమైన విద్యను అందిస్తారని ఆశిద్దాం.

- పాకాల శంకర్‌గౌడ్, 9848377734.


చెప్పేదొకటి... చేసేదొకటి..!

మత విద్వేష వ్యాప్తి కేవలం కొన్ని పరిధులకే పరిమితం కావడం లేదు. 'భారత్‌లోని పలువురు హుస్సేన్ ఒబామాల' గురించి జాగ్రత్త తీసుకోవడానికి తాము ప్రాధాన్యత ఇస్తామని అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ వంటి వారు చెబుతున్నారంటే... కేంద్ర ప్రభుత్వానికి, ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్ వంటి మత సంస్థలకు మధ్య గల విభజన రేఖ అదృశ్యమైపోతోంది. ముస్లింలు ఎంత మాత్రమూ సమానులు కారని ఆయన స్పష్టంగా చెబుతున్నారు. వారు కేవలం రెండో తరగతి పౌరులు మాత్రమేనని పేర్కొంటున్నారు. పైన చెప్పుకున్న ఘటనలన్నీ ఈద్ వేడుకల సందర్భంగా చోటుచేసుకున్నవే. అవేమీ యాదృచ్ఛికంగా జరిగినవి కావు.

ఇటీవల అమెరికాలో పర్యటన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోడీ, కులం, మతం, వర్గం, వయస్సు లేదా భౌగోళిక ప్రాంతాల ప్రాతిపదికన భారతదేశంలో వివక్ష లేదని చెప్పుకొచ్చారు. కానీ అవన్నీ తప్పని ఆ వెంటనే రుజువైపోయింది. ఈద్ సందర్భంగా మైనారిటీలపై వరుసగా దాడులు, అటువంటి దాడులకు పాల్పడిన వారికి బహిరంగంగా లేదా రహస్యంగా ప్రభుత్వం రక్షణ కల్పించడం చూస్తుంటే, బీజేపీ ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు అస్సలు పొంతన లేకపోవడం కనిపిస్తోంది. జూన్ 24న ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసి 24గంటలు కూడా గడవక ముందే, కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలోని జాదూరా గ్రామంలోని మసీదులోకి భారత సైన్యానికి చెందిన ఒక మేజర్ నేతృత్వంలో సైనికులు ప్రవేశించారు. అక్కడున్న వారిచేత బలవంతంగా 'జై శ్రీరాం' అంటూ నినాదాలు చేయించారు. అదే గ్రామంలోని అతి పెద్ద జామియా మసీదును కూడా వారు ధ్వంసం చేశారని ఆరోపణలు వచ్చాయి. తద్వారా మత స్వేచ్ఛ హక్కును వారు అణచివేశారు. సైన్యం వంటి లౌకికవాద సంస్థ లౌకికవాద భావజాలంతో సంబంధం లేకుండా, ఇటువంటి పక్షపాత ధోరణితో వ్యవహరించడం, రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం చూస్తుంటే... ప్రస్తుత ప్రభుత్వ నేతృత్వంలో ప్రభుత్వ సంస్థల తీరుతెన్నులెలా ఉన్నదీ స్పష్టంగా అర్థమవుతోంది.

అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా విమర్శలు చేసిన నేపథ్యంలో మోడీని సమర్థించడంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఒకవైపు బిజీగా ఉన్నారు. మరోపక్క ముంబయికి 150కిలోమీటర్ల దూరంలో జూన్ 25న గొడ్డు మాంసం తీసుకెళుతున్నాడన్న కారణంతో ఒక యువకుడిని కొట్టి చంపడం ప్రభుత్వం పాటించే సంయమన విధానాలకు ప్రత్యక్ష సాక్షిగా ఉంది. ముంబయి-నాసిక్ ప్రాంతాల మధ్య కేవలం 15రోజుల వ్యవధిలో ఇటువంటి ఘటన జరగడం ఇది రెండవసారి. రెండు కేసుల్లోనూ దాడికి గురైంది పసమందా ముస్లింలే. ఈ రెండు ఘటనలు ఆర్ఎస్ఎస్- బీజేపీ ద్వంద్వ ప్రవృత్తిని తేటతెల్లం చేస్తున్నాయి. కానీ పసమందా ముస్లింల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నది తానేనని చెప్పుకోవడానికి, చూపించుకోవడానికి ఆర్ఎస్ఎస్-బీజేపీ పోటీపడుతున్నాయి. ఈ రెండు సంఘటన ల్లోనూ బాధితులు రోజువారీ కూలీలు, నిరుపేద కుటుంబాలకు చెందినవారు. వీరు మాంసం, కూరగాయలు రవాణా చేస్తూ బతుకీడుస్తారు. గో రక్షకులుగా చెప్పుకునే పది, పదిహేను మంది గూండాలు వీరిపై దాడి చేశారు. రాష్ట్రీయ బజరంగ్ దళ్ నేతృత్వంలో వీరు పనిచేస్తారు.

జంతువుల పట్ల క్రూరంగా వ్యవహరించడాన్ని నివారించే చట్టం కింద బాధితులపై మహారాష్ట్ర పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. అయితే ఇక్కడ వారు జంతువులను రవాణా చేయడం లేదన్నది వాస్తవం. ప్రభుత్వ యంత్రాంగంపైన, మత వివక్షను మరింత పెంచడంపైన సంఘ్ పరివార్ భావజాల ప్రభావం ఎలా ఉంటుందో చెప్పడానికి మరో ఉదాహరణగా దీనిని చెప్పుకోవచ్చు. షిండే-ఫడ్నవిస్ ప్రభుత్వ హయాంలో, ఈ గోరక్షక ముఠాలు బరితెగిస్తున్నాయి. దాడులకు పాల్పడే గోరక్షకులు హంతకుల అవతారమెత్తారు. మహారాష్ట్రలో ఇలా జరగడమిదే ప్రథమం. రెండో సంఘటన జరిగిన రెండు రోజుల తర్వాత, మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పోలీసులకు హుకుం జారీ చేసే వరకూ వెళ్లారు (అసలు ఆయనకు ఇలా ఆదేశాలు చేయడానికి అధికారమే లేదు). తప్పుడు ఆరోపణలపై గోరక్షకులను వేధించవద్దని



ఆయన పోలీసులకు సూచించారు. ఇది విచారకరం. గో రక్షకుల వెనుక వీరి మద్దతు ఎలా ఉందన్నది ఈ సంఘటనతో స్పష్టమవుతున్నది. వారిని కాపాడడం కోసం చివరకు తమ రాజ్యాంగ పదవులను కూడా దుర్వినియోగపరుస్తున్నారు. దేశవ్యాప్తంగా మైనారిటీలను ఇలా వేధించడం, కొట్టి చంపడం వంటి ఘటనలు జరుగుతున్న తీరు ఆందోళనకరం. మహారాష్ట్రలో ఈ సంఘటన జరిగిన కొద్ది రోజుల తర్వాత, బీహార్‌లోని సరాన్ జిల్లాలో ఈద్ సందర్భంగా మరో దాడి జరిగింది. ఇక్కడ బాధితుడు 55ఏండ్ల వికలాంగుడైన ముస్లిం డ్రైవర్. సమీపంలోని ఫ్యాక్టరీకి జంతువుల ఎముకలను తీసుకెళుతుంటే ఆ డ్రైవర్‌ను కొట్టి చంపేశారు. మందులు తయారుచేసే ఫ్యాక్టరీలో ఉపయోగించడానికి ఈ ఎముకలను తీసుకెళుతున్నారు. ఈ ఫ్యాక్టరీ గత 50ఏళ్ళుగా నడుస్తోంది.

ఉత్తరాఖండ్‌లో, పురోలాలో ముస్లింల దుకాణాలను లక్ష్యంగా చేసుకుని, వాటిని మూసేయించేలా ఒత్తిడి తీసుకువచ్చారు. ఆ తర్వాత, మిగిలిన ముస్లింలను కూడా వెంటాడసాగారు. ఈద్ సందర్భంగా ఒకచోట గుమికూడి, నమాజ్‌లు చేయవద్దని, చివరకు వారి ఇండ్లలో కూడా చేయకూడదని విశ్వహిందూ పరిషత్, ముస్లింలను ఆదేశించింది. ఫలితంగా, ముస్లింలందరూ పురోలా, బార్కోట్ పట్టణాలకు దూరంగా దాదాపు 40కిలోమీటర్ల దూరంలో గల అడవుల్లో పండగ రోజున నమాజ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుజరాత్ లోని ముంద్రాలో ఈద్ రోజున, ప్రయివేటు స్కూల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశారు. విద్యార్థులు నెత్తిపై టోపీలు ధరించి, ఈద్-అల్-అదాపై నాటకాన్ని వేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అయింది. దాంతో ఆ స్కూలు ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకున్నారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకునేలా జిల్లా విద్యాశాఖాధికారిపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ చర్యను సమర్థించుకుంటూ జిల్లా ప్రాథమిక విద్యాధికారి, ముస్లింలు ధరించే టోపీలను హిందూ విద్యార్థులను పెట్టుకోమని కోరడం హీనమైన పనని వ్యాఖ్యానించారు. సమాజంలో మత విద్వేషం ఎంతలా పాతుకుపోయిందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ. అంతకంటే ముఖ్యంగా, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వ అధికారులు సైద్ధాంతికంగా ఎంతలా భ్రష్టు పట్టిపోయారనేది మరింత స్పష్టంగా తెలియచేస్తోంది.

మత విద్వేష వ్యాప్తి కేవలం కొన్ని పరిధులకే పరిమితం కావడం లేదు. 'భారత్‌లోని పలువురు హుస్సేన్ ఒబామాల' గురించి జాగ్రత్త తీసుకోవడానికి తాము ప్రాధాన్యత ఇస్తామని అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ వంటి వారు చెబుతున్నారంటే... కేంద్ర ప్రభుత్వానికి, ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్ వంటి మత సంస్థలకు మధ్య గల విభజన రేఖ అదృశ్యమైపోతోంది. ముస్లింలు ఎంత మాత్రమూ సమానులు కారని ఆయన స్పష్టంగా చెబుతున్నారు. వారు కేవలం రెండో తరగతి పౌరులు మాత్రమేనని పేర్కొంటున్నారు. పైన చెప్పుకున్న ఘటనలన్నీ ఈద్ వేడుకల సందర్భంగా చోటుచేసుకున్నవే. అవేమీ యాదృచ్ఛికంగా జరిగినవి కావు. హిందూ ఉత్సవాలైనా, ముస్లిం పండగలైనా హిందూత్వ శక్తులు జరిపే దాడులు మైనారిటీలకు భీతిగొలిపే సందేశాన్ని ఇవ్వడానికి ఉద్దేశించే ఉంటాయి. "మీకు జీవించడానికి ఎలాంటి హక్కులూ లేవు, మా ఆదేశాలకు అనుగుణంగానే మీరు నడవాలి. మిమ్మల్ని రక్షించేది ఏదీ లేదు" అన్నదే ఆ సందేశం సారాంశం.

సమాజంలో మతపరంగా చీలికలు తీసుకు వచ్చి, తద్వారా రాజకీయ ఫలితాలు రాబట్టుకోవా లన్నదే ఆర్ఎస్ఎస్-బీజేపీ ఉద్దేశపూరిత కుట్రగా ఉంది. ఎన్నికలు సమీపిస్తున్నందున, ఇటువంటి కార్యకలాపాలు మరింత వేగం పుంజుకుంటున్నాయి. ప్రభుత్వ అధికారాలను ఉపయోగించి, వారు పాలనా యంత్రాంగంలోని వివిధ విభాగాలు, అధికారుల ద్వారా తమ సైద్ధాంతిక ప్రభావాన్ని విస్తరిస్తున్నారు. తమ ప్రయోజనాలకు వారిని విధేయులుగా ఉండేలా చేస్తున్నారు. ప్రపంచ దేశాల ప్రజలను ఆకర్షించడానికి ప్రజా స్వామ్యంపై, సహనంపై ప్రధాని చేసే వ్యాఖ్యలు, మైనారిటీలపై జరిగే ఈ దాడులను కప్పిపుచ్చలేవు. ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని పరిరక్షించాలంటే మైనారిటీలపై జరిగే ప్రతి దాడిని తప్పనిసరిగా వ్యతిరేకించాల్సిన, ప్రతిఘటించాల్సిన అవసరముంది. ఫాసిస్టు తరహా హిందూత్వ శక్తులు పాల్పడుతున్న హింసాత్మక చర్యలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటిత పరచడానికి వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులు నిరంతరంగా కృషి చేయాలి.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 60,000	▲ 380
22 క్యారెట్లు	- 55,000	▲ 350
కిలో వెండి	- 81,300	▲ 1800

జాబిల్లి కోసం..

(మొదటిపేజీ తరువాయి)

పరిశోధనలు ఆగిపోయాయి. చంద్రయాన్-2లో 14 పేలోడ్స్ పంపగా చంద్రయాన్-3లో 5 ఇస్రో పేలోడ్స్ మాత్రమే పంపారు. చంద్రయాన్-3 ప్రపొల్షన్ మాడ్యూల్, ల్యాండర్, రోవర్లలో అత్యాధునిక సాంకేతిక పరికరాలను అమర్చి పంపారు. ఇందుకోసం ఇస్రో శాస్త్రవేత్తలు 2 నెలలుగా అహర్నిశలు శ్రమించారు.

40 రోజులు ఎందుకు?

చంద్రయాన్-3ను ఇస్రో విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టినా.. అది చంద్రుడిని చేరాలంటే 40 రోజులకుపైగా సమయం పడుతుంది. అదే అమెరికా గతంలో చేపట్టిన 'అపోలో 11' నాలుగు రోజులు, రష్యా ప్రయోగం ఒకటిన్నర రోజులే పట్టింది. మరి ఇస్రోకు నెలకు పైగా సమయం ఎందుకుపడుతుందో గమనిద్దాం..

భూమి నుంచి 3.84 లక్షల కి.మీ దూరంలో ఉన్న చంద్రుడి వద్దకు నేరుగా వెళ్తే.. స్వల్ప వ్యవధిలోనే చేరుకోవచ్చు. అయితే, అందుకు శక్తిమంతమైన రాకెట్‌ను వినియోగించాల్సి ఉంటుంది. పైగా.. భారీమొత్తంలో ఇంధనం అవసరం. దీంతో రాకెట్ పరిమాణం కూడా పెరుగుతుంది. 1969 జులై 16న అమెరికా చంద్రుడిపైకి 'అపోలో 11' ప్రయోగానికి భారీ రాకెట్‌ను వినియోగించింది. అపోలోను మోసుకెళ్లిన శాటర్న్ వీ రాకెట్ ఎత్తు 363 అడుగులు కావడం గమనార్హం. ప్రస్తుతం ఇస్రో వినియోగించిన ఎల్‌వీఎం-3 రాకెట్ ఎత్తు 142 అడుగులు మాత్రమే.

భారీ రాకెట్ల ప్రయోగం.. అత్యంత ఖర్చుతో కూడుకున్న పని. భారీ ప్రయోగాల కోసం అమెరికా శాటర్న్ వీ రాకెట్‌లను 1967 నుంచి 1973 వరకు పలుసార్లు వినియోగించింది. చంద్రుడిపైకి మానవులను పంపించేందుకు కూడా ఇదే రాకెట్‌ను ఉపయోగించింది. అది గంటకు 39వేల కి.మీ వేగంతో ప్రయాణించగలదు.

అంతేకాకుండా అత్యంత శక్తిమంతమైన రాకెట్లు.. తాము మోసుకెళ్లే పేలోడ్‌నూ వేగంగా చంద్రుడి కక్ష్యలో ప్రవేశపెట్టగలవు. అలా 'అపోలో 11' రాకెట్.. నాలుగు రోజుల్లో చంద్రుడి వద్దకు చేరుకుంది. ఇక 1959లో రష్యా చేపట్టిన లూనా-2 వ్యోమనౌక కేవలం 34 గంటల్లో చంద్రుడిని చేరింది. అయితే, 1964-73 మధ్యకాలంలో అమెరికా తన ఒక్కో ప్రాజెక్టుకు సుమారు 185 మిలియన్ డాలర్లు ఖర్చు పెట్టి నట్టు సమాచారం. కానీ.. ఇస్రో మాత్రం కేవలం రూ.615 కోట్లతోనే చంద్రయాన్- 3ని చేపట్టటం గమనార్హం. వేగంగా వెళ్లాల్సిన అవసరం లేకపోవడం, ప్రాజెక్టుకు అయ్యే వ్యయాన్ని దష్టిలో ఉంచుకొని ఇస్రో.. భిన్న మార్గాన్ని ఎంచుకొంది. భూమి గురుత్వాకర్షణ సాయంతో చంద్రుడి వైపు పయనించే విధానాన్ని అనుసరిస్తోంది. ఈ క్రమంలో తొలుత చంద్రయాన్-3ని రాకెట్ ద్వారా భూమి చుట్టూ ఉన్న 170 ∗ 36,500 కిలోమీటర్ల దీర్ఘ వత్తాకార కక్ష్యలో ప్రవేశపెడుతోంది. భూమి చుట్టూ 24 రోజులపాటు చక్కర్లు కొడుతూనే చంద్రయాన్-3.. క్రమంగా తన కక్ష్యను పెంచుకుంటూ చివరకు చంద్రుడి గురుత్వాకర్షణ క్షేత్రంలోకి చేరుకుం టుం ది.ఈ ప్రక్రియకు దాదాపు 40రోజుల సమయం పడుతోంది.

చంద్రయాన్ విజయవంతం పట్ల సీఎం హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఎల్వీఎం3-ఎం4 చంద్రయాన్-3ను ఇస్రో విజయవంతంగా అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టడం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మెన్, శాస్త్రవేత్తలు, ఇతర సాంకేతిక సిబ్బందిని అభినందిస్తూ ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రయాన్ 3 విజయవంతం కావడం ద్వారా భారత అంతరిక్ష పరిశోధన రంగం.. కీలక మైలురాయిని దాటిందని పేర్కొన్నారు.

ఎస్‌బీఐ యోనో యూపీఐ యాప్ వచ్చేసింది..

- ఏ బ్యాంక్ ఖాతాదారు అయినా వాడొచ్చు
- డెబిట్ కార్డ్ లేకుండా నగదు ఉపసంహరణ



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కొత్తగా యోనో యుపిఐ యాప్‌ను తెచ్చింది. ఎస్‌బీఐలో ఖాతా లేని వారు కూడా.. ఏ బ్యాంక్ ఖాతాదారు అయినా ఈ మొబైల్ యాప్‌ను ఉపయోగించి లావాదేవీలు చేయడానికి వీలు కల్పించింది. దీని కోసం వినియోగదారులు ఎస్‌బీఐ యోనో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. అనంతరం 'న్యూ టు ఎస్‌బీఐ'ను క్లిక్ చేసి 'రిజిస్టర్ నౌ'పై నమోదు చేసుకుంటే సరిపోతుందని ఆ బ్యాంక్ తెలిపింది. తమ డిజిటల్ బ్యాంకింగ్ యాప్ సేవలను ప్రతీ ఒక్కరికీ అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో 'యోనో ఫర్ ఎవ్రీ ఇండియన్' ట్యాగ్‌లైన్‌తో దీన్ని ఆవిష్కరించామని వెల్లడించింది. ఈ యాప్ ద్వారా స్కాన్ అండ్ పే, పే బై కాంటాక్ట్స్, రిక్వెస్ట్ మనీ తదితర లావాదేవీలు చేయడానికి సౌలభ్యం ఉందని పేర్కొంది. అదే విధంగా డెబిట్ కార్డ్ లేకుండానే నగదు ఉపసంహరణ చేసుకునే సౌలభ్యం ఈ యాప్‌లో ఉందని తెలిపింది. ఐసీసీడబ్ల్యు సౌకర్యం ఉన్న ఏటీఎంలో ఏ బ్యాంక్ ఖాతాదారు అయినా ఎస్‌బిఐ యోనో ద్వారా యూపీఐ క్యూఆర్ క్యాష్ అప్షన్ ద్వారా నగదు తీసుకోవచ్చని వెల్లడించింది. ఈ సదుపాయంతో ప్రస్తుతమున్న ఇతర యూపీఐ యాప్‌లకు ఎస్‌బీఐ తీవ్ర పోటీని ఇవ్వనుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

గ్రామ పంచాయతీ సిబ్బంది పట్ల వివక్ష తగదు



జీవో 60 అమలు చేయాలి

- కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న సీఎం హామీ ఏమైంది..? : రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జెబి.రాజు
- కేవీపీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-ముషీరాబాద్

గ్రామాల్లో ప్రజలకు ప్రత్యక్ష సేవలందిస్తున్న 50వేల మంది పంచాయతీ కార్మికులు 9 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకుండా వివక్ష పాటించడం తగదని ప్రముఖ అంబేద్కర్‌వాది, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జెబి.రాజు అన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మెకు సంఘీభావంగా శుక్రవారం కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కేవీపీఎస్ నగర అధ్యక్షులు ఎం.దశరథ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచా యతీ కార్మికుల్లో నూటికి 80 శాతం మంది దళితులే ఉన్నారన్నారు. అందుకే వివక్ష కొనసాగిస్తున్నారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మోడీ స్వచ్ఛ భారత్, కేసీఆర్ పచ్చదనం పరిశుభ్రత పిలుపునందుకు కార్మికులు చిత్తశుద్ధితో పనులు చేశారని చెప్పారు. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామన్న సీఎం వాగ్దానం ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. వేతనాలు పెంపు కోసం ప్రభుత్వం రూపొందించిన జీవో నెంబర్ 60 ప్రకారంగా గ్రామపంచాయతీ సిబ్బందికి రూ. 19 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గ్రామ పంచాయితీ జేఏసీ చైర్మెన్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కూడా ఒక నెల రూ.8500 వేతనంతో గడిపితే గ్రామపంచాయతీ కార్మికుల జీవితాలు అవగతం అవుతాయని అన్నారు. వేతనాలు పెంచకుండా పని భారం పెంచడానికి జీవో నెంబర్ 51ను రూపొందించి.. ఒకే కార్మికుడు అనేక పనులు చేయాలనే మల్టీపర్పస్ విధానాన్ని ప్రవేశపెట్టడటం సరికాదన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. కార్మికులవి గొంతెమ్మ కోర్కెలు కావలని అందులో న్యాయం, ధర్మం నీతి మాత్రమే ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల అమలు కోసమే నేడు సమ్మె జరుగుతున్నదన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ మాట్లాడుతూ.. గ్రామ పంచా యతీ సిబ్బందికి పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించక పోవడం అన్యాయం కాదా అని ప్రశ్నిం చారు. బీజేపీ నేతలు నేడు టెంట్ల వద్దకు వచ్చి కార్మికులకు మద్దతు ఇస్తున్నారు కానీ.. అసలు కార్మికులకు ప్రాథమిక హక్కులు లేకుండా చేస్తున్నది బీజేపీ అనేది మరువ కూడదన్నారు. 8 గంటల పని విధానాన్ని 12 గంట లకు పెంచిన ఘనత బీజేపీ సర్కార్‌దేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీరాంనాయక్, రాష్ట్ర అధ్య క్షులు ఎం. ధర్మానాయక్, ప్రముఖ ప్రజా వైద్యులు డాక్టర్ స్వామి అల్వార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర్ల కిరణ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గద్ద యాదయ్య, బుడగ జంగాల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కడమంచి రాంబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీపై చర్చిద్దాం రండి

- సీపీఐ(ఎం) సహా పలు పార్టీలకు జేఏసీ ఆహ్వానాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

'దశాబ్ది ఉత్సవాలు-ఆర్టీసీ స్థితిగతులు, కార్మికుల పని పరిస్థితులు' అంశంపై ఈనెల 16న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించేందుకు రావల్సిందిగా టీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ పలు రాజకీయపార్టీలు, ట్రేడ్ యూనియన్లకు ఆహ్వాన పత్రాలు అందచేసింది. జేఏసీ చైర్మెన్ కే రాజిరెడ్డి నేతృత్వంలో కో కన్వీనర్ కత్తుల యాదయ్య, నాయకులు పీ రవీందర్‌రెడ్డి, పీఆర్ రెడ్డి, కేఆర్ రెడ్డి, మోసిన్, జీ కృష్ణ తదితరులు ఆయా పార్టీల నేతల్ని కలిసి ఆహ్వానపత్రాలు అందచేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, సీపీఐ(ఎమ్ఎల్) ప్రజాసంఘాల కార్యదర్శి పోటు రంగారావులను కలిసి ఆహ్వాన పత్రాలు అందచేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల్ని వారికి వివరించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ. సీపీఐ (ఎమ్ఎల్-న్యూడెమోక్రసీ), సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, బీఎమ్ఎస్ తదితర సంఘాల కార్యాలయాల్లోనూ ఆహ్వానపత్రాలు అందచేశారు. 16వ తేదీ జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు నాయకులు అందరూ సంసిద్ధత వ్యక్తం చేశారని జేఏసీ నేతలు తెలిపారు.

పోరాటానికి సిద్ధం అవ్వండి:అశ్వత్థామరెడ్డి

ఆర్టీసీ కార్మికులు ఎలాంటి భయాలకూ లోనుకాకుండా భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని టీఎస్‌ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ ఈ అశ్వత్థామరెడ్డి అన్నారు. ఆయన నేతృత్వంలో శుక్రవారం కార్మికుల భరోసా యాత్రను హైదరాబాద్‌లోని సీబీఎస్, ఎమ్‌జీబీఎస్ బస్టేషన్లలో నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ కే హన్మంతు, కో కన్వీనర్లు పీ కమాల్‌రెడ్డి, నరేందర్, అబ్రహం, సుద్దాల సురేష్, హరికిషన్, ఎర్ర స్వామి, పున్న హరికిషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కార్మికులను స్వయంగా కలిశారు.ప్రభుత్వం కావాలనే ఆర్టీసీని నిర్వీర్యం చేస్తూ ప్రయివేటుకు అప్పగించేలా కార్యాచరణ చేపట్టిందని వివరించారు. ఆర్టీసీ పరిరక్షణకు పోరాడేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

- బిల్లులు ఇవ్వాలని డిమాండ్

నవతెలంగాణ -విలేకరులు

ప్రభుత్వం సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి విద్యార్థులకు వండి పెడుతున్నామని.. వెంటనే బిల్లులు ఇవ్వాలని మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం ధర్నా చేశారు. తమకు కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొరిమి సుగుణ ఆధ్వర్యంలో జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో నగరానికి చెందిన దాదాపు వంద మంది యువకులు ఆ పార్టీలో చేరారు. డాక్టర్ సుధాకర్‌తో పాటు ఇతర నాయకులు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరల సమస్యను పట్టించుకోకుండా బీజేపీ విభజన రాజకీయాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఎం మోడీ పాలనలో ఆకలి, నిరుద్యోగ సమస్యలు పెరిగాయనీ, బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, ధనవంతుల సంక్షేమం కోసమే పని చేస్తున్నదని దుయ్యబట్టారు. రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడం, రాష్ట్రాల హక్కులను కాలరాయడం, ఆమోదయోగ్యం కాని వివాదాస్పద చట్టాలు ప్రజలపై రుద్దడం వంటి ప్రజావ్యతిరేక బీజేపీ విషపూరిత విధానాలను తిప్పికొట్టాలని యువతకు అయన పిలుపునిచ్చారు.

ఆగస్టు 29, 30 తేదీల్లో గ్రూప్-2 రాతపరీక్షలు


- విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చేనెల 29, 30 తేదీల్లో గ్రూప్ -2 రాతపరీక్షలను నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఏర్పాట్లు చేస్తున్నది. ఈ క్రమంలో గ్రూప్-2 పరీక్షా కేంద్రాలకు కేటాయించిన ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు ఆయా తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లు ఇందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రాల్లేని మిగతా ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థలు యథావిధిగా నడుస్తాయని ఆమె స్పష్టం చేశారు. వచ్చేనెల 29, 30 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం సమయంలో రోజు రెండు పేపర్ల చొప్పున గ్రూప్-2 పరీక్షలు జరుగుతాయి. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 దరఖాస్తులొచ్చాయి.

బీజేపీని పాతరేస్తాం...

- కిషన్ రెడ్డిని ఓడించి తీరుతాం... : మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మెన్ చెన్నయ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వర్గీకరణ చేస్తే బీజేపీని పాతరేస్తామని మాల సంఘాల జేఏసీ చైర్మెన్ జి.చెన్నయ్య హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడా రు. కిషన్‌రెడ్డి బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన తర్వాతే తిరిగి ఎస్సీ కులాల మధ్య విభజన రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి ఎక్కడ పోటీ చేసినా ఓడించి తీరుతామని తెలిపారు. ఎన్నికల్లో లబ్ది పొందేందుకే బీజేపీ మళ్లీ వర్గీకరణ అంశాన్ని ముందుకు తెస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమైందని తెలిపారు. దాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టేసిందనీ, జాతీయ ఎస్సీ కమిషన్ కూడా తీవ్రంగా వ్యతిరేకించిందని గుర్తుచేశారు. ఉత్తర్ ప్రదేశ్‌లో ఎస్సీల వర్గీకరణ చేసేందుకు బీజేపీ ప్రయత్నించిందనీ, అది సాధ్యం కాదని తెలిసి వెనక్కి తగ్గిందని గుర్తుచేశారు.

ఎగిసిన వంట నూనెల దిగుమతులు

జూన్‌లో 39% పెరుగుదల

- సరుకుల ఎగుమతుల్లో 22 శాతం పతనం
- 20 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు



న్యూఢిల్లీ : భారత ఎగుమతుల్లో పతనం చోటు చేసుకుంది. మరోవైపు వంట నూనెల దిగుమతులు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఏడాది జూన్‌లో సరుకుల ఎగుమతులు 22 శాతం పతనమై 32.97 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఇదే సమయంలో 53.10 బిలియన్ల దిగు మతులు జరిగాయి. ఎగుమతులు తగ్గడం, దిగు మతులు ఎక్కువగా ఉండటంతో గడిచిన నెలలో భారత వాణిజ్య లోటు 20.13 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకుంది. ఇంతక్రితం నెలలో 34.98 బిలియన్ల ఎగుమతులు, 57.10 బిలియన్ల దిగు మతులు జరిగాయి. ప్రపంచ మార్కెట్లలో కొన సాగుతున్న స్తబ్దత ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపుతోందని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్‌వాల్ అన్నారు.

2023 జూన్‌లో సర్వీస్ ఎగుమతులు 27.12 బిలియన్ డాలర్లుగా, దిగుమతులు 15.88 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం మేలో సర్వీసు రంగం ఎగుమతులు 25.30 బిలియన్లుగా, దిగుమతులు 13.53 బిలియన్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన కాలంలో సర్వీసెస్, సరుకుల ఎగుమతులు 7.3 శాతం తగ్గి 182.7 బిలియన్లుగా, దిగుమతులు 10.2 శాతం కోల్పోయి 205.29 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

వంట నూనెల దిగుమతి మంట

గడిచిన జూన్ మాసంలో వంట నూనెల దిగుతులు ఏకంగా 39.31 శాతం పెరిగి 13.11 లక్షల టన్నులుగా చోటు చేసుకున్నాయని ఆ పరిశ్రమ బాడీ సాల్వెంట్ ఎక్స్ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఇఎ) తెలిపింది. 2022 జూన్‌లో 9.41 లక్షల టన్నుల వంట నూనెల దిగుమతి జరిగిందని పేర్కొంది. గడిచిన నెలలో స్థూలంగా వంట నూనెల దిగుమతులు (వంట, వంటేతర నూనెలు) 49 శాతం పెరిగి 13.14 టన్నులుగా నమోదయ్యాయి. ఇవి గతేడాది ఇదే మాసంలో 9.91 లక్షల టన్నులుగా చోటు చేసుకున్నాయి. సబ్బు, ఒలియో కెమికల్ పరిశ్రమలు ఉపయోగించే వంటేతర నూనెలను 2,900 టన్నుల దిగుమతి జరిగింది. సన్ ఫ్లవర్ నూనెల దిగుమతులు మాత్రం 1.90 లక్షల టన్నులకు తగ్గాయి. ఇంతక్రితం నెలలో 2.95 లక్షల టన్నుల దిగుమతి నమోదయ్యింది. ఇండోనేషియా నుంచి వచ్చే ఫామ్ ఆయిల్ దిగుమతులు 4.76 లక్షల టన్నులకు పెరిగాయని ఎస్ఇఎ పేర్కొంది. బ్రెజిల్ నుంచి సోయాబిన్ చమురు దిగుమతులు 1.65 లక్షల టన్నులకు పెరిగినట్లు వెల్లడించింది.


సెన్సెక్స్ @ 66వేలు

- 19,500కు నిఫ్టీ
- ఐటి సూచీల పరుగు



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు కొనుగోళ్ల మద్దతుతో నూతన స్థాయి గరిష్టాలకు చేరాయి. శుక్రవారం చివరి అర్థగంటలో సూచీలు పరుగులు పెట్టాయి. ముఖ్యంగా ఐటి, బ్యాంకింగ్ షేర్ల మద్దతుతో బిఎస్ఇ సెన్సెక్స్ 66వేల పాయింట్ల మార్కెట్‌ను అధిగమించింది. సెన్సెక్స్ 502 పాయింట్లు రాణించి 66,061కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 151 పాయింట్లు పెరిగి 19,595 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో టిసిఎస్ అత్యధికంగా 5 శాతం పెరిగింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ సూచీలు 4.5శాతం, హెచ్‌సిఎల్ టెక్నలాజీస్, విప్రో సూచీలు 3 శాతం చొప్పున లాభపడ్డాయి. టాటా స్టీల్, నెస్లే, హిందుస్తాన్ యూనిలీవర్, ఆసియన్ పెయింట్స్, ఐసిఐసిఐ బ్యాంక్ షేర్లు ఒక్క శాతంపైనా పెరిగి మార్కెట్లకు మద్దతును అందించాయి. బిఎస్ఇలో ఐటి రంగం సూచీ 4.3 శాతం, లోహ సూచీ, రియాల్టీ సూచీలు ఒక్క శాతం చొప్పున రాణించాయి.

రక్తహీనతపై పిఅండ్‌జి అవగాహన క్యాంపెయిన్



హైదరాబాద్ : దక్షిణాదిలోని 21 నగరాల్లో రక్తహీనతపై అవగాహన కల్పించనున్నట్లు పిఅండ్‌జి హెల్త్ వెల్లడించింది. 'నా నా ఎనీమియా బస్సు యాత్ర 2.0' పేరుతో దీన్ని చేపడుతున్నట్లు పేర్కొంది. 90 రోజులకు పైగా సాగే బస్సు యాత్రలో 2వేల మందికి పైగా వ్యక్తులకు వైద్యులచే ఉచిత స్క్రీనింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రాక్టర్ అండ్ గ్యాంబుల్ హెల్త్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మిలింద్ థాటే తెలిపారు. విశాఖలో ఈ యాత్రను ప్రారంభించామని తెలంగాణ ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో ఈ క్యాంపెయిన్ చేపట్టనున్నామన్నారు. ఐరన్ లోపం పిల్లలు, గర్భిణులు లేదా రుతుస్రావం ఉన్న మహిళలు సహా అన్ని వయస్సుల వారిని రక్తహీనత ప్రభావితం చేస్తుందన్నారు.

ప్రాట్ అండ్ విట్నీ ట్రైనింగ్ సెంటర్ హెడ్‌గా అజయ్ స్ఫూర్తి



న్యూఢిల్లీ : భారత్‌లోని తమ కస్టమర్ ట్రైనింగ్ సెంటర్ హెడ్‌గా అజయ్ స్ఫూర్తిని నియమించినట్లు ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ల తయారీదారు ప్రాట్ అండ్ విట్నీ తెలిపింది. పౌర విమానయాన పరిశ్రమలో అజయ్‌కు 27 ఏళ్ల పైనా అనుభవం ఉంది. ఆయన తన కెరీర్ విస్తరించే సమయంలో వివిధ ఎయిర్‌లైన్స్‌తో, ఒరిజినల్ ఎక్విప్ మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఒఇఎంలు)తో పని చేశారు. ఆయన తన కొత్త బాధ్యతలో భాగంగా హైదరాబాద్‌లోని ప్రాట్ అండ్ విట్నీ ఐసిటిసికి బాధ్యతవహిస్తారని ఆ సంస్థ పేర్కొంది.

ఎయిర్‌టెల్‌తో పోకో భాగస్వామ్యం



బెంగళూరు: దిగ్గజ టెల్కో భారతీ ఎయిర్‌టెల్‌తో మొబైల్ ఫోన్ల తయారీదారు పోకో భాగస్వామ్యం కుదర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా పోకో సి51 స్మార్ట్‌ఫోన్‌ను సరసమైన ధరలో ఎయిర్‌టెల్ ఖాతాదారులకు అందించనున్నట్లు పోకో పేర్కొంది. 4జిబి ర్యామ్, 64 జిబి వేరియంట్ కలిగిన ఈ 4జి స్మార్ట్‌ఫోన్‌ను జులై 18 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో రూ. 5,999కే ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఇది ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ కనెక్షన్‌తో లాక్ అయి ఉంటుందని తెలిపింది.

టీఎస్‌ఎంసీ ముఖ్య ఎన్నికల అధికారిగా డీఎంఈ వద్దు


- రిజ్వీకి హెచ్‌ఆర్‌డీఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్‌ఎంసీ)కు జరగనున్న ఎన్నికల కోసం రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులను ముఖ్య ఎన్నికల అధికారిగా నియమించడం పట్ల హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌డీఏ) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.మహేశ్ కుమార్ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీకి వినతిపత్రం సమర్పించారు. టీఎస్‌ఎంసీలో డీఎంఈ ఎక్స్- అఫిషియో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఇన్‌ఛార్జీ డీఎంఈపై హైకోర్టులో పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయనీ, ఎన్నికల సమయంలో ఈ అంశాలు వివాదానికి దారి తీసే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన స్థానంలో ముఖ్య ఎన్నికల అధికారిగా ఇతర శాఖలకు చెందిన ఉన్నతాధికారిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలను ఈ-వోటింగ్ లేదా ఈవీఎంల ద్వారా నిర్వహించాలని కోరుతూ మరో వినతిపత్రాన్ని సమర్పించారు.

తెలంగాణ టూరిజాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం

- ఏసీ స్లీపర్ బస్సుల ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ టూరిజాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కషి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అందులో భాగంగా దేశ, విదేశీ టూరిస్టులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. హైదరాబాద్ నుంచి తిరుపతి, షిర్డీకి రెండు ఏసీ స్లీపర్ బస్సులు, హైదరాబాద్ సిటీ సైట్ సీన్ కోసం ఏసీ మినీ బస్ సర్వీసులను రవీంద్రభారతిలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నూతనంగా రూ.3.50కోట్లతో కొనుగోలు చేసిన రెండు అత్యాధునిక ఓల్వో మల్టీ ఎక్సెల్ కోచేస్ ఏసీ స్లీపర్ కోచ్ బస్సులను, రూ.32.61లక్షలతో ఫోర్స్ కంపెనీకి కంపెనీకి చెందిన మినీ ఏసీ బస్సులను కొనుగోలు చేసినట్టు తెలిపారు.

హైదరాబాద్-తిరుపతి తిరుమల

ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా ఈ బస్సులను పర్యాటకుల సౌలభ్యం కోసం అందుబాటులోకి తీసుకొచ్చినట్టు మంత్రి వెల్లడించారు. హైదరాబాద్ నుంచి తిరుపతి తిరుమలకు రెండు రోజులకుగాను పెద్దలకు రూ.4,200, పిల్లలకు రూ.3,360తో ప్రత్యేక టూర్ ప్యాకేజ్‌ని తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గతంలో ఈ రూట్‌లో స్లీపర్ బస్సులు ఉన్నప్పటికీ ప్రయాణికుల డిమాండ్ మేరకు మరో రెండు బస్సులను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. తెలంగాణ టూరిజం అంటే ప్రజల్లో నమ్మకం ఉందని, ఆ నమ్మకాన్ని అలాగే కొనసాగిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో కాళేశ్వరం ప్రాజెక్టుతో సహా ఇతర ప్రాజెక్టులు, ముఖ్యమైన ప్రదేశాలను టూరిజం హబ్‌గా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కల్లు గీత పారిశ్రామిక అభివద్ధి సంస్థ చైర్మెన్ పల్లె రవికుమార్‌గౌడ్, పర్యాటకశాఖ ఎండీ మనోహర్, ఉన్నతాధికారులు సత్యనారాయణ, నర్సింగ్‌రావు, రాజలింగం, సత్యనారాయణ రాజు, రాజమౌళి, శ్రీనివాస్, ఓంప్రకాష్, పర్యాటకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో సౌండ్ అండ్ లైట్ షో పరిశీలన

హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో తెలంగాణ పర్యాటకాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిసున్న సౌండ్ అండ్ లైట్ షోను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ షోకు పర్యాటకుల నుంచి ఆదరణ పెరిగేలా ప్రమోషనల్ కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి తలమానికమైన గోల్కొండ కోటకు వచ్చే పర్యాటకులకు కనీస సౌకర్యాలను కల్పించాలని వారికి సూచించారు. కోటలో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. పర్యాటకులకు ఇబ్బంది కాకుండా స్థానికులు వ్యవహరించాలని కోరారు. గోల్కొండ కోట గైడ్‌లు కోట ప్రాముఖ్యత, విశేషాలను మంత్రికి వివారించారు. అనంతరం తెలంగాణ పర్యాటకాభివద్ధి సంస్థ ఉద్యోగులు నిర్వహించిన గోల్కొండ బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'నీలి విప్లవం పథకాన్ని సద్వినియోగించుకోండి'



నవతెలంగాణ- బడంగ్‌పేట్

కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన, నీలి విప్లవం పథకాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు మంత్రి మహేష్ కోరారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. ఈ పథకం కింద సంచార మత్స్య విక్రయ వాహనాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వాహనం యొక్క ఒక మోడల్ ఎంచుకొని, లబ్ధిదారుల వాటాతో సంబంధిత జిల్లా మత్స్య శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఆసక్తి గల లబ్ధిదారులందరూ లబ్ధిదారుని వాటా వీలైనంత త్వరగా చెల్లించుటకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

'ప్రశాంత వాతావరణంలో బోనాలు నిర్వహించాలి'



నవతెలంగాణ- సంతోష్ నగర్

బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులదే అని కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం డివిజన్ పరిధిలో పర్యటించారు. దేవాలయం వద్ద పరిశుభ్రత పరిరక్షణ వీధిలైట్లు, బీటీ రోడ్డు ప్యాచ్ వర్క్, ఫుట్ పాత్, పరిశ్రమల ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, యువకులు. పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయొద్దని ఆందోళన



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని బొక్కొని గూడ గ్రామంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్న సమయంలో గ్రామస్తులు అక్కడికి చేరుకొని ఆందోళన చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానికులు మాట్లాడుతూ తాతలు, తండ్రులు గతంలో పిల్లల చదువుల నిమిత్తం బొక్కొనిగూడ పట్టా సర్వే నెం. 324లో చందాలు వేసుకొని స్కూలు నిర్మాణం నిర్మాణం చేశామని గుర్తుచేశారు. స్కూలు గ్రౌండ్లో భవనం పశువుల ఆసుపత్రి నిమిత్తం ట్రెవిస్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ స్కూల్ మూతపడడంతో స్కూలు ముందు ఉన్న గ్రౌండ్‌ను ఊరి ప్రజలందరం కలిసి ప్రహరీగోడతో పాటు గ్రౌండ్‌ను అభివృద్ధి చేసుకున్నట్లు వివరించారు. అక్కడ మా పిల్లలు ఆడుకోవడానికి ఆటస్థలం లాగా, పెద్దవాళ్ళకు సాయంకాలం సమయంలో సేదతీరుటకు, మా ఊరి మహిళలు బతుకమ్మను ఆడుకోవడానికి చాలా ఉపయోగపడుతుందన్నారు. అంతేకాదు చావులకు, వెటరీనరీ క్యాంపులు, ఒక ప్రక్కన చౌకధరల దుకాణం నిర్వహించడానికి కూడా ఉపయోగపడుతుందని వివరించారు. ప్రక్కన సూర్యోదయ యువజన సంఘం ప్రతి సంవత్సరం గణపతి, నవరాత్రి ఉత్సవాలను నిర్వహించి.. అన్నదానం లాంటి కార్యక్రమాలు కూడా చేస్తారని వారు తెలిపారు. ఇంతగా ఉపయోగపడే మా ఊరి గ్రౌండ్‌లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం వలన ప్రజలకు ఎన్నో నష్టాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బొక్క కృష్ణారెడ్డి, బొక్క సత్తిరెడ్డి, బొక్క సంజీవరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎస్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లి అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్ పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ సహకారంతో జల్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టితో ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో 7, 8, 9, 10, 24 వార్డులలో రూ.4 కోట్ల నిధులతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్, ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ల సహకారంతో ఇప్పటికే కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో రూ. కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇటీవల మహేశ్వరం పర్యటనలో సీఎం కేసీఆర్ రెండు కార్పొరేషన్లకు రూ.50 కోట్ల చొప్పున రూ.100 కోట్లు, రెండు మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున రూ.50 కోట్ల నిధులు కేటాయిస్తూ వరాల జల్లులు కురిపించారని గుర్తుచేశారు. రూ.168కోట్లతో పాటు, మెడికల్ కళాశాల, సబ్ స్టేషన్ మంజూరు చేశారని కొనియాడారు. ఇందులో జల్ పల్లికి రూ.25 కోట్ల నిధులు విడుదలైనట్లు..వాటితో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో 28 వార్డుల్లో 80 లక్షల చొప్పున వెచ్చించి.. కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు వివరించారు. రూ.100కోట్లతో జల్‌పల్లిలో ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వర్షకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. పహాడి షరీఫ్‌లో గల దర్గా ర్యాంప్ రోడ్డు పనులకు ఇటీవలే రూ.5కోట్ల నిధులు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. మొత్తం సుమారు రూ.14 కోట్ల నిధులతో దర్గా పైకి రోడ్డు, పార్కింగ్ వసతులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ సయ్యద్ యూసుఫ్ పటేల్, కమిషనర్ వసంత, డీఈఈ వెంకన్న, ఏ.ఈ.అయేషా, కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు ఎక్బాల్ ఖలీఫా, కౌన్సిలర్లు ఎండి.శంషోద్దీన్, షేక్ పమిద అఫ్జల్, పల్లపు శంకర్, కే.లక్ష్మీనారాయణ, మజర్ అలి, దస్తగిర్, యాహైయా, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షులు యంజాల్ జనార్ధన్, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

పార్కు, చెరువులను కాపాడండి



నవతెలంగాణ-తుర్కయాంజల్

తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని పార్కులు, చెరువులను కాపాడే బాధ్యత అధికారులదే అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య అన్నారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో కబ్జాకు గురవుతూశ్రీ మిత్ర వెంచర్ లో మూడు ఎకరాల పార్కు, మన్నెగూడ ఎర్ర కుంట చెరువులను శుక్రవారం సీపీఐ పార్టీ నాయకత్వం పరిశీలించింది. ఈ సందర్భంగా ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ అధికారుల అలసత్వం వలనే పార్కులు, చెరువులు కబ్జాకు గురవుతున్నాయని ఆరోపించారు. వ్యాపారస్తులు ఎక్కువ లాభాల కోసం ప్రజలకు సంబంధించిన ఆస్తులను కబ్జా చేయడం అలవాటుగా మారిందని అన్నారు. వీరికి అధికారులు, రాజకీయ నాయకుల అండదండలు అధికంగా ఉన్నాయని చెప్పారు. ఇలాంటి కబ్జాలపై సీపీఐ పార్టీగా పోరాటాలు చేస్తుందని, కబ్జాదారుల సంగతి తెలుస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు పి. శివకుమార్, పల్లపు శివ కుమార్, గోవర్ధన్‌లు పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన సీపీఐ నాయకులు



నవతెలంగాణ-తుర్కయాంజల్

ఇబ్రహీంపట్నం రాజస్వ మండల నూతన (ఆర్డీఓ)గా బాధ్యతలు స్వీకరించిన కే. అనంత రెడ్డిని శుక్రవారం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య తోపాటు నాయకులు పి. శివకుమార్, పల్లపు శివకుమార్, గోవర్ధ న్‌లు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సంద ర్భంగా ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ అధికారులు చట్టాలను అమలు చేయడం కోసం చిత్తశుద్ధితో పని చేయాలని అన్నారు. అంతేకాకుండా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వ్యాపారస్తుల బెదిరింపులకు, ప్రలోభాలకులోను కాకుండా చట్టాల అమలుకు కృషి చేయాలన్నారు. అందుకుగాను సీపీఐ పార్టీ పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.

16న రాష్ట్ర వైదిక బ్రాహ్మణ సంఘ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ- చైతన్యపురి

ఈ నెల 16న తెలంగాణ రాష్ట్ర వైదిక బ్రాహ్మణ సంఘం కార్యాలయాన్ని ఆర్కేపురం పోస్ట్ ఆఫీస్ లైన్ రోడ్ నెంబర్ 6 లో ప్రారంభించనున్నట్లు మురుకుంట్ల రాజేశ్వర శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటుగా అల్కాపురి శంకర్ మఠంలోని జగద్గురు ఆది శంకరాచార్య యొక్క విగ్రహ పూజా కార్యక్రమం అనంతరం.. శ్రీవిద్య శక్తి పీఠం, రామకృష్ణాపురం పోస్ట్ ఆఫీస్ లైన్ రోడ్ నెంబర్ 6 కార్యాలయం వరకు వేద బ్రాహ్మణ ఉత్తముల మంత్రోచ్చారణతో శోభాయాత్రను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అవధానుల నర్సింహ ప్రసాద్ శర్మ ,రుద్రవీణ బాలసుబ్రమణ్యం, నారాయణ చక్రవర్తి శర్మ (శ్రీ విద్యా శక్తి పీఠం వ్యవస్థాపకులు),మాడా వెంకటరమణ శర్మ , మాడ పాపయ్య శర్మ, రామకృష్ణ మోతే రంగారి, మహవది వినోద్ శర్మ ,తాడికొండ అనురాధ, లలిత తదితరులు పాల్గొన్నారు.

18న నిర్వహించే

జిల్లా సదస్సును జయప్రదం చేయాలి



నవతెలంగాణ - ఎల్బీనగర్ / చైతన్యపురి

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈ నెల 18న శంషాబాద్ లో నిర్వహించే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్ టీయూ, ఐఎన్ టీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కాలనీలోని సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని నిలబెడదామని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ జూలై 20న జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐదు కనీస వేతనాల జీవోలను అమలు చేయాలని కోరారు. మిగిలిన షెడ్యూల్ పరిశ్రమలలో కనీస వేతనాల జీవోలను ప్రకటించి అమలు చేయాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనాలు నిర్ణయించాలని, వారిని కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రైతాంగానికి మద్దతు ధర ప్రకటించాలని, అదేవిధంగా రైతు వ్యతిరేక 2022 విద్యుత్ ఎలక్ట్రిసిటీ బిల్లుని వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరణ రద్దు చేయాలని, నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ రద్దు చేయాలని, కాంట్రాక్టు విధానం రద్దు చేయాలని కోరారు. ప్రధాని మోడీ కార్పొరేట్‌కు అనుకూలంగా ఉండే విధా నాలను ఉపసంహరించుకొని దేశంలో అత్యధిక ధన వంతుల ఆదాయంపై సంపద పనులు పెంచి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు కేటాయించాలన్నారు. డీజిల్, పెట్రోల్ సెంట్రల్ ఎక్సైంజ్ డ్యూటీని తగ్గించాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, ఏఐటీ యూసీ జిల్లా కార్యదర్శి యాదయ్య, ఐఎఫ్ టీయూ హైదరాబాద్ అధ్యక్షురాలు పద్మ, ఐఎన్ టీయూసీ జిల్లా కన్వీనర్ భాస్కర్ రెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.వీరయ్య, ఆలేటి ఎల్లయ్య, సిహెచ్ వెంకన్న పాల్గొన్నారు.

చంపాపేట్‌లో 16న బోనాలు



నవతెలంగాణ- సంతోష్ నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలో ఈ నెల 16న నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ అమ్మవార్ల బోనాల ఉత్స వాలను అత్యంత వైభవంగా నిర్వహించినట్లు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తు లందరూ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించాలని కోరారు. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుంగా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

చిన్నారి శ్రేయాన్సికి శ్రీరాములు పరామర్శ



నవతెలంగాణ- బడంగ్‌పేట్

బిల్డింగ్ పైనుంచి ప్రమాదవశాత్తూ పడి గాయపడిన చిన్నారి శ్రేయాన్సిని మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడలో బాల్ రెడ్డి నివాసానికి వెళ్లి అందెల శ్రీరాములు యాదవ్ పరామర్శించారు. తర్వాత శ్రేయాన్సి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో బడంగ్ పేట కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, కార్పొరేటర్ రామిడి మాధూరి వీరకర్ణారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామిడి శురకర్ణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రవికాంత్, పోరెడ్డి జగన్ మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

16న మహంకాళి జాతర బోనాలు



నవతెలంగాణ- సంతోష్ నగర్

మహంకాళి జాతర బోనాల ఉత్సవాలను ఈ నెల 16న నిర్వహించనున్నట్లు శ్రద్ధాబాద్ మహంకాళి జాతర ఉత్సవాల కమిటీ అధ్యక్షులు కె .మల్లేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కడారి రామ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అమ్మవారి కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతబస్తీలో జరిగే మహంకాళి జాతరలో సైదాబాద్ బోనాల ఉత్సవం సందర్భంగా 16న బోనాలు, 17న మధ్యాహ్నం 1-30 గంటల నుంచి అమ్మ వారి ఘటం ఊరేగింపు, గావు పెట్టి పలహారబండ్ల ఊరేగింపు, 18న మధ్యాహ్నం జరిగే అన్నదాన కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, భక్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బామమరిదిపై చేయి చేసుకున్న బావకు జైలు

నవతెలంగాణ- సంతోష్ నగర్

బావమరిదిపై చేయి చేసుకున్న బావకు ఐదు రోజులు జైలు శిక్ష పడిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ మలక్‌పేట, వాహెద్నగర్కు చెందిన మహ్మద్ హాజీ అలీ తరచూ భార్య హజీరా ఫాతిమాతో గొడవపడేవారు. ఓ రోజు ఇద్దరు గొడవ పడుతుండగా.. బావమరిది షేక్ ఫరీద్.. బావ హాజీ అలీని సముదాయించేందుకు ప్రయత్నించారు. దీంతో కోపోద్రిక్తుడైన హాజీ అలీ బావమరిదిని కొట్టాడు. దీంతో అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడ్ని పోలీసులు కోర్టులో హాజరుపర్చగా.. ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ ఆరోవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ లక్ష్మణరావు తీర్పును వెల్లడించారు.

ప్రజా సేవకుడిగా వస్తున్నా..

నవతెలంగాణ - ఉప్పల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాసేవకుడిగా మీ ముందుకు వస్తున్నానని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 10వ రోజు ఉప్పల్ డివిజన్ పరిధిలోని ఉప్పల్ బొడ్రాయి, హనుమ సాయి నగర్, విజయపురి, న్యూ విజయపురి, సాయిరాం కాలనీ, శాంతినగర్, న్యూ శాంతినగర్, (శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం) హనుమాన్ దేవాలయం ప్రాంతల్లో ఆయన పర్యటించారు. పాదయాత్రలో ముఖ్యంగా సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, తాగునీటి సమస్య, వీధి దీపాల ఏర్పాటు ఇలా పలు రకాల సమస్యలపై ప్రజలు ఆయనకు వినతి ప్రతాలను అందజేశారు. ఆయన ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన డివిజనల్ లోని అన్ని సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, అరటికాయల భాస్కర్, వేముల సంతోష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మస్క సుధాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గరిక సుధాకర్, లేతాకుల రఘుపతి రెడ్డి, మేకల మధుసూదన్ రెడ్డి, చింతల నరసింహారెడ్డి, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



రామంతపూర్‌లో మాజీ మేయర్ పర్యటన



నవతెలంగాణ- ఉప్పల్

రామంతపూర్ డివిజన్‌లోని కేసీఆర్ నగర్ కాలనీలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా బొంతు రామ్మోహన్ కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అండర్ డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, తాగునీటి సౌకర్యం, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కాలనీవాసులను హామీ ఇచ్చారు. కాలనీలలో నోటరీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించేలా కృషి చేయాలని కాలనీవాసులు బొంతు రామ్మోహన్‌కు విజ్ఞప్తి చేశారు.ఈ పర్యటనలో ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు గంథం నాగేశ్వరావు హనుమంత్ రెడ్డి, గొలుసుల స్వామి, నాగరాజు, రాంచందర్, చందర్ రాయుడు, యాదగిరి, బాలరాజు, క్రిష్టయ్య, నగేష్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ -సంతోషనగర్

ల్యాబ్స్, పబ్లిక్ సెక్టార్ క్లస్టర్ కమిటీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని (ఆర్ఎల్‌సి) రీజనల్ లేబర్ కమిషనర్ సునీల్ కుమార్ సాహు కు శుక్రవారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం క్లస్టర్ కన్వీనర్ ఎస్. కిషన్, తిరుపతిలు మాట్లాడుతూ చాలా మంది కాంట్రాక్టర్లు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ లాంటివి సరిగ్గా అమలు చేయాలని అన్నారు. వేతనాలలో కోతలు చేయకుండా చూడాలన్నారు. వర్క్ ఆర్డర్ పేరు తో కార్మికులను తొలగించడం ఆపాలి అని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, బాలయ్య, సోమన, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ రావు మరణం విద్యాభివృద్ధికి తీరని లోటు

- చైర్మెన్ పోసిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ-చైతన్యపురి

శ్రీ చైతన్య విద్యాసంస్థల అధిపతి బీఎస్‌రావు అకాల మరణం విద్యాభివృద్ధికి తీరని లోటని అపోలో మెడికల్ అకాడమీ చైర్మన్ పోసిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం బీఎస్ రావు మరణం పట్ల దిగ్భ్రాంతి తెలియజేస్తూ... చైతన్యపురిలోని అపోలో మెడికల్ అకాడమీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రాలలో విద్యాభివృద్ధికి పాటుపడుతూ దేశవ్యాప్తంగా ఉన్నత విద్య కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి, అధ్యాపక బృందం ఎం గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్, సురేందర్ గౌడ్, కేవీఆర్, రాజు, విద్యార్థులు, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో

దేశంలో తెలంగాణకు మొదటి స్థానం

నగర పోలీస్ కమిషనర్ సీవీ. ఆనంద్, ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



నవతెలంగాణ - సంతోష్ నగర్

శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. నూతనంగా నిర్మించిన సైదాబాద్ పరిధిలోని హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయాన్ని హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ సిహెచ్ రూపేష్, పోలీస్ అధికారులు సిబ్బందిలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో అన్ని ఆధునిక సదుపాయాలతో అత్యుత్తమ పోలీస్ స్టేషన్లను నిర్మించడం జరుగుతుందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటులో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ఓల్డ్ సిటీ కాదని గోల్డ్ సిటీ అని ఇక్కడ పనిచేసిన అధికారులు, స్థానికులు చూపించే ఆప్యాయతను ఎప్పటికీ మరచిపోలేమని అన్నారు. అనంతరం సీపీ సీవి ఆనంద్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో నగర పోలీసుల పాత్ర అభినందనీయమన్నారు. నగరం సేఫ్ సిటీగా ఉందన్నారు. డీసీపీ మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రతల పరిరక్షణ పటిష్టంగా ఉందని, మహిళలు ఏ సమయంలోనైనా నిర్భయంగా తిరగగలుతున్నారని అన్నారు. ఏదైనా నేరం జరిగితే 24 గంటల్లోనే నిందితులను పట్టుకుంటున్నామని చెప్పారు. నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా లా అండ్ ఆర్డర్, ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు ఏసీపీలు, సీఐలు, డీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మక్తాల ఫౌండేషన్‌కు ప్రశంసాపత్రం అందజేత



నవతెలంగాణ- బేగంపేట

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహాకాళి ఆషాఢ బోనాలు-2023 జాతరలో మక్తాల ఫౌండేషన్ సేవను గుర్తించి తలసాని శ్రీనివాస్ యాదవ్ మక్తాల ఫౌండేషన్ సేవకులకు శుక్రవారం ప్రశంసాప్రతాన్ని అందజేశారు. కార్యక్రమంలో అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపకులు జలందర్ గౌడ్, ఫౌండేషన్ సభ్యులు శివచారి, మోహన్‌లాల్, గణేష్ గౌడ్, మల్లిఖార్జున్, స్వరూప్‌లు పాల్గొన్నారు.

11 ఉద్యానవనాల్లో స్ట్రీట్‌లైట్స్ ప్రారంభం



నవతెలంగాణ-బేగంపేట

సనత్‌నగర్‌లోని 11 ఉద్యానవనాల్లో స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేసినట్టు కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని ఆదేశాల మేరకు అధికారులు ఏర్పాటు చేశారని ఆమె తెలిపారు. స్ట్రీట్ లైట్స్ ఏర్పాటుతో స్థానికులు మంత్రి తలసానికి, కార్పొరేటర్ కొలను లక్ష్మి బాల్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఈ కిరణ్మయీ, డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, సర్ఫ్ సంతోష్, ఖలీల్, ఫాజిల్, షఫీ, శేషు, వరప్రసాద్, విష్ణు, నందకిషోర్, శ్రీను, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బొమ్మరాసిపేట గ్రామస్తులకు న్యాయం చేయాలి

- సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి సత్యం



నవతెలంగాణ-కాప్రా

బొమ్మరాసి పేట గ్రామంలోని రైతులకు న్యాయం చేయాలని సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి సత్యం అన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా షామీర్పేట్ మండలం బొమ్మరాసి పేట గ్రామంలో సుమారు 300 మంది రైతులకు చెందిన 550 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు భూ కబ్జాదారులతో కుమ్మక్కై లాక్కోడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. 50 ఏండ్ల ముందు చిన్న సన్నకారు రైతుల పూర్వీకులు రిజిస్టర్ సేల్స్ డీట్స్ ద్వారా భూములు కొనుగోలు చేశారని తెలిపారు. అప్పటినుంచి ఆ భూముల్లో బోర్లు వేసుకుని కూరగాయలు, పండ్లు సాగుచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ రైతులు ప్రభుత్వం ఇస్తున్న రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు పొందుతున్నారని చెప్పారు. ధరణిలోని లోపాలను అడ్డంపెట్టుకుని రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు భూ కబ్జాదారులతో కుమ్మక్కై, భూములను లాక్కోడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ భూ కుంభకోణాన్ని సీపీ(ఐ)ఎం సహించబోదని చెప్పారు. ఇప్పటికైనా సమగ్ర విచారణ చేసి బొమ్మరాసిపేట గ్రామ రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీ)ఐ)ఎం ఆధ్వర్యంలో బాధితులతో కలిసి సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో రాస్తారోకో



నవతెలంగాణ-సిటీబ్యూరో

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం ఈసీల్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాసులు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించకపోవడంతో పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ జీవోలను సవరించి వేతనం రూ.26వేలుగా నిర్ణయించి వెంటనే విడుదల చేయాలని కోరారు. 1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టాన్ని ఇంప్లిమెంట్ చేయాలనీ, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలనీ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో వీటి సాధన కోసం కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.గణేష్, ఉపాధ్యక్షులు బీవీ.సత్యనారాయణ, సీఐటీయూ నాయకులు టి.నరసింహ, రసూల్, పి.శ్రీనివాస్, ఆదాం, అబ్దుల్లా, రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయిస్తా : ఎమ్మెల్యే మైనంపల్లి



నవతెలంగాణ-మల్కాజ్‌గిరి

అసంపూర్తిగా పెండింగ్‌లో నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. డివిజన్ పరిధిలోని విష్ణుపూరి ఎక్స్ టెన్షన్ కాలనీ వాసులు ఓల్డ్ మల్కాజ్ గిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ నివాసం వద్ద ఎమ్మెల్యే కలిసి సమస్యలను వివరించారు. కాలనీ బాక్స్ డ్రైన్ పనులు చాలా రోజులుగా ఆగిపోయాయని తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి పనులు స్టార్ట్ చేయాలని ఈఈ లక్ష్మణ్‌కు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్, ఎస్‌ఆర్ ప్రసాద్, గుండా నిరంజన్, సంజయ్, విష్ణు పూరి ఎక్ టెన్షన్ కాలనీ అసోసియేషన్ సభ్యులు శంకర్ రావు, శ్రీనివాస్ యాదవ్, వీవీ ఎస్ శర్మ, నాగరాజు, బాబు నాయక్, ఫణి కుమార్, రామరావు, బీటీ నాయక్, రామ చందర్, మూర్తి, రవీందర్, మధుసూదన్ ఉన్నారు.

ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండేలా చర్యలు

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికలకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని, ముందస్తు కార్యాచరణ రూపొందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి అసెంబ్లీ సాధారణ ఎన్నికలపై సమీక్షా సమావేశం, అవగాహన, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఉపయోగం కోసం డిజిటల్ ప్లాట్‌ఫ్ పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ఓటర్లకు ఓటుపై అవగాహనతోపాటు ఈవీఎంలు, వీవీప్యాట్స్ వివరాలను తెలియజేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మొబైల్ వ్యాన్ల ద్వారా ఓటు వేసే విధానం, తదితర వివరాలను తెలియజేస్తూ ఓటు హక్కు గురించి అధికారులు వివరిస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్వో)లు ఇంటింటి సర్వే నిర్వహించి కొత్తగా ఓటర్ల నమోదు ప్రక్రియ చేపడుతున్నారని తెలిపారు. అదే సమయంలో ఓటర్ల మార్పులు, చేర్పులు చేపడుతున్నారని పేర్కొన్నారు. రెండు చోట్ల ఓటు ఉంటే ఓటర్లు కోరిన చోట ఒకే ఓటు ఉండేలా చూస్తున్నామని తెలిపారు. డూప్లికేట్ ఓట్లు లేకుండా సంబంధిత అధికారులు తమ విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామనీ, స్వీప్ యాక్టివిటీలు నిర్వహి స్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటు న్నామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి చంద్రావతి, ఎన్నికల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాలకు రావాలని ఆహ్వానం



నవతెలంగాణ- మల్కాజిగిరి

ఈ నెల 16,17 తేదీల్లో జరిగే బోనాల పండుగ ఘట్టం ఊరేగింపు కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావుకు ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్ ముదిరాజ్ శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, ఎస్‌ఆర్‌ప్రసాద్, గుండా నిరంజన్, సంపత్ రావు, సూరి, ఉపేందర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ సాయిబాబా నగర్‌కు చెందిన మాదాపూర్ కాళిక ఇటీవల క్యాన్సర్‌కు గురైంది. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలతో కాప్రా డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గూడ ఇంద్రయ్య కాళికకు అవసరమయ్యే మెడిసిన్స్ కోసం శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బండారి లక్ష్మారెడ్డి అనేక సేవ, సామజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాధితురాలు ప్రయివేట్ ఉపాధ్యారాలిగా విధులు నిర్వహిస్తుందని తెలిపారు.

అభివృద్ధి పనులకు ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తాం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్ని కోట్ల నిధులైనా ఖర్చు చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. శుక్రవారం బన్సీలాల్ పేట డివిజన్‌లో సుమారు రూ.1.63 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా భోలక్ పూర్‌లోని కృష్ణానగర్ కాలనీలో రూ.14 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు, ఐడీహెచ్ కాలనీలో రూ.12.30 లక్షల వ్యయంతో సీవరేజ్ లైన్ పునరుద్ధరణ పనులను, కీస్ బ్లాక్‌లో మెయిన్ రోడ్డులో రూ.21.20 లక్షలవ్యయంతో సీవరేజ్ లైన్ పనులను, సున్నం బట్టీలోని వెటర్నరీ హాస్పిటల్‌కు రూ.9.20 లక్షల వ్యయంతో వాటర్ లైన్ పనులను, న్యూ బోయగూడలోని వెంకటేశ్వరస్వామి టెంపుల్ సమీపంలో రూ.58.90 లక్షల వ్యయంతో వీడీసీసీ రోడ్డు నిర్మాణం, డాన్ బోస్కో స్కూల్ వద్ద రూ.9.80 లక్షలవ్యయంతో సీవరేజ్ లైన్ పునరుద్ధరణ, గవర్నమెంట్ స్కూల్ వద్ద రూ.18.80 లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణం, బోయగూడలోని వాటర్ వర్క్స్ ఆఫీస్ ఎదురుగా రూ.9.85 లక్షల వ్యయంతో సీవరేజ్ లైన్ పునరుద్ధరణ, ఉప్పలమ్మ టెంపుల్ వద్ద రూ.9.85 లక్షల వ్యయంతో చేపట్టబోయే వాటర్ లైన్ పునరుద్ధరణ పనులను ఎమ్మెల్సీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయగూడ కమాన్ నుంచి మల్లన్న టెంపుల్ వరకు రోడ్డును నిర్మించామని తెలిపారు. గడిచిన 9ఏండ్లల్లో నియోజకవర్గ పరిధిలో కోట్లాది రూపాయల వ్యయంతో రోడ్లు, డ్రయినేజీ, వాటర్‌లైన్‌ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. అభివృద్ధిలో సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

అనంతరం పలు కాలనీవాసులు మంత్రి దృష్టికి వివిధ రకాల సమస్యను తీసుకెళ్లారు. కృష్ణానగర్ కాలనీలోని ప్రభుత్వ స్కూల్ పక్కన కాలనీలోకి రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరడంతో వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సున్నంబట్టీలోని నాలాలో పూడిక పేరుకపోయి వర్షం వస్తే నీరంతా రోడ్లపైకి వస్తుందని మంత్రి దృష్టికి తేగా పూడిక తొలగింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎవర్ గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సమీపంలోని ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఫుట్‌పాత్ నిర్మించాలని ఆదేశించారు. ఐడీహెచ్ కాలనీలో శిథిలావస్థకు చేరిన నాలాను పునర్నిర్మించాలని అధికారులను సూచించారు. డాన్ బోస్కో స్కూల్ వద్ద గల పార్క్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉప్పలమ్మ దేవాలయం వద్ద బస్తీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, జోనల్ కమిషనర్ రవి కిరణ్, డీసీ ముకుందారెడ్డి, తహశీల్దార్ శైలజ, వాటర్ వర్క్స్ సీజీఎం ప్రభు, గాంధీ నగర్ సీఐ మోహన్ రావు, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ , ఎలక్ట్రికల్ ఏడీ మోహన్, స్ట్రీట్ లైట్ ఏఈ భరత్, హార్టికల్చర్ అధికారి గణేష్, పద్మారావు నగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, బన్సీలాల్ పేట డివిజన్ అధక్షుడు వెంకటేష్ రాజు, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ప్రేమ్, మహేష్, కుమార్ యాదవ్, రమణ, అబ్బాస్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

డివిజన్‌ను సుందరంగా తీర్చిదిద్దుతా..

- కార్పొరేటర్ పల్లపు రవి



నవతెలంగాణ-జవహర్‌నగర్

6వ డివిజన్‌ను సుందరంగా తీర్చిదిద్దుతానని ఆరో డివిజన్ కార్పొరేటర్ పల్లపు రవి అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ లోని 6వ డివిజన్ లో రూ. 10లక్షలతో భూగర్భ డ్రయినేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగ కార్పొరేటర్ పల్లపు రవి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే జవహర్ నగర్ అభివృద్ధి చెందుతుందన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో కార్పొరేషన్‌ను కనీవిని ఎరగనిరీతిలో అభివృద్ధి చేస్తుమన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో. మాజీ వార్డ్ సభ్యురాలు పల్లపు ఉపేంద్ర, ప్రశాంత్, కళావతి, అనిత, జయమ్మ పున్నమ్మ రవీందర్ గౌడ్, చందు, లక్ష్మన్, మహేష్, మురళీ కాలనీవాసులున్నారు.

యువతను చైతన్యం చేసేందుకే కేఫ్ పాలిటిక్స్



నవతెలంగాణ -కంటోన్మెంట్

యువతను చైతన్యం చేసేందుకే కేఫ్ పాలిటిక్స్ చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఖనిజ సంపద అభివృద్ధి సంస్థ చైర్మెన్ క్రిశాంక్ అన్నారు. డైమండ్ పాయింట్‌లోని మస్తాన్ హొటల్ 6 కేఫ్ పాలి టిక్స్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. యువతలో రాజకీయ చైతన్యం పెంపొందించడం కోసం కేఫ్ పాలిటిక్స్ కార్యక్రమం నిర్వహిం చామని తెలిపారు. స్థానిక సమస్యలు, రాజకీయాలు, బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలపై చర్చించామని క్రిశాంక్ తెలిపారు. ఐటీ మంత్రి కేటీఆర్ నేతృత్వంలో అనేక బహుళజాతి కంపెనీలు కోట్లాది రూపాయల పెట్టుబడులు పెడుతున్నాయని చెప్పారు. దీంతో యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగం రావాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమని వెల్లడించారు. కార్యక్రమంలో భాస్కర్, వెంకట్ రాములు, రాకేష్, వంశీ, రిషికేశ్, సంజీవ్, కనక సుందర్, సందీప్, అంజి ఉన్నారు.

భరత్‌నగర్‌లో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం



నవతెలంగాణ- కాప్రా

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని భరత్ నగర్‌లో నిర్వహించిన "స్వచ్ఛత పక్వాడ" కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛత పాటిస్తేనే ఎలాంటి రోగాలు ధరిచేరవని అన్నారు. కార్యక్రమంలో హెచ్ పీసీఎల్ మేనేజర్ ఉదయ్ కృష్ణ ,సేఫ్టీ ఆఫీసర్ పృథ్వీ రాజు, సిబ్బంది బాలయ్యగౌడ్, శ్యామ్‌కుమార్, శ్రీశైలం, సత్య నారాయణ, పవన్‌కుమార్, కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జాండ్ల సత్తిరెడ్డి, కనకరాజుగౌడ్, బత్తుల శ్రీకాంత్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, నారెడ్డి రాజేశ్వర్ రెడ్డి, రామకృష్ణ సాయిబాబా గౌడ్, చింతం నర్సింహా, చెన్నయ్య గౌడ్, ప్రభుగౌడ్, ధనుంజయ్ గౌడ్, గణేష్ గౌడ్ రమేష్, గౌడ్, కుమార స్వామి,సోమయ్య,భాను చందర్, ఎస్ రాజు, త్రిపాల్, రాజు పెద్దపల్లి, ఇస్లావత్ శ్రీను,ఎలయ్య, చర్లపల్లి రామకృష్ణ, సదానంద్ తదితరులు ఉన్నారు.

ప్రయివేట్ కళాశాలల ఫీజు దోపిడి అరికట్టాలి

- టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిశివానంద్



నవతెలంగాణ-కాప్రా

మేడ్చల్ జిల్లాలోని అధిక ఫీజు వసూల్ చేస్తున్న ప్రయివేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివానంద్ అన్నారు. శుక్రవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలోని అనేక ప్రయివేట్ జూనియర్ కళాశాలలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని చెప్పారు. పాఠ్యపుస్తకాలు ఇతర సామాగ్రిని కళాశాలలోనే అమ్ముతున్నారని వాపోయారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో అన్ని ప్రయివేట్ కళాశాలల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోందన్నారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌రాక తీవ్ర అవస్థలు పడుతుంటే ప్రయివేట్ యాజమన్యాలు దోపీడీ చేస్తున్నాయని వాపోయారు. రాష్ట్రంలో ఇంత దోపీడి జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మరేనినట్టు ఉందని మండిపడ్డారు. సమస్యలను పరిష్కరించకుంటే విద్యార్థులతో కలిసి టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రంలో సామాజిక తెలంగాణే ధ్యేయం

- బీసీ ముఖ్యమంత్రే నినాదం
- ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగం కల్పన
- తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ అధినేత పుంజాల వినయ్ కుమార్



నవతెలంగాణ-కంటోన్మెంట్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత మరో రాజకీయ పార్టీ అవతరించింది. సికింద్రాబాద్‌లోని సిఖ్ విలేజ్‌లోని శ్రీ రాజరాజేశ్వరి గార్డెన్‌లో మాజీ కేంద్ర మంత్రివర్యులు స్వర్గీయ పుంజాల శివశంకర్ తనయుడు పుంజాల వినయ్‌కుమార్ శుక్రవారం తెలంగాణ సమాజ్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీని ముఖ్యమంత్రిని చేయటమే పార్టీ ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామన్నారు. రాజ్యాధికారంలో మహిళలను భాగస్వాములను చేస్తామని తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పార్టీ పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. చట్ట సభలలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఎక్కువ సీట్లు కేటాయించి వారి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఆత్మ బలిదానం చేసుకున్న తొలి, మలి దశ ఉద్యమకారుల సంక్షేమ కోసం తెలంగాణ సమాజ్ కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం పక్కన పెట్టిందని వాపోయారు. దళితులను ముఖ్యమంత్రిని చేస్తానని కేసీఆర్ మాట తప్పిందని విమర్శించారు. రైతుల భూములు గుంజుకొని హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తున్నారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలను కాపాడుకునే బాధ్యతను తెలంగాణ సమాజ్ కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో వసతులు కల్పించి అందరికీ మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. అంతకముందు బీసీని ముఖ్యమంత్రి చేయాలని చంద్రశేఖర్ రెడ్డి, విద్యార్థి సంఘం నాయకుడు గౌతం, లక్పతి భూక్యా నాయక్, నరహరి తదితరులు తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమానికి డి.నరహరి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డి.నరహరి, జి.గంగాధర్, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, ఎ.నవీన్ కుమార్, ఎం.వేణు, ఓరుగంటి వెంకటేశ్వర్లు, కె.గౌతమ్, అనికేత్, రామారావు మెట్టు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి'

- ప్లకార్డులతో కాలనీవాసుల నిరసన



నవతెలంగాణ-జవహర్‌నగర్

రాజీవ్ గాంధీనగర్‌లో భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని జవహర్‌నగర్ ప్రధాన రహదారిపై బస్తీవాసులు ఆందోళన చేశారు. కాంగ్రెస్ నాయకుల భూకబ్జాలకు అంతులేకుండా పోతుందని గాంధీనగర్ కాలనీవాసులు శుక్రవారం కార్పొరేషన్ ప్రధాన రహదారిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలోని కమ్యూనిటీహాల్, దేవాలయానికి కేటాయించిన సుమారు 750గజాల స్థలాలను కాంగ్రెస్ నాయకులు వదలడం లేదని వాపోయారు. అధికారులు వారిపై కఠిన చర్యలు తీసుకోరారు. గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలను సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్న కాంగ్రెస్ నాయకుల ఆగడాలకు ముకుతాడు వేసి పేదల ప్రజలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినోద్, కుమార్, సత్తయ్య, అంజయ్య, రామయ్య విశాల్, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో బోనాల పండుగ



నవతెలంగాణ-కాప్రా

అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో బోనాల పండుగను శుక్రవారం ఉత్సాహంగా నిర్వహిచారు. తెలంగాణ సాంస్కృతిక, సంప్రదాయ భావాన్ని చాటారు. వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొని స్కూల్ ఆవరణను శోభాయానంగా అలంకరించారు. అనంతరం విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. సంప్రదాయ 'ఘతం', 'పోతరాజులు' పవిత్ర కుండలను మోస్తూ డప్పు చప్పుళ్లకు జానపద నృత్యాలను ప్రదర్శించారు. తెలంగాణ జానపద నృత్య రూపాలతో సహా సాంస్కృతిక ప్రదర్శనలలో విద్యార్థులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. అక్షర ఇంటర్నేషనల్ స్కూల్స్ ప్రిన్సిపాల్ రితిక పాఠశాల ఆవరణలో బోనాలు వేడుకలు నిర్వహించడంతో హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆచార సంప్రదాయలు, విలువలపై అవగాహనతో ఉండాలన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ వీరత్వానికి ప్రతీక

- మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ -నేరేడ్‌మెట్

సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ వీరత్వానికి ప్రతీక అని మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఓల్డ్ ఆల్వాల్ ఇందిరాగాంధీ దగ్గర నేమూరి గణేష్‌గౌడ్ జ్ఞాపకార్థం ఆయన తనయుడు నేమూరి సాయిరాంగౌడ్, అల్వాల్ గౌడ సంఘ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్‌గౌడ్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం సర్వాయి పాపన్న జయంతి, వర్థంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. పాపన్న గౌడ్ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకో వాలన్నారు. బహుజన రాజ్యం కోసం గోల్కొండ కోటను అదిరో హించి సింహాసనాన్ని వశపరుచుకున్న బలహీన వర్గాల నాయకు డు సర్దార్ సర్వాయి పాపన్న అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్వామి గౌడ్, పల్లె రవికుమార్ గౌడ్, కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, రాజ్‌జితేంద్ర నాథ్, సబితా అనిల్ కిషోర్, శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంకు చెందిన 39 మంది సీఎం రిలీఫ్ ఫండ్ పథకం లబ్దిదారులకు రూ.21 లక్షల విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించి శుక్రవారం చింతల్‌లోని తన కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నిరుపేదల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు. పేదలకు కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా సహాయం అందిస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

బాచుపల్లిలోని మదర్సాల కార్యక్రమంలో పాల్గొన్న మేయర్

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి 19వ డివిజన్ పరిధిలో బాచుపల్లి ప్రాంత గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మదర్సలా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీల గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీం ముస్లిం సోదరులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, స్థానిక డివిజన్ కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్, ఆగం రాజు ముదిరాజ్, బాలాజీ నాయక్, కో ఆప్షన్ సభ్యులు వాణి, ఎన్ఎంసీ, బీఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, సీనియర్ నాయకులు కోలన్ కృష్ణారెడ్డి, చంద్రగిరి సతీష్, బాచుపల్లి గ్రామ పెద్దలు, ముస్లిం మత పెద్దలు, ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

'మన ఊరు-మన బడి' పనులను పూర్తి చేయాలి

- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్



నవతెలంగాణ-సిటీబ్యూరో

'మన ఊరు-మన బడి' పనులను త్వరగా పూర్తి చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్ది విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. శామీర్‌పేటలోని జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యతో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయకుమారి, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో శుక్రవారం 'మన ఊరు-మన బడి' కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 176 పాఠశాలల్లో పనులు చేపట్టగా.. 30 పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి ప్రారంభోత్సవాలు జరిగాయనీ, మరో 20 పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాట్లతో ప్రారంభోత్సవానికి సిద్దంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో మిగిలిన పాఠశాలల పనులు ఆయా దశల్లో ఉన్నాయనీ, వాటిని త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. 'మన ఊరు-మన బడి' కార్యక్రమానికి నిధుల కొరత లేనందున పనులను సకాలంలో పూర్తి చేసి వినియోగంలోకి వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రతి పాఠశాలలో తరగతి గదులతోపాటు, పెయింటింగ్, వంట శాలలు (కిచెన్ షెడ్స్), మూత్రశాలలు, మరుగుదొడ్లు, టేబుళ్ళు, ఫ్యాన్లు, బ్లాక్ బోర్డులు, విద్యుత్తు సౌకర్యం, నీటి వసతితో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పనులు సకాలంలో పూర్తి కావడంతోపాటు ఎలాంటి లోటుపాట్లు లేకుండా జరుగుతాయన్నారు. ఇందుకు అధి కారులు ముందస్తు కార్యాచరణ ప్రకారం సమన్వయం చేసుకుని పాఠశాలలను సందర్శించాలన్నారు. అనంతరం డివిజన్లవారీగా పాఠశాలల పనులు, తదితర వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంలో పలు అంశాలపై సలహాలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల పనులు పెండింగ్‌లో ఉండకుండా త్వరగా పూర్తి చేసి అన్ని అభివృద్ధిలో జిల్లా ముందు స్థానంలో నిలిచేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య జిల్లా విద్యా శాఖ అధికారిణి విజయకుమారి, రోడ్లు, భవనాలు, పంచాయతీ రాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- అవసరమైతే నిధులు మంజూరు చేస్తాం



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ కార్యాలయంలో, ట్రాన్స్ కో ఆపరేటర్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కూకట్‌పల్లి నియోజకవర్గానికి సంబంధించి విద్యుత్ శాఖ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా విద్యుత్తు లైన్‌లు ఎక్కడైతే పోల్స్ దెబ్బతిన్నాయో వాటిని పునరుద్ధరించే విధంగా అలాగే ట్రాన్స్ ఫార్మర్లు, వీధిలైట్లకు సంబంధించి చర్చించారు. ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారిని ఆదేశించారు. ఇప్పటికే అనేక చోట్ల కరెంటు స్తంభాలు, వీధిలైట్లకు సంబంధించి ఫిర్యాదులు ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అలాగే వాటికి సంబంధించి నిధుల కొరత ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. అంతేకాకుండా రాబోవు వర్షాకాలం దృష్ట్యా ఎక్కడైతే ట్రాన్స్ ఫార్మర్లకు ఉన్నాయో వాటికి వెంటనే భద్రత కల్పించి, పునరుద్ధరించాలన్నారు. చిన్న పిల్లలు అటు వైపు వెళ్ళకుండా తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని శ్రీనివాస్ రెడ్డికి తెలియచేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందిస్తూ సమస్యలు పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం డివిజన్ కార్పొరేటర్లు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధే నా ధ్యేయం



- మంత్రి చామకూర మల్లారెడ్డి

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్నానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మేడ్చల్ మండల పరిధిలోని ఎల్లంపేట్, సోమారం, సైదోనిగడ్డ తండా, రావల్ కోల్ గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగ గ్రామాలలో ఉన్న సమస్యలు తెలుసుకొని మంత్రి తన సొంత నిధులతో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు, కుల సంఘాల భవనలు, ఆలయాలు నిర్మాణానికి శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 3,7,8,11,22 వార్డులలో పర్యటించి రూ.4కోట్ల 59లక్షల నిధుల వ్యయంతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి మహేందర్ రెడ్డి, సర్పంచ్‌లు మహేందర్, మేకల వెన్నెల రామకృష్ణుడు, సుజాత కిషన్ నాయక్, వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత మల్లు రవికి జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ



నవతెలంగాణ-బాలానగర్

టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మాజీ పార్లమెంట్ సభ్యులు మల్కాజ్ గిరి పార్లమెంట్ ఇంఛార్జ్ డా. మల్లు రవి జన్మదినం సందర్భంగా వారిని పలువురు కలిసి శాలు వా కప్పి, పుష్ప గుచ్చాన్ని అందించి, జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, ఏ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము వేణు, కూకట్‌పల్లి నియోజకవర్గం ఐఎన్టీయూసీ అధ్యక్షులు నరసింహ యాదవ్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, అల్లాపూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ యాదవ్ పాల్గొన్నారు.



బాలానగర్: సీనియర్ ఉపాధ్యక్షులు, మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, నాగర్ కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యులు మల్లు రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగం ధర్ రెడ్డి, బాలానగర్ డివిజన్ మాజీ ఉపాధ్యక్షుడు ఆకుల నరేందర్, గద్వాల్ నియోజకవర్గ ఇంచార్జ్ కోడి నరేష్, ముదిరాజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి: టీపీసీసీ ఉపాధ్యక్షులు మాజీ పార్లమెంటు సభ్యులు మల్లు రవి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ పీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ స్టేట్ జెనరల్ సెక్రెటరీ సయీద్ మిస్బా, అనిల్ కుమార్, గణేష్ పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కేపి వివేకానంద్
- గాజులరామారం డివిజన్ ఇంద్రానగర్ -(ఏ, బి,)లలో పాదయాత్ర



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. శుక్రవారం గాజులరామారం డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్-ఏ, బి,లలో 'ప్రగతి యాత్ర'లో భాగంగా 89వ రోజు ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తూ పూర్తి చేసిన అభివృద్ధి పనులు పరిశీలించారు. కాగా మంచినీటి సమస్య, మిగిలిన సీసీ రోడ్లు, డ్రైనేజీ, కరెంటు కేబుల్ మార్చాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అక్కడే ఉన్న అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీజీఎం అప్పల నాయుడు, సీనియర్ నాయకులు రషీద్ బేగ్, పెద్ద బాల్ అంజన్ గౌడ్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, కమలాకర్, ఇబ్రహీం, మూసాఖాన్, పాల్గొన్నారు.

శోభన బస్టాప్ వద్ద బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ,డీవైఎఫ్ఐ, విద్యార్థి, యువజన సంఘాల నిరసన



నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ డివిజన్ పరిధిలోని శోభన బస్టాపు వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, శుక్రవారం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చైతన్య రెడ్డి మాట్లాడుతూ బాలానగర్ ప్రధాన రహదారి పై ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఫ్లైఓవర్ నిర్మాణం జరగడంతో రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో ఫతేనగర్, బాలానగర్ డివిజన్ ప్రజలకు మరో సమస్య తీవ్రతరమైంది. ఉద్యోగులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు వ్యయప్రయాసల కూర్చి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రోడ్డు దాటేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిదులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రమాదాలు జరగకుండా జోనల్ కమిషనర్, వెంటనే స్థానిక ప్రజా ప్రతినిధులైన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు స్పందించి, ప్రధానంగా విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బాలానగర్ ప్రధాన రహదారిపై శోభన బస్టాప్ ప్రాంతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా ప్రతినిధుల ఇంటిని, జోనల్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కూకట్‌పల్లి నియోజకవర్గం నాయకులు వంశీ, డివైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవోలను సవరించకపోతే అసెంబ్లీ ముట్టడిస్తాం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

73 షెడ్యూల్ పరిశ్రమంలో జీవోలను సవరించాలని కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించి అమలు చేయాలని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జీడిమెట్లలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అశోక్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి లింగస్వామి , జిల్లా కమిటీ సభ్యులు కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ, పెరిగే ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకి 26 వేల రూపాయలు ప్రభుత్వం నిర్ణయించి అమలు చేయాలని, 73 షెడ్యూల్ పరిశ్రమల్లో పెండింగ్‌లో ఉన్న జీవోలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వందల రేట్లు నిత్యవసర వస్తువుల ధరలు పెరిగాయి. కానీ జీతాలు పెరగడం లేదు. సంపద సృష్టించే కార్మికుడికి తిండికి కరువయ్యే రోజులు వస్తున్నాయి. అంతేకాదు పెరుగుతున్న శాస్త్ర సాంకేతికతను దృష్టిలో పెట్టుకొని రోజుకు 7 గం॥ పని దినాన్ని వారానికి ఐదు రోజుల పని దినాలను అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేస్తుంది. ఇప్పటికైనా రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుల స్థితిగతులను ప్రభుత్వం పరిశీలించి, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం.కార్మికులకు కనీస వేతనం ఇవ్వకుండా ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయకుండా బోనస్ ఇవ్వకుండా వీక్లీ ఆఫ్ ఇవ్వకుండా అనేక సంవత్సరాల నుంచి యాజమాన్యాలు వారిని మోసం చేస్తున్నాయి. 1979 అంతర్రాష్ట్ర కార్మికుల చట్టం ప్రకారం వారికి అన్ని చట్టబద్ధ సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే కాలంలో అసెంబ్లీని ముట్టడించి ప్రభుత్వాన్ని దించుతామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దేవదానం, కరుణాకర్ మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఎంపిక జరగాలి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్దిదారులు ఎంపికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎవరైతే నిరుపేదలు ఉన్నారో వారిని సరైన రీతిలో గుర్తించాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా ఇదివరకే ఇల్లు ఉండి తిరిగి మంజూరు చేసుకున్న వారినీ గుర్తించి వారి దరఖాస్తు తొలగించాలని ఆదేశించారు. అంతేకాకుండా ఎవరైనా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసిన, అధికారులు కూడా ఎక్కడైనా తప్పిదం చేసినా కూడా కఠిన చర్యలు తీసుకుంటామని, అందుకు వెనుకాడబోమని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఎవరు ఒక్క రూపాయి కూడా దయచేసి ఎవ్వరికీ ఇవ్వద్దని తెలియజేశారు. డివిజన్ వారీగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో మొత్తం 34 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. నేటి నుంచే ప్రతి డివిజన్‌లో లబ్దిదారులు ఎంపిక జరగబోతుందని, అతి త్వరలోనే ఎంపిక చేసిన లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీలు రవికుమార్, రవీంద్ర కుమార్, ఎంఆర్‌ఓ గోవర్ధన్, సీఓలు పాల్గొన్నారు.

ఆలయాలకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కూకట్‌పల్లి



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బోనాల పండుగ సందర్భంగా ఆలయ కమిటీలకు చెక్కులను పంపిణీ చేశారు. తన క్యాంప్ కార్యాలయంలో బోనాల పండుగ పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని, అమ్మవారి దేవాలయాలకు సంబంధించి 104 చెక్కులు మొత్తం, రూ.33 లక్షల 65 వేలు ఆయా దేవాలయాలకు సంబంధించిన కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని కులాలు, మతాలు వారికి సమ ప్రాధాన్యతనిస్తూ, వారి వారి ఆచార సంప్రదాయాల ప్రకారం వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నారని అన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా బోనాలు, బతుకమ్మ పండుగలు ఇంత విస్తృతం అవ్వడానికి కారణం ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత మాత్రమే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్, మూసాపేట్ డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, జేఈఓ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'బాల బోనాలు' సంబరాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

కూకట్‌పల్లిలో భారత్ వికాస్ భవన్‌లో శ్రీరంగం ఫౌండేషన్, శ్రీసాయి అలేఖ్య సంఘ సేవ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అరుణ అశోక్ అధ్యక్షతన 'బాల బోనాలు' సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతిలో అత్యున్నత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కాళోజీ 'ప్రతిభ పురస్కారాలు-2023' ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణ, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీరంగం ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ సత్యం శ్రీరంగం హజరయ్యారు.

సాధన హై స్కూల్‌లో ఇన్వెస్టిచర్ వేడుక



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారం 129 డివిజన్‌లో గల సాధన హై స్కూల్‌లో అకాడమిక్ సెషన్ 2023-2024 కోసం ఇన్వెస్టిచర్ వేడుక చాలా వైభవంగా, గౌరవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ జి. ప్రవీణ్ రెడ్డి అధ్యక్షత వహించారు. ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ప్రజల ఓట్ల ద్వారా నాయకులను ఎన్నుకునే మాదిరిగా పాఠశాలలో కూడా విద్యార్థులందరి ఓట్ల ద్వారా క్యాబినెట్ మెంబర్స్‌ను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులు కాబట్టి సమాజంలో బాధ్యతల్ని గుర్తించే విధంగా ఆ నాయకత్వ లక్షణాలు పాఠశాల నుండే అలవడాలని ఆకాంక్షిస్తూ వారిని ఎన్నుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు విచ్చేసిన గోనె హనుమంత్ రెడ్డి, కోల వెంకటేష్ మాట్లాడుతూ... విద్యార్థులు చిన్నప్పటి నుంచే కష్టపడే తత్వం అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని అప్పుడే వారు మంచి ఉన్నత స్థానంలో ఉంటారని, మంచి క్రమశిక్షణతోనే మంచి విద్య సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ జి.కవితా రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్‌ని చింతల్‌లోని తన కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ జిల్లాలోని పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన నిరసన దీక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు గ్రామాల్లో ఉన్న చెత్తా, చెదారాన్ని శుభ్రం చేస్తూ తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం కోసం చేస్తున్నారని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులు గత అనేక సంవత్సరాలుగా జీతాలు సరిపోక అన్నమో రామచంద్రా అని అడుక్కుతినే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు కూడా వీరిని మోసం చేస్తూ వేయి రూపాయలు పెంచుతున్నట్టుగా ప్రకటన చేసి నేటికీ డబ్బులు చెల్లించలేదన్నారు. గ్రామాలలో 30 ఏళ్ల పనిచేసిన నేటికీ వారి జీతం నెలకు 8వేలు నుండి 9 వేలు గానే ఉన్నాయని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి లేకపోతే వీరి కోపాన్ని చెవి చూడవలసి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం దొడ్డిదారిలో సమ్మెను అణిచివేయాలని కుట్ర చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూని యన్ నాయకులు సుధాకర్,రామచందర్, లీలమ్మ, గణేష్, నరేష్, ప్రమీల, శంకర్, నరసింహ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ నుంచి బద్రీనాథ్ ఆలయానికి బస్సు సర్వీస్‌లు

నవతెలంగాణ- మేడ్చల్



మేడ్చల్ నుండి బద్రీనాథ్ ఆలయం (బండ మైలారం)కి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు మేడ్చల్ డిపో మేనేజర్ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శనివారం, ఆదివారం మేడ్చల్ నుండి మొదటి బస్సు ఉదయం 7గంటలకు, చివరి బస్ సాయంత్రం 6-55 ని॥ ఉంటుందని తెలిపారు. అలాగే బద్రీనాథ్ టెంపుల్ నుండి మేడ్చల్‌కు మొదటి బస్సు ఉదయం 7:25 ని॥ చివరి బస్సు సాయంత్రం 7:20 ఉంటుందని వివరించారు. ప్రతి 50 నిమిషాలకు ఒక బస్సు ఉంటుందని బస్ ఛార్జ్ కేవలం 30 రూపాయలు ఉంటుందని డిపో మేనేజర్ సుధాకర్ తెలిజేశారు.

ధరలను నియంత్రించడంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు విఫలం



- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి
- మార్కెట్‌లో కూరగాయలతో నిరసన

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నిత్యావసర సరుకులతోపాటు, కూరగాయల ధరలను నియంత్రించడంతో బీజేపీ, బీఆర్ఎస్, విఫలమయ్యాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి విమర్శించారు. నిత్యవసర సరుకుల ధరలతోపాటు టమాట, మిర్చి, వివిధ రకాల కూరగాయల ధరల పెరుగుదలను నిరసిస్తూ శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్, జగద్గిరిగుట్ట జగదాంబ కూరగాయల మార్కెట్లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కూరగాయల దండలతో "వినూత్న నిరసన" చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన మిర్చి, టమాటా, అల్లం వెల్లుల్లి లాంటి నిత్యవసర సరుకుల ధరల ఒక్కసారిగా పెరగడంతో పేద, సామాన్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని ప్రజలు పూర్తిస్థాయిలో విశ్వసిస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో నిత్యవసర వస్తువుల ధరలను రాష్ట్ర ప్రభుత్వం అదుపు చేయకపోతే ఇలాంటి నిరసన కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ తరపున మరింత ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు లాల్ మహమ్మద్, బేకరిగడ్డ ప్రెసిడెంట్ గఫర్ సూరారం డివిజన్ కాంగ్రెస్ నాయకులు మండవ శివకుమార్, శ్రీ ఎస్‌పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు దండే రాజు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేట్‌లోని శ్రీబంగారు మైస మ్మ అమ్మవారిని ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆలయ అభివృద్ధి కోసం చర్చించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలి

- కార్పొరేటర్ రావుల శేషగిరి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ రాష్ట్ర ప్రజలు అత్యంత ఇష్టపూర్వకంగా జరుపుకునే బోనాల ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుపు కోవాలని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు గాజుల రామారం డివిజన్ రావులశేషగిరి అన్నారు. ఆషాడ మాస బోనాల వేడుకల్లో భాగంగా శుక్రవారం గాజుల రామారం డివిజన్ చంద్రగిరి నగర్‌లో బోనాల సందర్భంగా నల్ల పోచమ్మ రేణుకఎల్లమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకరి సాయి ప్రతాప్ ముదిరాజ్, చందు ముదిరాజ్, సంఘ సేవకులు రావుల రాజు తదితరులు పాల్గొన్నారు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కొంపల్లిలో నిర్వహించిన దుర్గామాత అమ్మవారి కళ్యాణ మహోత్సవం, పోచమ్మ ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో శుక్రవారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

రివాల్వర్‌తో సంచరిస్తున్న నిందితుడి అరెస్టు

నవతెలంగాణ-కాప్రా

రివాల్వర్‌తో సంచరిస్తున్న నిందితుడిని మల్కాజ్‌గిరి ఎస్‌వోటీ, చర్లపల్లి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రివాల్వర్, మూడు రౌండ్స్, కారుతోపాటు రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మల్కాజ్‌గిరి డీసీపీ జానకి తెలిపిన వివరాల మేరకు మధ్యప్రదేశ్‌కు చెందిన యోగేందర్ రాజపుత్, షేక్ షరీఫ్‌లు చెర్లపల్లిలో సెక్యూరిటీ ఏజెన్సీని కొనసాగిస్తున్నారు. వ్యాపారంలో తేడాలు రావడం, రూ.3లక్షల విషయంలో ఇద్దరు గొడవపడ్డారు. దాంతో యోగేందర్ కక్ష పెంచుకుని షరీఫ్‌ను హత్యచేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో మధ్యప్రదేశ్‌కు చెందిన లాలా శర్మను కలిసిన యోగేందర్ అతని వద్ద రివాల్వర్ కొనుగోలు చేశాడు. రివాల్వర్‌తో సంచరిస్తున్నట్టు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు యోగేందర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా స్నేహ

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో బదిలీల పరంపర కొనసాగుతోంది. ఈ క్రమంలో శుక్రవారం తెలంగాణలో 31మంది ఐఏఎస్‌లకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా ఎస్.స్నేహ శబారిష్‌ను నియమించారు.

యువకుడు అరెస్ట్

నవతెలంగాణ-హాయత్ నగర్

హత్యాయత్నం కేసులో యువకుడు అరెస్ట్ అయిన ఘటన ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగోల్ సాయి నగర్ కాలనీ కి చెందిన రవితేజ అనే యువకుడు ఈనెల 9న అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని తారామతి పేట గ్రామం నుంచి తన ద్వి చక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో కారును ఢీ కొని కొని చాకుతో ఓ వ్యక్తిపై పలు చోట్ల దాడి చేశాడు. అతనికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. రవితేజ పై హత్యా యత్నం కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్ కు తరలించారు.



నకిలీ డాక్టర్ అరెస్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నకిలీ డాక్టర్‌తోపాటు నకిలీ పత్రాలు తయారు చేస్తున్న మరో నిందితుడిని సౌత్, ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుని నుంచి నకిలీ బీడీఎస్ పట్టాతోపాటు తదితర నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం డీసీపీ రాధాకిషన్ రావు తెలిపిన వివరాల ప్రకారం ఫలక్‌నుమాకు చెందిన ఖాజా ముజమ్మిల్ ఉద్దీన్ ఇంటర్ ఫేయిల్ అయ్యాడు. మాసబ్ ట్యాంక్‌లోని 'మిస్వాక్ డెంటల్ ఆస్పత్రిలో' అసిస్టెంట్‌గా చేరాడు. 2016 నుంచి 2020 వరకు పనిచేసిన నిందితుడు కర్నాటకా నుంచి బీడీఎస్ (డెంటల్ డాక్టర్‌గా) డాక్టర్‌గా నకిలీ పట్టాను పొందాడు. అందుకు అతని స్నేహితుడు సయ్యద్ అబ్దుల్ అస్లాం సహాయాన్ని తీసుకున్నాడు. సులువుగా డబ్బులు సంపాదించాలని డాక్టర్ పట్టాతోపాటు జీహెచ్‌ఎంసీ, కార్మిక శాఖ జారీ చేసినట్టు ట్రేడ్ లైసెన్స్, తదితర పత్రాలను సయ్యద్ అబ్దుల్ సహాయంతో నకిలీ చేశాడు. శాలిబండాలో 'ఆక్సిజన్ డెంటల్ క్లీనిక్'లో డాక్టర్‌గా చెలామణి అవుతూ చికిత్స చేస్తున్నాడు. అయితే అనుమానం వచ్చిన కొందరు పేషెంట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందించారు. డీసీపీ రాధాకిషన్ రావు ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్ నాయక్ ప్రత్యేక నిఘా వేశారు. తన బృందంతో కలిసి నకిలీ డాక్టర్‌తోపాటు అతనికి సహకరించిన నిందితున్ని అరెస్టు చేశారు.



ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి

- నగర కమిషనర్ సీవీ ఆనంద్

నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ స్టేషన్లను కూడా అధునాతనంగా నిర్మించడం జరిగిందని సీపీ సివి ఆనంద్ తెలిపారు. శుక్రవారం కాచిగూడ లో గత రెండు సంవత్సరాల క్రితం అధునాతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌లో లిఫ్టును సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్‌లన్ని కూడా మూడు నాలుగు ఫ్లోర్లతో డిజైన్ చేయబడుతున్నాయన్నారు. సిబ్బందికి, వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే పోలీస్ స్టేషన్‌లో లిఫ్టులను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. కాచిగూడ పోలీస్ స్టేషన్‌కు శ్యాం బాబా మందిర్ నిర్వాహకులు ఈ లిఫ్టును డొనేట్ చేశారని, అలాగే కొంతమంది దాతలు సహకారంతో అన్ని పోలీస్ స్టేషన్లకు కూడా లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ సునీల్ దత్, ఏసీపి ఆకుల శ్రీనివాస్, సీఐ లక్ష్మణ్ రాజు, ఎస్సైలు శ్యాంబాబా ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



టీఎస్ఆర్టీసీ సంస్థ పరిరక్షణ కార్మికుల దీర్ఘకాల ఉద్యోగ భద్రత ముఖ్యం

- టీఎస్ఆర్టీసీ మెజార్టీ యూనియన్ల జేఏసీ కార్మిక భరోసా యాత్ర

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

టీఎస్ఆర్టీసీ మెజారిటీ యూనియన్ల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం "కార్మిక భరోసా యాత్ర"లో భాగంగా ఎంజీబీఎస్ కు వచ్చే రాష్ట్రవ్యాప్త కార్మికులకు మేమున్నామన్న భరోసాను కల్పిస్తూ ఆర్టీసీ కార్మికులకు కరపత్రం ఇచ్చి కార్మికుల సమస్యల పరిష్కారానికై జేఏసీ నాయకులు కార్మికులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా టీఎస్ఆర్టీసీ మెజార్టీ యూనియన్ల జేఏసీ చైర్మెన్ ఇ అశ్వత్థామ రెడ్డి, కన్వీనర్ కే హనుమంతు ముదిరాజ్ లు మాట్లాడుతూ.. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం మాస్టర్ పే స్కేల్స్ అములుపరుస్తూ పెండింగ్ లో ఉన్న పీఆర్సిలు 2017, 2021 ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు 2021 ఫిబ్రవరి విడుదల చేసిన ఉద్యోగ భద్రత గైడ్‌లైన్స్ రద్దుచేసి సెక్షన్ 112 ఏ (1) మోటార్ వెహికల్ యాక్ట్ 1939 ప్రకారం టికెట్ తీసుకునే బాధ్యత పూర్తిగా ప్రయాణికుడిగా నిర్ణయిస్తూ సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. బస్సులపై పనిచేస్తున్న డ్రైవర్లను సంస్థ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం 2023 జనవరి డీఏ చెల్లిస్తూ మొత్తం ఎనిమిది డీఏలకు సంబంధించిన అరియర్స్ కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ కండక్టర్లపై మోపిన పని భారాన్ని తగ్గించి ఎనిమిది గంటల పని దినాన్ని వెంటనే పునరుద్ధ రించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జీవో లేబర్ యాక్ట్ ప్రకారం ఒకరోజులో ఎనిమిది గంటలు దాటిన పనికి డబుల్ వేజ్ చెల్లించాలన్నారు. చట్ట వ్యతిరేకంగా నిలిపివేసిన మెజార్టీ యూనియన్ ఎన్నికలను వెంటనే నిర్వహించే యూనియన్ కార్యకలాపాలను పునరుద్ధరించాలి అన్నారు. ఆర్టీసీని ప్రజా రవాణా సేవా సంస్థగా గుర్తించి తమిళనాడు ప్రభుత్వ తరహాలో డీజిల్ కొనుగోలు పై టాక్స్ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి అన్నారు. ప్రభుత్వం నాంస్ ప్రకారం అన్ని విభాగాల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేసి ప్రమోషన్లు కల్పించాలన్నారు. అన్ని కేటగిరీలతోపాటు గ్యారేజీ లో అవుట్సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి రెగ్యులర్ ప్రతిపాదికన రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లకు అనుగుణంగా రిక్రూట్మెంట్ చేయాలన్నారు. పక్క రాష్ట్రంలో లాగా టి.ఎస్.ఆర్.టి.సి ని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సంస్థ పరిరక్షణకు. ఉద్యోగుల దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ యూనియన్లకు అతీతంగా కార్యాచరణ రూపొందించి ముందుకు వెళుతుందన్నారు. ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలపై వెంటనే స్పందించాలని లేకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ సమావేశంలో జేఏసీ కో -కన్వీనర్లు ఎం నరేందర్. పున్న హరికిషన్. సుద్దాల సురేష్. ఎర్ర స్వామి కుమార్. జి అబ్రహం. బి యాదగిరి. కామ్రేడ్ సత్యం. ఆర్టిసి కార్మికులు తదితరులు పాల్గొన్నారు

హైదరాబాద్ ఇన్‌చార్జి డీఆర్వో సూర్యలత బదిలి

నవతెలంగాణ -సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారిగా, సీఈఎం విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ కె.సూర్యలత బదిలీ అయ్యారు. ఆమెకు గిరిజన సంక్షేమ గురుకుల సొసైటీ ఓఎస్‌డీగా పోస్టింగ్ లభించింది. యూఎల్‌సీ ఏసీజీడీసీగా విధులు నిర్వహిస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్‌రెడ్డి సూర్యాపేట అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బదిలీ అయ్యారు. ఇద్దరి స్థానంలో ఇంకా ఎవరికి పోస్టింగ్ ఇవ్వలేదు.

కియా ఎస్‌యూవీ విడుదల



నవతెలంగాణ-సిటీబ్యూరో

కియా ఎస్‌యూవీ శుక్రవారం మార్కెట్‌లోకి విడుదల చేసింది. సెల్టోస్ 2.0 పేరుతో విడుదలైన ఈ కొత్త కారును కియా షోరూం నిర్వాహకులు వారి జూబ్లీహిల్స్, గచ్చిబౌలిలోని బ్రాంచ్‌లలో ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ హెడ్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సెంథిల్ రాజప్ప హాజరై జూబ్లీహిల్స్ బ్రాంచ్‌లో ఈ కారును ఆవిష్కరించగా, గచ్చిబౌలి బ్రాంచిలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మంజుల అనగాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్ కియా షోరూం నిర్వాహకులు ప్రీతం రెడ్డి మాట్లాడుతూ కొత్త సెల్టోస్ కోసం బుకింగ్‌లు జూబ్లీహిల్స్ లేదా గచ్చిబౌలిలో, ఆన్‌లైన్‌లో కియా ఇండియా వెబ్‌సైట్ www.Kia.comలో చేయవచ్చని తెలిపారు.

ఆర్తులకు చేయూత సీఎంఆర్‌ఎఫ్

- డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

అనారోగ్యం బారిన పడి వైద్యం చేయించుకోలేని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు చేస్తుందని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. తార్నాకలోని తమ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను తార్నాక డివిజన్ కు చెందిన లబ్ధిదారులు ఠాకూర్ మహేందర్ సింగ్, శివ కి లకు బీఆర్‌ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద మనసుతో రాష్ట్ర ప్రజలకు తానున్నానని భరోసా కల్పిస్తూ వారికి వైద్య పరంగా ఎటువంటి ఇబ్బందులు రాకుండా సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేస్తూ వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు.

73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు చెల్లించాలి

- కాంట్రాక్ట్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్
- కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా



నవతెలంగాణ-అడిక్‌మెట్

73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో రూ. 26 వేల కనీస వేతనాలు చెల్లించి కాంట్రాక్ట్ కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, సెలవులు, బోనస్‌గా డ్యూటీ అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్ భూపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్, సిటీ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు అజయ్ బాబు అధ్యక్షతన చిక్కడపల్లి అంజయ్య భవన్ కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కమిషనర్ ఆఫ్ లెబర్.. గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో 75 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ యూనిట్స్ లో ఒక కోటి 20 లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. వీరిలో స్కిల్డ్ వర్కర్లు ఉన్నారని, వీరు రోజుకి 8 గంటలు పని చేస్తే నెల బేసిక్ ప్లస్సు వీడీయే కలిపి కనీస వేతనం ఇవ్వాలని, 12 గంటలు పని చేస్తే పవర్ టైం డబుల్ వేతనం ఇవ్వాలని కోరారు. నెలకు 7000 లేదా కనీస వేతనం ఏది ఎక్కువ అయితే అది వార్షిక బోనస్ ఇవ్వాలన్నారు. కానీ ఇవన్నీ రాష్ట్రంలో ఎక్కడా అమలు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతీ ఐదేండ్లకోసారి కనీస వేతన జీవోలు సవరించి పెంచాల్సి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం వేతనాల జీవోలను ఇప్పటివరకు సవరించలేదని మండిపడ్డారు. 2021 జూన్‌లో ఐదు రంగాలకు కనీస వేతనం రూ.18000 నిర్ణయించి ఉన్నతాధి కారులు ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చారని కానీ యాజమాన్యాల ఒత్తిడికి గెజిట్ చేయకుండా ముఖ్యమంత్రి కార్యాలయం అడ్డుకున్నదని ఆరోపించారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ఈ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ కనీస వేతనాల జీవోలను సవరించి వేతనాలు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడుసార్లు కనీస వేతన సలహా మండలి ఏర్పాటు చేసినా మండలి సిఫార్సులు మాత్రం అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో వలస కార్మికులకు ఎటువంటి హక్కులు లేవుని, రోజుకు 12 గంటలపైన పనులు చేస్తున్నారని కనీసం వేతనాలు చెల్లించడం లేదని తెలిపారు. తక్షణం వలస కార్మికులతో పాటు అన్ని రకాల కార్మికులకు కనీస వేతనం, సెలవులు, బోనస్ గ్రాట్యుటీ వంటివి అమలు చేయాలన్నారు.

సీఐటీయూ హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం వెంకటేష్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ పరిధిలో ఉన్న అనేక యూనిట్స్ లో హాస్పిటల్స్ నర్సింగ్ హోమ్స్ షాపింగ్ మాల్స్ కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్స్ లలో కార్మికులు పనిచేస్తున్నా ఇప్పటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. కార్మికుల శ్రమదోపిడి గురవుతున్నారని తక్షణం నగరంలోని అన్ని షెడ్యూల్ ఎంప్లాయి మెంట్స్‌లోనే ఎంప్లాయిమెంట్లలో కనీస వేతన జీవోలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నగర అధ్యక్షులు కుమార స్వామి మాట్లాడుత .కార్మిక శాఖ అధికారులు సనత్ నగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్లో ఇన్‌స్పెక్షన్ నిర్వహించి కార్మికులకు తక్షణ అపాయింట్మెంట్ ఆర్డర్స్, ఐడి కార్డ్స్ ఇచ్చేలా చేయాలని, కార్మిక చట్టాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర శ్రామిక మహిళా కన్వీనర్ వాణి నగర నాయకులు సి. మల్లేష్ ,ఆర్ అశోక్ ,ఎం సత్యనారాయణ, ఆర్ ఈశ్వర్ బాబు, పీ మల్లేష్ దామోదరరెడ్డి, డేవిడ్,కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో రెండు రోజులు నీటి సరఫరా బంద్

నవతెలంగాణ-సిటీబ్యూరో

లీకేజీల మరమ్మత్తుల కారణంగా నగరంలో పలు ప్రాంతాలల్లో రెండురోజులపాటు నీటి సరఫరా బంద్ అవనుంది. నగరానికి తాగునీరు సరఫరా చేసే గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజు-1లో భాగంగా పెద్దపల్లి జిల్లాలోని ముర్మూర్ నుంచి బొమ్మకల్ వరకు ఉన్న 3000 ఎం.ఎం డయా ఎం.ఎస్ పంపింగ్ మెయిన్ పైపులైనుకు 22.4 కి.మీ, 24.05 కి.మీల వద్ద ఏర్పడ్డ లీకేజీలు అరికట్టడానికి మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 19, బుధవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు 20న గురువారం సాయంత్రం 6 గంటల వరకు పనులు కొనసాగనున్నాయి. దాంతో 36 గంటల పాటు జలమండలి పలు డివిజన్ల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా, మరికొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా నీటి సరఫరాను నిలిపివేయనున్నారు. దాంతో వినియోదారులు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి ఎండీ దానకిషోర్ తెలిపారు.

పాక్షికంగా అంతరాయం ఏర్పడే ప్రాంతాలు

-ఓ అండ్ ఎం డివిజన్-6(ఎస్.ఆర్.నగర్): బోరబండ, వెంకటగిరి, బంజారాహిల్స్ రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలు, ఎర్రగడ్డ, అమీర్ పేట్, ఎల్లారెడ్డి గూడ, యూసుఫ్ గూడ. ఓ అండ్ ఎం డివిజన్-9(కూకట్ పల్లి): కేపీహెచ్ బీ, మలేషియన్ టౌన్ షిప్ రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు. ఓ అండ్ ఎం డివిజన్-15 (శేరిలింగంపల్లి): లింగంపల్లి నుంచి కొండాపూర్, గోపాల్ నగర్, మయూరి నగర్ రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు. ఓ అండ్ ఎం డివిజన్-23(నిజాంపేట్): ప్రగతినగర్‌లో కొన్ని ప్రాంతాలు, నిజాంపేట్/ బాచుపల్లి.

పూర్తిగా నీటి బంద్ ప్రాంతాలు

- ఓ అండ్ ఎం డివిజన్-9(కూకట్ పల్లి): ఎల్లమ్మ బండ, అల్వాల్ రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాలు. ఓ అండ్ ఎం డివిజన్-12(కుత్బుల్లాపూర్) : షాపూర్ నగర్, చింతల్, జీడిమెట్ల/ వాణి కెమికల్స్, జగద్గిరిగుట్ట, గాజుల రామారం, సూరారం, అల్వాల్ రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు. ఓ అండ్ ఎం డివిజన్- 13 (మల్కాజిగిరి/ అల్వాల్) :సైనిక్ పురి, డిఫెన్స్ కాలనీ, అల్వాల్ రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు.ఓ అండ్ ఎం డివిజన్-14(ఉప్పల్): కాప్రా మున్సిపాల్టీలోని కొన్ని ప్రాంతాలు. సాయిబాబా నగర్, రాధిక, మహేష్ నగర్, అవుట్ రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు. ఓ అండ్ ఎం డివిజన్-19(నాగారం/ దమ్మాయిగూడ) : నాగారం, దమ్మాయిగూడ, రాంపల్లి, కీసర, ఆర్జీకే ప్రాంతాలు. ఓ అండ్ ఎం డివిజన్-24(బొల్లారం): రింగ్ మెయిన్ - 3 ఆన్ లైన్ సప్లై. ఓ అండ్ ఎం డివిజన్-25(కొంపల్లి): కొంపల్లి, గౌండ్లపోచంపల్లి, తూంకుంట, జవహర్ నగర్, దేవరయాంజల్, హకీంపేట్ ప్రాంతాలు. ఆర్డబ్ల్యూఎస్ ఆఫ్ టేక్ ప్రాంతాలు: ప్రజ్ఞాపూర్ (గజ్వేల్), ఆలేరు (భువనగిరి) ఘన్ పూర్ (మేడ్చల్/ శామీర్ పేట్), కంటోన్మెంట్ లోని కొన్ని ప్రాంతాలు, ఎంఈఎస్, తుర్కపల్లి బయోటెక్ పార్కు.

త్వరలోనే నూతన డ్రయినేజీ, రోడ్లు నిర్మాణం

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

త్వరలోనే అంబర్ పేట డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో డ్రయినేజీ పనులు, నూతన సీసీ రోడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని నరేంద్రనగర్‌లో కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్, స్థానిక అధికారులతో ఎమ్మెల్యే కలిసి పర్యటించి పెండింగ్ లో ఉన్న పలు అభివద్ధి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరేంద్ర నగర్ లో ఇప్పటికే అనకేచోట్ల నూతన డ్రయినేజీ లైన్‌లు, సీసీ రోడ్లను ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే పెండింగ్‌లో ఉన్న పనులు, డ్రయినేజీ, నూతన సీసీ రోడ్లు, అలాగే స్థానిక బస్తి ప్రజలకు ఎటువం టి ఇబ్బంది కలగకుండా షీల్డ్ నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు.సంబంధిత జలమండలి అధికారులు జీఎం రామకష్ణ,డీజీఎం విష్ణువర్ధన్, ఏఈ యాదగిరి రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్,దుర్గ, బ్రహ్మచారి,బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఆమనూరి సతీష్,రాగుల ప్రవీణ్, మహేష్ ముదిరాజ్, లత,సురి, అజార్,సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఇతర అధికారులతో కలిసి అంబర్ పేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పర్యటించి అంబర్ పేటలో పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వీధి చివర్లలో ఉండే చెత్త కుండీలు, బస్తీల్లో ఉంటున్న డంపింగ్ యార్డ్‌లు నిత్యం ఖాళీ చేయించాలని, డ్రయినేజీ లైన్ల నిర్వహణ మెరుగ్గా చేయాలని, మురుగు నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని తెలిపారు. అదే విధంగా ప్రజలు కూడా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని, ఇంటిలోని చెత్తను సమీప నివాస ప్రాంతాల్లో వేయకుండా, జీహెచ్‌ఎంసీ నుంచి వచ్చే స్వచ్ఛ ఆటో లకే చెత్తను అందించాలని సూచించారు. అలాగే ఇటీవలే జీహెచ్‌ఎంసీ నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో రోనాల్డ్ రోస్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. జోనల్ కమిషనర్ రవి కిరణ్, ఏఎంహెచ్‌ఓ డా. జ్యోతి, డీఎంసీ వేణుగోపాల్, ఈఈ శ్రీ పేరిరాజు అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో



హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టిని ప్రభుత్వం నియమిం చింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వు లు జారీ చేశారు. గతేడాది కాలంగా ఇన్‌చార్జి కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అమోయ్ కుమార్‌ను బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తున్నట్టు ఆదేశాల్లో పేర్కొన్నారు. ఐఏఎస్ 2018 బ్యాచ్‌కు చెందిన అనుదీప్ దురిశెట్టి ప్రస్తుతం భద్రాది కొత్తగూడెం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా విధులు నిర్వహిస్తున్నారు.

బాలిక అదృశ్యం కేసును చేధించిన పోలీసులు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 13న 16 సంవత్సరాల జూనియర్ ఆర్టిస్ట్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ కేసును మధురానగర్ పోలీసులు చేధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రహమత్‌నగర్‌లో తన ఇద్దరు పిల్లలతో నివసిస్తూ, హౌస్ కీపింగ్ జాబ్ చేస్తున్న ఓ మహిళ చిన్న చిన్న సీరియళ్లలో నటిస్తోంది. ఆమె 16 ఏండ్ల కుమార్తె ఉష ఈనెల 13న ఇంటి నుండి తప్పిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమార్తెకు సమీపంలోనే నివసిస్తున్న ఒక అబ్బాయితో పరిచయాలు ఉన్నాయని, అది గమనించి ఇద్దరినీ మందలించానని, ఆ అబ్బాయి తోనే బయటకు వెళ్లి ఉంటుందని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న ఎస్సై నరేందర్ ఫోన్ నెంబర్ ఆధారంగా బాలికను యూసఫ్‌గూడలో గుర్తించి శుక్రవారం తల్లికి అప్ప చెప్పారు. బాలిక తల్లి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు, ఎస్ఐ నరేంద్రకు కృతజ్ఞతలు తెలిపింది. ఎస్ఐ నరేందర్‌ను సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అభినందించారు.



తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఎర్రగడ్డ డివిజన్‌లోని ప్రేమనగర్, ఆనంద నగర్, ఎర్రగడ్డ బస్తీలలో బోనాలు సందర్భంగా అమ్మవారి తొట్టెల ఊరేగింపులో జూబ్లీహిల్స్ నియోజకవర్గం సీనియర్ రాజకీయ నాయకుడు టీ హెూప్ స్వచ్ఛంద సంస్థ చైర్మెన్ కే ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు. అన్ని బస్తీలలోని దేవాలయాలలో స్థానిక ప్రజలతో కలిసి పాల్గొని, అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. అన్ని దేవాలయాల కమిటీ నిర్వాహకులు ఉపేందర్ రెడ్డిని ఆహ్వానించి శాలువాలు కప్పి సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. ఉపేందర్ రెడ్డి పూజారుల ఆశీర్వాదం తీసుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. త్వరలో పార్టీ పేరు ప్రకటిస్తానని అందరి ఆశీర్వాదం తనకు కావాలన్నారు. తాను ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటానని, నియోజకవర్గాన్ని అభివద్ధి చేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని బస్తీల నాయకులు, మహిళలు, యువకులు డ్యాన్సులు పాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బి.సి బిల్లు, మహిళా బిల్లు ప్రవేశ పెట్టాలి



నవతెలంగాణ-అడిక్ మెట్

పార్లమెంట్‌లో బి.సి బిల్లు మహిళ బిల్లు పెట్టి బి.సి. మహిళలకు సబ్ కోటా కల్పించాలని జాతీయ బి.సి మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు డా. అనుసూరి పద్మ లత డిమాండ్ చేశారు. ఈ నెల 24, 25వ తేదీలలో మహిళల రాజ్యాధికారం కోసం ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తునట్టు తెలిపారు. శుక్రవారం విద్యా నగర్ బీసీ భవన్‌లో మహిళల కోర్ కమిటీ సమావేశంలో చలో ఢిల్లీ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ మహిళా సంఘం జాతీయ అధ్యక్షులు డా. అనుసూరి పద్మ లత మాట్లాడుతూ మహిళ బిల్లులో బి.సి మహిళలకు ప్రాతినిధ్యం కల్పించ కపోతే మహిళ బిల్లుకు సార్థకత లేదన్నారు. ఇప్పటికే మహిళ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందిందని.. లోక్ సభలో కూడా పెట్టి పూర్తి చేయాలని కోరారు. మహిళా బిల్లు గురిం చి గొంతులు చించుకొని మాట్లాడే రాజకీయ పార్టీల నాయ కులు బి.సి మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యా యాల గురించి, లైంగికదాడుల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ మహిళ బిల్లులో రాజకీయ రిజర్వేషన్ల తో పాటు విద్యా ఉద్యోగాలలో కూడా 50 శాతం రిజర్వేషన్ల ను ప్రవేశపెట్టాలని కోరారు. రాజకీయ రిజర్వేషన్ల ను పెడితే 180 మంది మహిళలు పార్లమెంటులో సభ్యులవుతారు కాని ఉద్యోగాలలో రిజర్వేషన్లు పెడితే కేంద్ర ప్రభుత్వంలోని 54 లక్షల ఉద్యోగాలలో, 27 లక్షల ఉద్యోగాలు, 29 రాష్టలలో కలిపి ఒక కోటి 80 లక్షల ఉద్యోగాలలో 90 లక్షల ఉద్యోగాలు మహిళలకు దక్కుతాయని అన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు రికట్టాలంటే అశ్లీల దశ్యాలు పూర్తిగా నిషేధించాలని కోరారు. ఈ సమావేశంలో ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేష్, వేముల రామకష్ణ, సతీశ్, సుభాసిని, శరత్ కుమార్, శ్రీనివాస్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ చేయకపోతే బీజేపీకి రాజకీయ సమాధి'



నవతెలంగాణ-ఓయూ

ఎస్సీ వర్గికరణ చేయకపోతే బీజేపీని రాజకీయ సమాధి చేస్తామని మాదిగ హక్కుల దండోర నేతలు హెచ్చరించారు. శుక్రవారం హబ్సిగూడాలో నిర్వహించిన మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షులు దండు సురేందర్ మాదిగ, దండోరా రాష్ట్ర అధ్యక్షులు కొంగరి శంకర్ మాదిగలు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజులలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ చేయకపోవడం సిగ్గు చేటు అన్నారు. గతంలో అనేక సార్లు ఛలో ఢిల్లీ లాంటి కార్యక్రమాల ద్వారా కేంద్రప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ ఒత్తిడిని తెస్తున్నామని.. ఈ సారి వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మాదిగలపై సవతి తల్లి ప్రేమ చూపకుండా అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు తీర్మానం చేసి పంపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచడం కోసం త్వరలో మళ్ళీ ఛలో ఢిల్లీ కార్యక్రమం ఉంటుందన్నారు. మాదిగల హక్కుల ఆత్మ గౌరవం కోసం మాదిగ హక్కుల దండోరా నిరంతరం శ్రమిస్తుందన్నారు. దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు మాట్లాడుతూ తెలంగాణలో మాదిగలు అంత ఐక్యంగా ఉండాలన్నారు. సమావేశంలో తుంగపల్లి గంగాధర్, ఎంహెచ్‌డీ లీగల్ అడ్వైజర్ దర్శనం రామకష్ణ, రేణిగుంట్ల కుమార్, గొల్లపల్లి నరేష్, గంగారపు రమేష్, మామిడి శోభ, మేదరి ప్రసాద్, పొడుతూరి లతా, పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ టీచర్లను రెగ్యులరైజ్ చేయాలి

- ఔట అధ్యక్షుడు ప్రో.మనోహర్



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో రెగ్యులర్ టీచర్స్‌తో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లను రెగ్యులర్ చేయాలని ఓయు ఔట అధ్యక్షుడు ప్రో.మనోహర్ కోరారు. శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ కాంటాక్ట్ టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్లో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాటాడారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని ఔట సంపూర్ణ మద్దతు ప్రకటించారు. విశ్వవిద్యాలయాల్లో బోధిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా బోధిస్తూ, అడ్మినిస్ట్రేటివ్ విధుల్లో సైతం సమానంగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. వారు తమకంటే ఏమీ తక్కువ కాదని, కాంట్రాక్ట్ అధ్యాపకులు లేకుండా విశ్వవిద్యాలయాలు నడవలేని పరిస్థితి ఉందన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. జేఎల్, డీఎల్, పాలిటెక్నిక్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసిన విధంగా విశ్వవిద్యాల యాల కాంట్రాక్టు అధ్యాపకులను కూడా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ అధ్యాపకులందరూ పీహెచ్డీ,నెట్,సెట్, లాంటి క్వాలిఫికేషన్స్‌ను కలిగి ఉండి నోటిఫికేషన్స్ ద్వారా నియమించబడి అనేక సంవత్స రాలుగా విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారన్నారు. కావున వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. హెడ్ ప్రొ. యు. ఉమేష్ కుమార్, చీఫ్ వార్డెన్ డా.కోరెములు శ్రీనివాస్ ,డా. గంగాధర్‌లు మద్దతు ప్రకటించారు. డా. వేల్పుల కుమార్ తాల్లపల్లీ వెంకటేశం, డా.ఉపేందర్ రావు లు మాట్లాడుతూ. నేడు ఉన్నత విద్యామండలి ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. 19న తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయంలో వంటా వార్పు కార్యక్రమం, 21న, గన్ పార్క్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. ఎడ్యుకేషన్ కౌన్సిల్ ముట్టడిని విజయవంతం చేయాలని అధ్యాపకులను కోరారు. కాంట్రాక్టు టీచర్స్ పాల్గొన్నారు.



కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ - ధూల్ పేట్

కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టర్లపై లేబర్ అధికారులు చర్యలు తీసుకోవాలని ల్యాబ్స్, పబ్లిక్ సెక్టార్ క్లస్టర్ కన్వీనర్ ఎస్. కిషన్, తిరుపతిలు డిమాండ్ చేశారు. ల్యాబ్స్, పబ్లిక్ సెక్టార్ క్లస్టర్ కమిటీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని (ఆర్ఎల్సి) రీజనల్ లేబర్ కమిషనర్ సునీల్ కుమార్ సాహుకు మెమోరాండం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ సెక్టార్లలో పనిచేస్తున్న చాలా మంది కాంట్రాక్టర్లు కార్మికుల శ్రమ దోచుకుంటు న్నారన్నారు. బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి సరిగ్గా అమలు చేయాలని అన్నారు. వేతనాలలో కోతలు చేయకుండా చూడాలన్నారు. వర్క్ ఆర్డర్ పేరుతో కార్మికులను తొలగించడం ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనిస వేతనం రూ.26వేలకు పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్పందించిన కమిషనర్ పలు సమస్యలు పరిస్కారాని కి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కృష్ణ, బాలయ్య, సోమన్న, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులను తొలగిస్తే ధర్నా చేపడతాం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

రహమత్ నగర్ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ బస్తీలో గల పోచమ్మ టెంపుల్, ఆంజనేయస్వామి టెంపుల్ వద్ద గత 12 సంవత్సరాల క్రితం భక్తుల సౌకర్యార్థం నీళ్ల ట్యాంకులను ఏర్పాటు చేశారు. అయితే బస్తీలోని ఇద్దరు నాయకులు బోనాల పండగ ఘనంగా నిర్వహించాలని, అక్కడ ఉన్న వాటర్ ట్యాంకులను తొలగించి వేరే చోట ఏర్పాటు చేయాలని ప్రయత్నం చేస్తున్నారని వార్తలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న బస్తీలోని నాయకులు ,మహిళలు, ట్యాంకులను తొలగిస్తే ఊరుకోబోమని హెచ్చ రించారు. వారు మాట్లాడుతూ బస్తీ అభివృద్ధి చేయాలంటే మీ సొంత డబ్బులతో, మీకు కావలసిన చోట వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసుకోవాలని, అంతేగాని దేవాల యాల వద్ద ఉన్న ట్యాంకులు తొలగించవద్దని నాయకులను హెచ్చరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి జోక్యం చేసుకొని, నీళ్ల ట్యాంకులను తొలగించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బస్తీలో కొంతమంది నాయకులు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని, బస్తీ సభ్యులకు వ్యతిరేకంగా పనులు చేయాలని చూస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆనంద్, వసంతు, బస్తీలోని మహిళలు, నాయకులు, యువకులు భారీగా పాల్గొన్నారు.

లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారికి బంగారు బోనం



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

లాలదర్వాజాశ్రీ సింహవాహిని మహంకాళి మాతకు బంగారు బోనం, 56 రకాల మిఠాయిలతో అమ్మవారికి నైవేద్యం, విజయవాడ కనకదుర్గ అమ్మవారి నుంచి పట్టు వస్త్రాలు సమర్పణ శుక్రవారం జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు అలె భవ్య ఆధ్వర్యంలో శుక్రవారం లాల్ దర్వాజా శ్రీ మహంకాళి అమ్మవారికి బంగారు బోనం, పట్టు వస్త్రాలు సమర్పించారు. ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ యం.కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంత రావు,బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కష్ణ తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మెన్ సి.రాజేందర్ యాదవ్ వారిని సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు బి.మారుతీ యాదవ్,పోసాని విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

56 రకాల మిఠాయిలతో అమ్మవారు అలంకరణ

ఆషాఢ మాసం బోనాల సందర్భంగా శుక్రవారం బేల మాతేశ్వరి ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారు 56 పండ్ల రకాల సీట్లతో అలంకరించారు. 13 రకాల డ్రైఫ్రూట్స్‌తో 12 రకాల పండ్లతో అలంకరించారు. ప్రత్యేకంగా శుక్రవారం సామూహిక కుంకుమార్చన జరిగింది. అనేకమంది మహి ళలు పాల్గొని అమ్మ వారికి ఘనంగా కుంకు మార్చన నిర్వహిం చారు. మాజీ ఎంపీ వి హనుమంతరావు అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మెన్ సదానంద యాదవ్, పొటేలు కష్ణ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



గాజుల అలంకరణలో ఉప్పుగూడా మహంకాళి దేవి అమ్మవారు

ఉప్పుగూడ మహంకాళి దేవాలయంలో అమ్మవారు శుక్రవారం రంగురంగుల గాజులతో ప్రత్యేకంగా అలంకరించబడి దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా బస్తీలోని మహిళలచే సామూహిక కుంకు మార్చన కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఆలయ చైర్మెన్ మధుసూదన్ గౌడ్, ఆలయ ప్రధాన కార్యదర్శి కీర్తి సురేందర్ ముదిరాజ్, ఆలయ ప్రతినిధులు సుభాష్, శివకుమార్, సతీష్, బాబురావు, భవాని, శంకర్, ఆనంద్ పాల్గొన్నారు.







చంద్రయన్ ప్రయోగం విజయవంతం కావడంతో బాగ్ అంబర్‌పేట డివిజన్‌కు చెందిన గ్రామర్ స్కూల్ విద్యార్థులు నిత్య, నవ్య విజయోత్సర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట



ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారికి గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ బోనం, పోచంపల్లి చేనేత పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవతెలంగాణ-అడిక్ మెట్

దోమలగూడ గ్యాస్ లీకేజ్ ఘటనలో మరో ముగ్గురు మృతి




నవతెలంగాణ-అడిక్ మెట్

దోమలగూడ గ్యాస్ లీకేజ్ ఘటనలో మరో ముగ్గురు మత్యువాత పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో పద్మ, ధనలక్ష్మి, అభినవ్ శుక్రవారం ఉదయం మృతి చెం దారు. దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని దోమలగూడ రోజ్ కాలనీలో ఈనెల 11న పిండి వంటలు చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు అంటుకోవడంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. అయితే గాయపడిన ధనలక్ష్మి కూతురు శరణ్య చికిత్స పొందుతూ ఈనెల 12న మతి చెందింది. తీవ్రంగా గాయాలపాలైన పద్మ (53), ఆమె కూతురు ధనలక్ష్మి (28), ధనలక్ష్మి కుమారుడు అభినవ్ (7)లు గాంధీ ఆస్పత్రి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. 5 రోజుల వ్యవధిలోనే ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోవడంతో స్థానికంగా విషాద ఛాయలు అలుము కున్నాయి. కుటుంబ సభ్యుల రోదనను ఆపడం ఎవరి తరమూ కావడం లేదు.



నిజం దాచి పెట్టి..?



'వంద అబద్దాలు ఆడైన ఒక పెండ్లి చేయాలి' అన్నారు గతంలో పెద్దలు. కానీ ఇది అన్ని విషయాల్లో సరిపోదు. పైగా ఇప్పటి పరిస్థితులకు అసలే సరిపోదు. నేటి సమాజంలో ఆవేశాలతో చిన్న సమస్యలకే భార్యాభర్తలు విడిపోతున్నారు. అలాంటిది అబద్దాలు చెప్పి పెండ్లి చేసుకుంటే పరిస్థితి ఏంటి? ఆ జంట జీవితాంతం కలిసి ఉండగలుగుతుందా? పెండ్లి అంటే ఇద్దరు వ్యక్తులకు సంబంధించినదే కాదు, రెండు కుటుంబాల మధ్య ఏర్పడిన బంధం. కాబట్టి ఉన్నది ఉన్నట్టుగా చెప్పి, నచ్చితే పెండ్లి చేసుకోవాలి. లేకపోతే చాలా సమస్యలు వస్తాయి. నిజం దాచిపెట్టి పెండ్లి చేసుకోవడం వల్ల వచ్చే సమస్యలకు రేవంత్ జీవితమే చక్కటి ఉదాహరణ. ఇంతకీ అతను దాచిన నిజం ఏంటో, దాని వల్ల జరిగిన పర్యావసానాలేంటో ఈ వారం ఐద్వా అదాలత్‌లో తెలుసుకుందాం...

రేవంత్, భానవకు పెండ్లి జరిగి నాలుగేండ్లు అవుతుంది. కానీ ఇప్పటి వరకు వారిద్దరి మధ్య శారీరక సంబంధం లేదు. భావనను ఒక పెండ్లిలో చూసి ఇష్టపడి పెండ్లి చేసుకున్నాడు రేవంత్. పెండ్లిలో ఆమెకు 15 తులాల బంగారం, రూ.15 లక్షలు కట్నం కింద ఇచ్చారు. కట్నం డబ్బులతో రేవంత్ ఇల్లు తీసుకున్నాడు. పెండ్లి తర్వాత భార్యతో సంతోషంగా గడపాల్సిన మూడు రోజులు కూడా ఆమెతో దూరంగానే ఉన్నాడు. కారణం ఏంటో భావనకు తెలియదు. నోరు విప్పి అతను చెప్పడు. దాంతో ఆమెకు భర్తపై అనుమానం వచ్చింది. 'మీకు ఏదైనా సమస్య ఉంటే మనం డాక్టరు దగ్గరకు వెళ్ళి చికిత్స తీసుకుందాం, ఈ విషయం నేను ఇంట్లో ఎవరికీ చెప్పను' అని నచ్చజెప్పింది అతన్ని బలవంతంగా డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళింది.

డాక్టరు పరీక్షలు చేసి కొన్ని మందులు ఇచ్చి 'ముందు మీరు ఒకరి గురించి ఒకరు తెలుసుకునే ప్రయత్నం చేయండి. తర్వాత శారీరక కలయిక గురించి ఆలోచించండి' అని చెప్పారు. ఇద్దరూ కలిసి హనీమూన్‌కి వెళ్ళారు. వాళ్ళ ఇద్దరి మధ్య లైంగిక చర్య లేకపోయినా చాలా సంతోషంగా వారం రోజులు బయట గడిపి వచ్చారు. అలా 16 నెలలు గడిచిపోయాయి. 'పిల్లలు ఎప్పుడు పుడతారు? నీకు ఇంకా పిల్లలు కలగడం లేదు, నా కొడుక్కి రెండో పెండ్లి చేస్తాను' అంటూ అత్త తరచూ గొడవ చేసేది. కానీ రేవంత్‌లో ఎలాంటి మార్పు రాలేదు. ఎన్ని రోజులు మందులు వాడినా ఉపయోగం లేదు. పిల్లల కోసం ఆమెపై ఒత్తిడి పెరిగింది. దాంతో ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి.

రేవంత్ తరచూ భావనను కొట్టేవాడు. ఈ ఒత్తిడి నుండి తప్పించుకోవడానికి రేవంత్ ఉద్యోగం కోసం దుబాయ్ వెళ్ళిపోయాడు. దాంతో భావన పరిస్థితి మరీ దీనంగా మారింది. 'నా కొడుకు లేనప్పుడు నువ్వు ఇక్కడ ఎందుకు? మీ ఇంటికి వెళ్ళిపో' అని భావనను అత్తింటి వారు బాగా కొట్టి పంపించారు. ఆమె ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. దాంతో పోలీసులు భావనపై కేసు బుక్ చేశారు. దుబాయ్‌లో ఉన్న భర్తకు చెప్తే ఆమెను కూడా దుబాయ్ పంపించమన్నాడు. భావన చాలా సంతోషించింది. కానీ దుబాయ్ వెళ్ళిన తర్వాత ఆమె పరిస్థితి పెనం నుండి పొయ్యిలో పడినట్టు అయింది.

భావనను విపరీతంగా హింసించడం ప్రారంభించాడు. ఇలా రేవంత్ తనలోని లోపాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించేవాడు. చివరికి వీసా ముగియడంతో ఆమె తిరిగి ఇండియా వచ్చేసింది. రెండేండ్ల తర్వాత రేవంత్ కూడా తిరిగి వచ్చాడు. కానీ భావనను తన ఇంటికి తీసుకెళ్ళడానికి రాలేదు. పైగా ఆమెకు ఇతరులతో సంబంధం ఉన్నట్టు ప్రచారం చేయడం ప్రారంభించాడు. వాళ్ళ కమ్యూనిటీలో కూడా ఫిర్యాదు చేశాడు. ఇవేవీ భావన అడ్డుకోలేక పోయింది. అక్కడ ఆమె ఆవేదన ఎవరూ అర్థం చేసుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లోనే తెలిసిన వారు చెబితే న్యాయం కోసం ఐద్వా అదాలత్ వద్దకు వచ్చింది.

మేము భావన భర్తను, అత్తను పిలిచి విషయం కనుక్కున్నాం. భావన చెప్పింది మొత్తం నిజమే అని తేలింది. రేవంత్‌కు లైంగిక సమస్యలు ఉన్నాయి. ఎంతమంది డాక్టర్ల దగ్గర వైద్యం చేయించుకున్నా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఆ విషయం వాళ్ళ అమ్మకు కూడా తెలుసు. అయినా నిజం దాచిపెట్టి పెండ్లి చేసింది. ఒక అమ్మాయి జీవితం నాశనం చేసింది. ఈ విషయం బటయకు తెలిస్తే పరువు పోతుంది కాబట్టి సమాజం కోసం పెండ్లి చేసి, భావనకు ఇతరులతో సంబంధం అంటకట్టి వదిలించుకోవాలనుకుంది.

రేవంత్ విడాకులు ఇస్తే కట్నం కింద ఇచ్చిన డబ్బులు, బంగారం వెనక్కు ఇవ్వాల్సి వస్తుంది కాబట్టి భావననే విడాకులు తీసుకునే విధంగా చేయాలని వీరి ఆలోచన. 'మీరు నిజం దాచిపెట్టి పెండ్లి చేసుకోవడం చాలా పెద్ద నేరం. తెలిసి తెలిసి ఒక అమ్మాయి జీవితం నాశనం చేశారు. రేవంత్‌కు వైద్య పరీక్షలు చేసి కోర్టులో కేసు వేయిస్తాం' అని వారిని హెచ్చరించాం. భావనతో 'నువ్వు అతని నుండి విడాకులు తీసుకుని వేరే పెండ్లి చేసుకో. ఇంతటితో నీ జీవితం అయిపోయినట్టు కాదు. వారు చేసిన తప్పుకు నీ జీవితాన్ని నువ్వు నాశనం చేసుకోకు. ఇకపై హాయిగా వుండు. భవిష్యత్‌లో నీకు ఎలాంటి సహకారం కావాలన్నా నీకు మేము తోడుంటాము' అని చెప్పాము. నష్ట పరిహారం కింద ఆమె బంగారంతో పాటు ఆమె కట్నంతో తీసుకున్న ఇల్లు, 5 లక్షలు నగదు కూడా భావనకు ఇప్పించాం.

> "భావనను విపరీతంగా హింసించడం ప్రారంభించాడు. ఇలా రేవంత్ తనలోని లోపాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించేవాడు. చివరికి వీసా ముగియడంతో ఆమె తిరిగి ఇండియా వచ్చేసింది. రెండేండ్ల తర్వాత రేవంత్ కూడా తిరిగి వచ్చాడు. కానీ భావనను తన ఇంటికి తీసుకెళ్ళడానికి రాలేదు. పైగా ఆమెకు ఇతరులతో సంబంధం ఉన్నట్టు ప్రచారం చేయడం ప్రారంభించాడు. వాళ్ళ కమ్యూనిటీలో కూడా ఫిర్యాదు చేశాడు. ఇవేవీ భావన అడ్డుకోలేక పోయింది."

- వై.వరలక్ష్మి, 9948794051

కోపం వస్తుందా..?

భావావేశాలు వేటి స్థాయిలో అవి ఉన్నప్పుడే జీవితం సాఫీగా సాగుతుంది. ఏ ఒక్క భావావేశం మనసుని అతిగా ఆక్రమించినా మొత్తం చికాకుగా తయారవుతుంది. మనం గుర్తించం గానీ కొన్నిసార్లు కొన్ని భావావేశాలు మనల్ని కొంచెం ఎక్కువగానే ఇబ్బందిపెడతాయి. సమస్యల్లా అలవాటు పడిపోయిన మనం వాటిని గుర్తించడానికి, వాటిని వదిలించుకోవడానికి, మనం మారడానికి ఇష్టపడం.



మనకే బాధ : చాలామందిని ఇబ్బందిపెట్టే కోపాన్నే తీసుకోండి. ఎందుకు, ఎప్పుడు, ఎలా మొదలవుతుందో తెలీదు. అప్పటి వరకు ప్రశాంతంగా వున్న మనసు ఒక్క నిమిషంలో అల్లకల్లోలంగా మారిపోతుంది. సర్దుకుందామని, ఆ కోపాన్ని దూరంగా నెట్టేద్దామని ప్రయత్నించిన కొద్దీ మరికొంచెం ఎక్కువవుతుందే గానీ తగ్గదు. ఒకోసారి ఆ కోపాన్ని అంత తొందరగా వదులుకోవడం ఇష్టంలేనట్టు మనం కూడా ఒకదానిపై నుంచి మరో దానిపైకి మన కోపాన్ని మళ్ళిస్తూనే వుంటాం. మండే కట్టె మంటని ఎగజిమ్ముతూనే తనని తాను దహించుకున్నట్టు కోపం వచ్చినప్పుడు ఎవరి మీదో కోపం చూపిస్తున్నాం అనుకుంటాం. కానీ, అది మనల్నే ఎక్కువ బాధపెడుతుంది.

బంధాలు బలహీనం : ఆ నిమిషానికి వచ్చిపోయే కోపం పెద్దగా హాని చేయకపోయినా కొంతకాలం పాటు కొందరిపై నిలిచిపోయే కోపం తప్పకుండా బంధాలను బలహీనపరుస్తుంది. ఒకోసారి మన మనసుని, జీవితాన్ని కూడా శూన్యంగా మార్చేస్తుంది. ఒక్కసారి గుర్తుచేసుకోండి ఎప్పుడైనా ఎవరిపైన అయినా వచ్చిన కోపానికి కారణం మొదట చిన్నదే అవుతుంది. రానురాను ఒకదానికి ఒకటి చేరుతూ మందమైపోతుంది. మనసుని రాయిగా మార్చేస్తుంది. మనకి తెలీకుండానే ఎదుటి వ్యక్తిని బాధపెడతాం. విసుక్కుంటాం. విసిరికొడతాం. ఫలితం తెలిసిందే. కానీ, ఎంత కోపం వచ్చినా మనం అంత తీవ్రంగా ఒక వ్యక్తిని బాధపెట్టడం కరెక్టేనా..?

మనసులకు గాయం : మనసులో ఎక్కడో దాగున్న అక్కసుని తీర్చుకునేందుకు కోపాన్ని సాధనంగా వాడుకుంటే అంతకన్నా పెద్ద పొరపాటు ఇంకోటుండదు. ఒకరిని చూసి మరొకరు, ఒకరు చేశారు కదా అని మరొకరు ఇలా మనసుల్ని గాయపరచుకుంటూ వెళుతుంటే కొన్నాళ్ళకు గాయపడ్డ మనసులు, దూరమైన బంధాలు మిగులుతాయి. పరిగెట్టే కాలంతో అన్నీ సవ్యంగా వుంటేనే బంధాలని కాపాడుకోవడం కష్టంగా మారిన కాలంలో మనసుల్ని గాయపర్చుకుంటూ వెళితే ఆత్మీయత అనే లేపనాన్ని రాసేపాటి అవకాశం కూడా వుండదు.

మంచి మాట చాలు : క్షమించడం లాంటి పెద్ద పదాలు వాడక్కర్లేదుగానీ, చెదిరిపోయిన మనసుల్ని, బంధాల్ని సరిచేసే ఒక మంచి మాట మనసు లోతులోంచి వస్తేచాలు అద్భుతాలు జరగక మానవు. కోపం, పగ, ప్రతీకారం వంటి లక్షణాలను ప్రత్యేకంగా అలవర్చుకోనక్కర్లేదు. ముందు తరాల వారికి అలవాటు చేయక్కర్లేదు. వద్దన్నా అవి మన మనసుపై దాడి చేస్తూనే వుంటాయి. ఆత్మీయత అనే కవచాన్ని ధరిస్తే వాటి దాడి నుంచి తప్పించుకోవచ్చు. ద్వేషాని ద్వేషించి దూరంగా తరిమికొట్ట గలిగితే మనకి మనం మంచి చేసుకున్నవారమవుతాం. ప్రేమాప్యాయతలనే మంచి గంధాన్ని మనసు మూలల్లో దాచినా చాలు.. అది సువాసనలు వెదజల్లకపోదు. చుట్టూ తన పరిమళాన్ని నింపకపోదు.

సరిగా నిద్రపోతున్నారా?

ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో ఎదుర్కొనే సమస్య... నిద్రలేమి. కొందరికి పనుల వల్ల నిద్ర పోయే సమయం ఉండకపోవచ్చు.. కొందరికి వ్యక్తిగత సమస్యలు కావచ్చు.. మరికొందరికి ఆహారపు అలవాట్లు కావచ్చు.. కారణమేదైనా సమస్య మాత్రం నిద్ర కోసమే.. అయితే ఇది అంత సులభంగా వదిలేసే విషయం కాదు. దీని వల్ల చాలా సమస్యలు మొదలవుతాయి.. అవేంటంటే...



- నిద్రలేమి సమస్య మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది.
- తగిన నిద్రలేకపోతే జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది.
- వృద్దాప్య ఛాయలు త్వరగా వస్తాయి.
- నిద్రలేకపోతే శరీరానికి తగిన ఆక్సిజన్ లభించదు. శరీరానికి ఆక్సిజన్ అందకపోతే ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు తలెత్తుతాయి.
- విద్యార్థులు తప్పకుండా ఏడు గంటలు నిద్రపోవాలి. లేకపోతే చదువుకున్నవి ఏవీ గుర్తు ఉండవు.
- శరీరానికి సరిపడా నిద్రలేకపోతే 'డిప్రెషన్'(కుంగుబాటు)కు గురువుతారు. దీనివల్ల ఇతరాత్ర అనారోగ్య సమస్యలు శరీరంపై దాడి చేస్తాయి.
- ఆరుగంటల కన్నా తక్కువ నిద్రపోయేవారు రోజంతా నీరసంగా, నిరుత్సాహంగా ఉంటారు. ఏ పని చేయలేరు, చురుకుదనం లోపిస్తుంది. పనిమీద ఏకాగ్రత ఉండదు.
- నిద్రలేమి సమస్య ఊబకాయం, బరువు పెరగటం వంటి సమస్యలకు దారి తీస్తుంది.

మిజోరంలో బీజేపీకి షాక్

(మొదటిపేజీ తరువాయి)

సంధించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మణిపూర్‌లో చర్చిలకు నిప్పంటిస్తూ విధ్వంసానికి పాల్పడుతున్న మెయిటీ చర్యలకు మద్దతిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెయిటీల ద్వారా మొత్తం 357 చర్చిలు, పాస్టర్ల క్వార్టర్లు, వివిధ చర్చిల కార్యాలయ భవనాలు కాలి బూడిదయ్యాయని ఆయన ఆరోపించారు. క్రిస్టియన్లు, క్రిస్టియన్ మతానికి జరుగుతున్న నేరపూరిత అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన తెలపడానికి నేను మిజోరం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి తక్షణమే రాజీనామా చేస్తున్నాను" అని మిజోరం బీజేపీ అధ్యక్షుడికి రాసిన లేఖలో వనమ్మువంగ పేర్కొన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్ కానీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కానీ చర్చిలను తగలబెట్టే ఘటనలను ఖండిస్తూ ఒక్క మాటా మాట్లాడలేదని ఆరోపించారు. కేంద్రం నుంచి కూడా ఇదే తీరు ఉన్నదని వివరించారు. కాబట్టి మణిపూర్‌లో పెద్ద ఎత్తున చర్చిలను ధ్వంసం చేసే ఘటనల వెనక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు ఉన్నదని తాను విశ్వసిస్తున్నట్టు పేర్కొన్నారు. బీజేపీ క్రిస్టియన్ల వ్యతిరేక పార్టీ అని వచ్చే ఆరోపణలకు ఇవి బలాన్ని చేకూర్చాయని ఆరోపించారు. "దుండగుల దుశ్చర్యలపై రాష్ట్ర నాయకులు, సెంట్రల్ లీడర్లు ఖండనను తెలియజేయాల్సింది. బాధితుల రక్షణ, ఓదార్పుకోసం ఏదో ఒకటి చేయాల్సింది. మిజోరంలో అత్యధికం క్రిస్టియన్లే. బీజేపీ.. క్రిస్టియన్ల వ్యతిరేక పార్టీ అని మణిపూర్‌లో వెల్లడైంది. బీజేపీ నిజంగానే క్రిస్టియన్ల వ్యతిరేఖ పార్టీ అని ప్రజలు చెప్పగలరు. ఒక చర్చి నాయకుడిగా నేను బీజేపీతో ఉండకూడదు" అని వనమ్మువంగ వివరించారు. ఈ ఏడాది మే 3న మణిపూర్‌లో మెయిటీలు, కుకీల మధ్య ఎస్టీ హోదా కల్పించే విషయంలో వివాదం చెలరేగి తీవ్ర హింసకు దారి తీసిన విషయం తెలిసిందే. ఇది మత ఘర్షణలకు కారణమై వందల మంది ప్రాణాలు కోల్పోవడానికి దారి తీసింది.

చీమను చంపేందుకు సుత్తిని వాడలేం కదా!

(మొదటిపేజీ తరువాయి)

నకిలీ,తప్పుదోవపట్టించే సమాచారాన్ని నిర్ణయించేందుకు ప్రభుత్వంలోని ఒక సంస్థకు పూర్తిస్థాయి అధికారాలను కట్టబెట్టడం కష్టం. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కు ఉంది. దానికి సమాధానం ఇవ్వడం ప్రభుత్వం విధి' అని కూడా ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలాగే ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌ను ఎవరు ఫ్యాక్ట్ చేస్తారని కోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. నకిలీ, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ఎలా నిర్ణయిస్తారనే దానిపై స్పష్టత లేదని చెప్పింది.

నేరస్తుడు, మోసగాడు సుఖేష్

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. తనకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, బేషరతుగా ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని సుఖేష్‌ను కేటీఆర్ డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో తనపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

మణిపూర్‌లో హింసను ఆపండి

స్ట్రాస్‌బర్గ్ (ఫ్రాన్స్) : మణిపూర్‌లో హింసను ఆపేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని, అక్కడి మతపరమైన మైనారిటీలకు రక్షించాలని భారత ప్రభుతాన్ని యురోపియన్ పార్లమెంట్ కోరింది. ఈ మేరకు గురువారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. బుధవారం సాయంత్రం ఈ అంశంపై చర్చ జరిగింది. పారిస్‌లో రెండు రోజుల అధికార పర్యటన నిమిత్తం భారత ప్రధాని మోడీ రావడానికి కాస్త ముందుగా ఈ తీర్మానం వెలువడింది. కాగా భారత ప్రభుత్వం వెంటనే దీనిపై ఘాటుగా స్పందించింది. ఇయు పార్లమెంట్ చర్య అమోదయోగ్యం కానిదని స్పష్టం చేసింది.

"మణిపూర్ క్రిస్టియన్ కమ్యూనిటీ వంటి మతపరమైన మైనారిటీలను కాపాడేందుకు, తదుపరి హింస చెలరేగకుండా నివారించేందుకు" భారత ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ తీర్మానం పేర్కొంది. మణిపూర్‌లో హింస చోటు చేసుకుంటున్న ప్రాంతాలకు జర్నలిస్టులు, అంతర్జాతీయ పరిశీలకులు వెళ్లేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులను కోరింది. మణిపూర్‌లో ఇంటర్‌నెట్‌పై నిషేధాన్ని ఎత్తివేయాలని కోరింది. ఐక్యరాజ్య సమితి సిఫార్సులకు అనుగుణంగా సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టాన్ని రద్దు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని తీర్మానం కోరింది. భారత్‌తో జరిపే చర్చల్లో మానవ హక్కుల ప్రాముఖ్యత గురించి ప్రముఖంగా ప్రస్తావించాల్సిందిగా ఇయు పార్లమెంట్‌స సభ్యులు ఇయుని కోరారు. కేవలం మణిపూర్‌లోనే కాకుండా మొత్తంగా భారతదేశంలో మైనారిటీల పరిస్థితి పట్ల పార్లమెంట్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

భారత్ ఖండన

ఈ తీర్మానంపై భారత్ మండిపడింది. ఇది ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాని చర్య అంటూ విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బగ్చి ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. ఈ చర్య వలసవాద వైఖరిని ప్రతిబింబిస్తోందని అన్నారు. మణిపూర్‌లో పరిస్థితులపై న్యాయ వ్యవస్థతో సహా అన్ని స్థాయిలో అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని, ఇతరుల అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి బదులుగా వారి స్వంత విషయాలపై దృష్టి పెడితే బాగుంటుందని యురోపియన్ పార్లమెంట్‌కు సూచించారు.

పంచాయతీ హింసకు వ్యతిరేకంగా లెఫ్ట్ ఫ్రంట్,మిత్రపక్షాల నిరసన

(మొదటిపేజీ తరువాయి)

మమతా బెనర్జీ ద్వారా డబ్బుతో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసింది. త్రిపుర, గుజరాత్, మధ్యప్రదేశ్, అసోం, యూపీ సహా ఆరెస్సెస్ ద్వారా నడుస్తున్న రాష్ట్రాలకు ఆమె వెళ్తుంది. మళ్లీ బెంగాల్ విభజన జరగాలని యోచిస్తున్నారు. కూచ్ బెహార్ నుంచి ఉత్తర బెంగాల్‌ను ప్రత్యేక రాష్ట్రంగా చేయాలని బీజేపీ కోరుకుంటోంది. బెంగాల్‌ను మళ్లీ విభజించాలనే ఈ కుట్రకు వ్యతిరేకంగా బెంగాల్ ప్రజలు నిలబడతారు" అని ఆయన అన్నారు. పలువురు లెఫ్ట్ ఫ్రంట్ నేతలు ఒకదాని తర్వాత మరొకటిగా కౌంటింగ్ కేంద్రాల్లో జరిగిన అవకతవకలను ప్రస్తావించారు. ఐఎస్ఎఫ్ ఎమ్మెల్యే నౌషాద్ సిద్ధిఖీ మాట్లాడుతూ.. "పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన వారిని సర్టిఫికెట్లు పొందకుండా కౌంటింగ్ కేంద్రం నుంచి తరిమికొట్టారు. విజేతలను ఓడిపోయినట్టు ప్రకటించారు. బెంగాల్ ఇప్పుడు సవాలుతో కూడిన పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ప్రజలు ఈ రోజు స్వచ్ఛందంగా వీధుల్లోకి వచ్చారు. అధికార పార్టీ దౌర్జన్యాన్ని అంతం చేయడానికి వారు సిద్ధమవుతున్నారు. అణచివేత నుంచి విముక్తి పొందాలి. మనమందరం కలిసి పోరాడాలి" అని తెలిపారు. భాంగోర్‌లో తమ అభ్యర్థి గెలిచిన తర్వాత కూడా సర్టిఫికేట్ ఇవ్వలేదని సిద్ధిఖీ అన్నారు. ప్రతిపక్ష పార్టీల ఏజెంట్లు, అభ్యర్థులను కౌంటింగ్ కేంద్రాల నుంచి బయటకు పంపించి, టీఎంసీని విజేతగా ప్రకటించి సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు.

పంచాయతీ ఎన్నికల హింసలో మరణించిన అన్ని రాజకీయ పార్టీలకు చెందిన 49 మంది కార్యకర్తలు, సామాన్య ప్రజలకు లెఫ్ట్ ఫ్రంట్ నివాళు లర్పించింది. కోల్‌కతాతో పాటు, ఉత్తర మరియు దక్షిణ 24 పరగణాలు, హౌరా, హుగ్లీ నుంచి చాలా మంది ప్రజలు ఈ నిరసన ర్యాలీలో పాల్గొన్నారు.

వీధుల్లో దొరికిన సీపీఐ(ఎం) ఓట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుంది. ఓటు వేసేటప్పుడు బ్యాలెట్ పేపర్‌పై సంతకం చేస్తారు. ఈ బ్యాలెట్ పత్రాలు కరిగర్ పారాలోని పూర్వస్థలి గ్రామ పంచాయతీలోని బూత్ నంబర్ 228కి చెందినవిగా వారు పేర్కొన్నారు. ఇక్కడనుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా పోటీచేసిన మరియా బీబీ షేక్ కేవలం మూడు ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారని సీపీఐ(ఎం) నాయకులు తెలిపారు.

సీపీఐ(ఎం), కాంగ్రెస్, ఐఎస్ఎఫ్‌లు నామినేషన్‌లు వేసిన నాటి నుంచే దోపిడీ ప్రక్రియ మొదలైందన్నారు. ఈ దోపిడీ ప్రక్రియలో తృణమూల్‌తో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా పాలుపంచుకుందని వారు ఆరోపించారు. ప్రతిపక్షాల అభ్యర్థులకు అనుకూలమైన ఓట్లను బయటకు విసిరేశారని, అయినప్పటికీ ప్రతిపక్ష అభ్యర్థులు గెలిచిన చోట సర్టిఫికెట్ ఇవ్వలేదని అన్నారు. తణమూల్ డిమాండ్ మేరకు ప్రతిపక్ష ఏజెంట్లను బహిష్కరించి మళ్లీ కౌంటింగ్ చేపట్టారని, ఆ తర్వాత తృణమూల్ అభ్యర్థులను విజేతలుగా ప్రకటించారని అన్నారు.సీపీఐ(ఎం) పూర్వస్థలి-2 ఏరియా కమిటీ సభ్యుల్లో ఒకరైన కార్తీక్ దాస్ మాట్లాడుతూ... ఇలాంటి ఘటనలు జరుగుతాయని మేం ముందే ఊహించాం. ఓట్ల లెక్కింపు రోజున బ్యాలెట్ బాక్సులను తీసుకురావడానికి తాత్కాలిక ఉద్యోగులను ఉపయోగించవద్దని పూర్వస్థలి-2 బీడీఓను కోరాం. అయినా... ఆయన మా విజ్ఞప్తిని అంగీకరించలేదని కార్తీక్ దాస్ తెలిపారు.

వేతనాలు పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ బొర్కాడే హేమంత్‌కు వినతి పత్రం అందజేశారు. మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ, ఎస్‌కేఎస్ ఆధ్వర్యంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులు జీఓ 22ను గెజిట్ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏనుమాముల పరిశ్రమల క్లస్టర్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

31మంది ఐఏఎస్‌ల బదిలీలు

(మొదటిపేజీ తరువాయి)

10. నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్	మంద మకరందు
11. ములుగు జిల్లా కలెక్టర్	ఐలా త్రిపాఠి
12. పెద్దపల్లి జిల్లా కలెక్టర్	ముజమిల్ ఖాన్
13. ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి	కే హరిత
14. హస్త కళల అభివద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్	అలుగు వర్షిణి
15. క్రీడల శాఖ డైరెక్టర్	కొర్రా లక్ష్మి
16. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్	హైమావతి
17. పర్యాటక శాఖ డైరెక్టర్	కే నిఖిల
18. వ్యవసాయ శాఖ ఉప కార్యదర్శి	సత్య శారదాదేవి
19. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్	స్నేహ శబారిష్
20. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్	ప్రియాంక ఆల
21. మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్	వెంకటేశ్ ధోత్రే
22. జనరల్ అడ్మినిస్ట్రేషన్	కే స్వర్ణలత
23. ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్	అభిలాష అభినవ్
24. కామారెడ్డి అదనపు కలెక్టర్	మను చౌదరి
25. జగిత్యాల అదనపు కలెక్టర్	టీఎస్ దివాకర్
26.నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్	కుమార్ దీపక్
27. పెద్దపల్లి అదనపు కలెక్టర్	చెక్క ప్రియాంక
28. కరీంనగర్ అదనపు కలెక్టర్	జల్దా అరుణశ్రీ
29. సంగారెడ్డి అదనపు కలెక్టర్	బడుగు చంద్రశేఖర్
30. రంగారెడ్డి అదనపు కలెక్టర్	ప్రతిమా సింగ్
31. సిద్ధిపేట అదనపు కలెక్టర్	గరిమా అగర్వాల్

కేసీఆర్ గిరిజన బంధు ఎక్కడ?

- దుర్భరంగా గిరిజన బతుకులు : మాజీ ఎంపీ రవీంద్రనాయక్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేసీఆర్..గిరిజన బంధు ఎక్కడ? అని బీజేపీ నేత, మాజీ ఎంపీ రవీంద్రనాయక్ ప్రశ్నించారు. అర్హులైన చాలా మంది గిరిజనులకు ప్రభుత్వం పోడు పట్టాలివ్వలేదని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ట్రైబల్ ఏరియాల్లో పీహెచ్‌సీలు కూడా సరిగ్గా లేవనీ, అనారోగ్యాలతో గిరిజనులు ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. కేసీఆర్ అసమర్థ పాలనను, విద్యావ్యవస్థలోని లోపాలను ఆయన మనువడు హిమాన్ష్ భయపెట్టారన్నారు.

ట్రైబల్ యూనివర్శిటీ ఏర్పాటు విషయంలో కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. బీజేపీ అధికార ప్రతినిధి విఠల్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. జర్నలిస్టులకు సంబంధించిన 70 ఎకరాలను వారికివ్వకుండా కొట్టేయాలని చూస్తోందని ఆరోపించారు. ఈ నెల 18న జర్నలిస్టులు చేసే ధర్నాకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం బీజేపీ పోరాటానికి సిద్ధం అవుతున్నదన్నారు.

ఓసారి కరెంటు తీగలు పట్టుకోండి..

(మొదటిపేజీ తరువాయి)

గంటలపాటే కరెంటు చాలంటూ చెప్పటం ద్వారా తాము అధికారంలోకి వస్తే తిరిగి పాత పాలనను తెస్తామనే విషయాన్ని చెప్పకనే చెబుతున్నారని వ్యాఖ్యానించారు.

బషీర్‌బాగ్ కాల్పులకు కేసీఆరే కారణమంటూ పీసీసీ చీఫ్ రేవంత్ చెప్పటాన్ని హరీశ్‌రావు పెద్ద జోక్‌గా అభివర్ణించారు. అసలు తెలంగాణ ఉద్యమం పుట్టిందే కరెంటు సమస్యలనుంచని తెలిపారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలంటూ ఆనాడు డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కేసీఆర్... చంద్రబాబుకు లేఖ రాశారని తెలిపారు. తెలంగాణ రైతులకు అన్యాయం జరుగుతున్న క్రమంలో మొట్టమొదటగా స్పందించింది కేసీఆరేనని చెప్పారు. ఆయన ఆనాడు తన పదవులను గడ్డిపోచల్లాగా వదులుకున్నారని తెలిపారు. కానీ ఇప్పుడు కొంతమంది నేతలు పదవుల కోసం పార్టీలు మారుతున్నారంటూ కాంగ్రెస్ నాయకులనుద్దేశించి విమర్శించారు. బీజేపీ విధానం మతం పేరిట మంటలు.. కాంగ్రెస్ విధానం మూడు గంటలు..

కేసీఆర్ విధానం మాత్రం మూడు పంటలంటూ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ మూడు పార్టీల్లో ఏ పార్టీ కావాలో తేల్చుకోవాలంటూ ప్రజలకు సూచించారు. దేశంలో కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా 24 గంటల ఉచిత కరెంటును ఇవ్వటం లేదని గుర్తు చేశారు. 2004లో నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను ఇస్తామంటూ చెప్పటం ద్వారా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. అదే పార్టీకి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎం హోదాలో రైతులకు ఏడు గంటలపాటు కూడా కరెంటు ఇవ్వలేమంటూ తేల్చి చెప్పారని ఎద్దేవా చేశారు. ఆనాడు క్రాప్ హాలిడేలిచ్చారనీ, పరిశ్రమలకు కరెంటు కోతలు విధించారని విమర్శించారు. అలాంటి పరిస్థితులనుంచి తెలంగాణ బయటపడిందన్నారు. రాష్ట్రం సిద్ధించాక అసెంబ్లీలో కరెంటు కోతల గురించి, ఎండిన పంటల గురించి చర్చించాల్సిన అవసమరమే లేకుండా పోయిందని వివరించారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు పరిస్థితేంటి..? బీఆర్ఎస్ ఏలుబడిలో విద్యుత్ పరిస్థితేంటి..? అనే అంశంపై వచ్చే ఎన్నికల సందర్భంగా ప్రజల నుంచి రెఫరెండం కోరదామా..? అని సవాల్ విసిరారు. డబుల్ ఇంజిన్ సర్కార్ (బీజేపీ) ఉన్న రాష్ట్రాల్లో వ్యవసాయ పంపు సెట్లకు డీజిల్ ఇంజిన్లు ఉన్నాయంటూ గుర్తు చేశారు. అందుకు భిన్నంగా తెలంగాణలో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామనీ, అందుకోసం రూ.37 వేల కోట్లను ఖర్చు చేశామని వివరించారు. ఉచిత విద్యుత్ వద్దంటూ చెప్పిన చంద్రబాబును గతంలో ప్రజలు ఇంటికి సాగనంపారని తెలిపారు. రైతుల్ని కష్టాలపాల్జేసిన కాంగ్రెస్‌కు కరెంటు గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని విమర్శించారు.

ఇప్పటికైనా ఆ పార్టీ నేతలు ప్రజలకు, రైతులకు క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ విధానాలపై మాట్లాడిన తమ పార్టీ నాయకుడు దాసోజు శ్రావణ్‌కు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఆయన ప్రస్తావించారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే కొందరు ఇలా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను ఖండిస్తున్నామని అన్నారు. నియోజకవర్గ సమస్యలపై చర్చించేందుకే ఎమ్మెల్యే రాజాసింగ్ తనను కలిశారని మంత్రి ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

నవతెలంగాణ



విశాల్

తొలిసారి తెలుగులో పాట పాడిన విశాల్

హీరో విశాల్ తాజాగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మార్క్ ఆంటోనీ'. హై వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో విశాల్‌కి జోడీగా రీతూవర్మ నటిస్తోంది. ఎస్.జె.సూర్య, సునీల్, సెల్వ రాఘవన్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఎస్.వినోద్ కుమార్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.


ప్రస్తుతం చివరి దశ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని వినాయక చవితి పండుగను పురస్కరించుకుని సెప్టెంబర్ 15న విడుదల చేయబోతున్నట్లుగా ఇప్పటికే మేకర్స్ తెలిపారు. తాజాగా ఈ సినిమా నుంచి విశాల్ ఆలపించిన 'అదరద..' సాంగ్ ప్రోమోని మేకర్స్ రిలీజ్ చేశారు. 'అదరద గుండె అదరద మావా.. బెదరగ బెంగ మొదలవదా..' అంటూ సాగేఈ పాటను విశాల్ ఫుల్ ఎనర్జీతో పాడారు. దీంతో ఈ ప్రోమో క్షణాల్లో వైరల్‌గా మారింది. విశాల్ పాడిన ఈ సాంగ్ ఈ సినిమాలో హైలైట్ కావడం ఓ విశేషమైతే, ఆయన తెలుగులో తొలిసారి పాట పాడటం మరో విశేషం.

ఇటీవల రిలీజైన ఈ మూవీ టీజర్‌కి సైతం అద్భుతమైన స్పందన లభించింది. విశాల్ ఇందులో సరికొత్తగా కనిపించారు. విశాల్ లుక్, ఎస్.జె.సూర్య కామెడి టైమింగ్ ఈ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. టైమ్ ట్రావెల్ థీమ్ చుట్టూ తిరిగే కథ. భారీ యాక్షన్ సన్నివేశాలు, సైన్స్ ఫిక్షన్ అంశాలతో ఈ చిత్రం ఆద్యంతం అందరినీ అలరించనుంది అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాష్ కుమార్, ఫైట్స్: పీటర్ హెయిన్స్, దిలీప్ సుబ్బరాయన్, కనల్ కణ్ణన్, దినేష్ సుబ్బరాయన్, డి.ఓ.పి: అభినందన్ రామానుజం, ఎడిటర్: విజయ్ వేలుకుట్టి.

నవచిత్రం

హత్య చేసింది ఎవరు?

'బిచ్చగాడు-2' మూవీతో ఇటీవల సూపర్ హిట్ అందుకున్న తమిళ కథానాయకుడు విజయ్ ఆంటోని 'హత్య' అనే మరో సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు రెడీ అవుతున్నారు. సరికొత్త ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో విజయ్ ఆంటోని డిటెక్టివ్ పాత్రలో కనిపించనున్నారు.



విజయ్ ఆంటోనీ

రితికా సింగ్, మీనాక్షి చౌదరిలు హీరోయిన్లుగా నటించారు. ఇటీవల రిలీజ్ చేసిన ట్రైలర్‌కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే.

ఇక తాజాగా ఈ మూవీకి సంబంధించి మరో అప్డేట్ ఇచ్చారు మేకర్లు. ఈ సినిమాను తెలుగులో భారీ ఎత్తున రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల హక్కులను సురేష్ ప్రొడక్షన్స్, ఏసియన్ సినిమాస్ సొంతం చేసు కున్నాయి. ఈ రెండు డిస్ట్రిబ్యూషన్ సంస్థలు కలిసి ఈ సినిమాను ఈనెల 21న భారీ స్థాయిలోరిలీజ్ చేయ బోతున్నాయి. రీసెంట్‌గా ఈ మూవీ నుంచి రిలీజ్ చేసిన 'ఎవరు నువ్వు?..' అంటూ సాగే లిరికల్ వీడియోకు మంచి రెస్పాన్స్ వచ్చింది. బాలాజీ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీలో విజయ్ ఆంటోని కంప్లీట్ మేకోవర్‌తో, సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. లోటస్ పిక్చర్స్‌తో కలిసి ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ ఈ మూవీని నిర్మించింది. కమల్ బోరా, జి.ధనుంజయన్, ప్రదీప్ బి, పంకజ్ బోరా, విక్రమ్ కుమార్, తాన్ శ్రీ దొరైసింగం పిళ్లై, సిద్ధార్థ్ శంకర్, ఆర్‌విఎస్ అశోక్ కుమార్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరిస్తున్నారు. మురళీ శర్మ, జాన్ విజయ్, రాధిక శరత్‌కుమార్, సిద్ధార్థ్ శంకర్, అర్జున్ చిదంబరం, తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శివకుమార్ విజయన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఆర్కే సెల్వ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



అమ్మాయిలు ధైర్యంగా ఆడిషన్స్ ఇవ్వండి

తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్ అసోసియేషన్ శుక్రవారం మీడియా సమావేశాన్ని నిర్వహించి డ్యాన్సర్ల కొరత ఉందని, ప్రతిభ ఉన్న డ్యాన్సర్లంతా ఆడిషన్స్ ఇవ్వాలని కోరింది. ఫిల్మ్ చాంబర్‌లో ఈ నెల 20, 21, 22 తేదీల్లో ఆడిషన్స్ జరుగుతాయి. 33 ఏళ్లుగా తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్ అసోసియేషన్ కార్యకలాపాలు కొనసాగు తున్నాయి.

ఈ అసోసియేషన్ ఇప్పుడు డ్యాన్సర్లకు కొత్తగా మెంబర్ షిప్ ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఈ సందర్భంగా యానీ మాస్టర్ మాట్లాడుతూ, 'ఇప్పుడు మన మాస్టర్లు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ఈ ఇండస్ట్రీ అంటే అమ్మాయిలు భయపడతారు. కానీ భయపడాల్సిన అవసరం లేదు. మాకు లేడీ డ్యాన్సర్లు, లేడీ కొరియోగ్రాఫర్లు కావాలి. ఈనెల 20, 21, 22న ఫిలిం ఛాంబర్ వద్దకు వచ్చి ఆడిషన్స్ ఇవ్వండి. ఆ తరువాత మీరే జానీ, శేఖర్, యానీ మాస్టర్లు కావచ్చు' అని అన్నారు.

'టాలెంట్ ఉన్న డ్యాన్సర్లంతా కూడా ఆడిషన్స్ ఇవ్వండి. ఇప్పటి వరకు మా వద్ద 130 మంది మాస్టర్లు, 500 మంది డ్యాన్సర్లున్నారు. 200 మంది మెంబర్ షిప్ కానివాళ్లు ఉన్నారు. మూడ్రోజుల పాటు ఆడిషన్స్ నిర్వహిస్తున్నాం. అందరూ సద్వినియోగం చేసుకోండి' అని డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్ .చంద్రశేఖర్ చెప్పారు. తెలుగు ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షులు వల్లభనేని అనిల్ కుమార్ మాట్లాడుతూ, కొత్త టాలెంట్‌ను ఇండస్ట్రీకి తీసుకురావాలని ఈ యూనియన్ ప్రయత్నిస్తోంది. మేం కూడా వారికి సహకరిస్తాం. ప్రతిభ ఉన్న వారంతా ఈ వేదికను ఉపయోగించుకోవాలి' అని అన్నారు. 'అన్ని భాషల్లో మా కొరియోగ్రాఫర్లు పని చేస్తున్నారు. 35 ఏళ్లకు పైగా ఈ సంస్థ విజయవంతంగా కొనసాగుతోంది. ఇంకా కొంత మంది డ్యాన్సర్లను ఆహ్వానిద్దామని ఈ కార్యక్రమం చేపట్టాం. ప్రతిభను ప్రోత్సహించడానికి అందరం సిద్ధంగా ఉన్నాం' అని తెలిపారు.

ఒక్క రోజులో ఏం జరిగింది?

ఇందిరా ఆర్ట్ క్రియేషన్స్ వంశీ రాజు సమర్పణలో ప్రీతి క్రియేషన్స్ నిర్మిస్తున్న చిత్రం 'ఒక్కరోజు-48 గంటలు'. ఆదిత్య, రేఖ నిరోషా జంటగా నటిస్తున్నారు. నిరంజన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నిర్మాత కిరణ్ కుమార్ రెడ్డి తెరకెక్కిస్తున్నారు.

సెన్సార్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉన్న ఈ సినిమా గురించి నిర్మాత కిరణ్ కుమార్ రెడ్డి,'సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని ఈ నెలలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నాం. సినిమా చాలా బాగా వచ్చింది. ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ త్వరలోనే నిర్మాత సి.కళ్యాణ్ చేతుల మీదుగా రిలీజ్ చేస్తాం' అని తెలిపారు. 'డైమండ్‌ని రక్షించటానికి హీరో టైమ్ ట్రావెలింగ్‌ని వాడుకొని ఎలా విజయం సాధించాడు అనేది సినిమా' అని డైరెక్టర్ నిరంజన్ చెప్పారు. ఈ చిత్రానికి సమర్పణ : వంశీ రాజు, మ్యూజిక్ : ప్రజ్వల్ క్రిష్, కెమెరా : చరణ్ అక్కల.



ఆదిత్య బద్వేల్

మెడికల్ క్రైమ్ థ్రిల్లర్

నరేష్ అగస్త్య, సంగీర్తన విపిన్, ఆర్యన్ రాజేష్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న మెడికల్ క్రైం థ్రిల్లర్ 'అసురగణ రుద్ర'. మురళీ కాట్రాగడ్డ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని కమ్ముల ప్రొడక్షన్స్ పతాకంపై మురళీ వంశీ నిర్మిస్తున్నారు.



సంగీర్తన విపిన్, నరేష్ అగస్త్య

తాజాగా ఈ చిత్రం నుంచి 'నీ కనులలో' పాటని విడుదల చేశారు మేకర్స్. శేఖర్ చంద్ర ఈ పాటని మళ్ళీ మళ్ళీ వినాలనిపించే బ్యూటీఫుల్ మెలోడీగా కంపోజ్ చేశారు. సిద్ధార్థ్ మీనన్ లైవ్లీగా పాడిన ఈ పాటకు నికేష్ కుమార్ దాసగ్రంధి ఆకట్టుకునే సాహిత్యం అందించారు. ఈ పాటలో లీడ్ పెయిర్ మధ్య కెమిస్ట్రీని చాలా ప్లజెంట్‌గా దర్శకుడు ప్రజెంట్ చేశారు. మురళీ శర్మ, ఆమని, శత్రు, అమిత్, అభినయ, దేవీ ప్రసాద్ లాంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: మురళీ కాట్రగడ్డ, నిర్మాత: మురళీ వంశీ, సంగీతం: శేఖర్ చంద్ర, డీవోపీ: అమరనాథ్ బొమ్మిరెడ్డి, ఎడిటర్: శ్రీకాంత్ పట్నాయక్, ఫైట్స్: నబా మాస్టర్.

పిల్లలు తప్పు దారి పడితే?

పివి ఆర్ట్స్ పతాకంపై తల్లాడ సాయికృష్ణ, స్వప్న చౌదరి హీరో, హీరోయిన్‌గా అలీ, సుమన్, తనికెళ్ళ భరణి ముఖ్య తారాగణంతో తల్లాడ సాయికృష్ణ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మిస్టరీ'. వెంకట్ పులగం నిర్మాత. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పాత్రికేయుల సమక్షంలో చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. నిర్మాత వెంకట్ పులగం మాట్లాడుతూ, 'దర్శకుడు సాయికృష్ణ చెప్పిన కథ నచ్చడంతో ఈ సినిమా నిర్మిస్తున్నాను. సినిమా చాలా బాగా వస్తుంది' అని తెలిపారు. 'ఈనెల 21తో షూటింగ్ పూర్తి అవుతుంది. సెప్టెంబర్ చివరి వారంలో విడుదల చేస్తాం. మిస్టరీ, సస్పెన్స్ థ్రిల్లర్, కామెడీ చిత్రమిది' అని హీరో, దర్శకుడు తల్లాడ సాయికృష్ణ చెప్పారు. సుమన్ మాట్లాడుతూ, 'నేటి కాలం పిల్లలు తప్పుడు దారిలో నడుస్తున్నారు. ఎవరిని లెక్కచేయడం లేదు. కొందరు పిల్లలు తల్లిదండ్రులనే కొడుతున్నారు. అలాగే తల్లిదండ్రులు కూడా బిజీ అయిపోయి పిల్లల్ని పట్టించుకోవడం లేదు. దీంతో పిల్లలు డ్రగ్స్‌కి బానిసలు అవుతున్నారు. ఈ అంశాలతో ఉన్న ఈ కథ నాకు చాలా బాగా నచ్చింది. ఇందులో పోలీస్ ఆఫీసర్‌గా చేస్తున్నాను' అని తెలిపారు.



మాస్ బీట్‌తో రాజంపేట రాణి



సాయికుమార్, ఆదిత్యా ఓం, ఐశ్వర్య రాజీవ్ కనకాల, శ్రీనివాస్ సాయి, దీపాలి రాజపుత్ ప్రధాన పాత్రధారులుగా శాంతి కుమార్ తూర్లపాటి (జబర్దస్త్ ఫేం) దర్శకత్వంలో ప్రశాంత్ టంగుటూరి నిర్మిస్తున్న చిత్రం 'నాతో నేను'. ఈ చిత్రంలోని 'రాజంపేట రాణిని' అంటూ సాగే ప్రత్యేక గీతాన్ని శేఖర్ మాస్టర్ విడుదల చేసారు. సత్య కశ్యప్ సంగీతం అందించారు. శాంతి స్వరూప్ సాహిత్యం అందించిన ఈ పాటను గీతామాధురి ఆలపించారు. ఈ సందర్భంగా శేఖర్ మాస్టర్ మాట్లాడుతూ, "జబర్దస్త్' ఆర్టిస్ట్‌గా శాంతి కుమార్ అందరికీ పరిచయమే. ఇప్పుడు ఇంకో అడుగు ముందుకేసి సినిమా దర్శకత్వ బాధ్యత తీసుకున్నాడు. ఈ చిత్రంలోని 'రాజంపేట రాణిని' అంటూ సాగే మాస్ బీట్ పాటను చూశా. సంగీతం, కొరియోగ్రఫీ చాలా బావుంది. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్ముతున్నా' అని తెలిపారు.

'జబర్దస్త్ కమెడీయన్‌గా ప్రేక్షకులు నన్ను ఆదరించారు. ఇప్పుడు దర్శకుడిగా తొలి ప్రయత్నం చేశాను. కథ, మాటలు, పాటలు నేనే రాశాను. నిర్మాతల చక్కని సహకారంతో ఈ సినిమా పూర్తి చేశాం. శేఖర్ మాస్టర్ ఈ మాస్ పాటను విడుదల చేయడం ఆనందంగా ఉంది' అని దర్శకుడు శాంతికుమార్ చెప్పారు. ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని ఈ నెల 21 ప్రేక్షకుల ముందుకు రానుంది అని నిర్మాత చెప్పారు.

సమీర్, సి.వి.ఎల్ నరసింహారావు, గౌతమ్ రాజు ఎమ్మెస్ చౌదరి, భద్రం, సుమన్ శెట్టి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మురళి మోహన్ రెడ్డి, సంగీతం: సత్య కశ్యప్, బ్యాక్‌గ్రౌండ్: ఎస్ చిన్న, ఎడిటింగ్: నందమూరి హరి, ఆర్ట్: పెద్దిరాజు అడ్డాల, పాటలు: రామజోగయ్య శాస్త్రి, శాంతికుమార్, కొరియోగ్రాఫర్: భాను, చంద్ర కిరణ్, ఫైట్స్: నందు, బ్యానర్:శ్రీ భావనేశ్ ప్రొడక్షన్స్, సమర్పణ: ఎల్లలు బాబు టంగుటూరి.

పోషకాహార లోపం గుప్పెట్లో ..

14.8కోట్ల మంది చిన్నారుల్లో ఎదుగుదల సమస్యలు : ఐక్యరాజ్య సమితి



న్యూయార్క్ : ప్రపంచవ్యాప్తంగా 240కోట్ల మంది ప్రజలకు గతేడాది ఆహారం నిరంతరంగా లభించ లేదని ఐక్యరాజ్య సమితి తెలిపింది. 78.3కోట్ల మంది ప్రజలు క్షుద్బాధను ఎదుర్కొన్నారని, 14.8కోట్ల మంది చిన్నారులు పోషకాహారం లోపంతో ఎదుగుదల సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపింది. 2023లో అంతర్జాతీయ ఆహార భద్రత, పోషకాహారంపై బుధవారం ఐక్యరాజ్య సమితికి చెందిన ఐదు సంస్థలు ఒక నివేదికను విడుదల చేశాయి. 2021, 2022 సంవత్సరాల మధ్య కాలంలో ఆకలితో బాధపడే వారి సంఖ్యలో పెరుగుదల లేదని, కానీ చాలా ప్రాంతాలు తీవ్రమైన ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయని పేర్కొంది. పశ్చిమాసియా, కరేబియన్ ప్రాంతాల్లో, ఆఫ్రికా ఖండంలోని 20శాతం జనాభా క్షుద్బాధను ఎదుర్కొన్నారు. ఇది, ప్రపంచ సగటు కన్నా రెట్టింపునకు పైగానే వుంది. అలాగే కరోనా నుండి ప్రపంచ దేశాలు కోలుకునే తీరు కూడా అంతటా సమానంగా లేదని ఆహారం, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) డైరెక్టర్ జనరల్ క్యూ డోంగ్యూ పేర్కొన్నారు. పైగా ఉక్రెయిన్‌లో యుద్ధం పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని బాగా ప్రభావితం చేసిందన్నారు. "వాతావరణ మార్పులు, ఘర్షణలు, ఆర్థిక అస్థిరత వంటివన్నీ ప్రజలను భద్రత నుండి మరింత దూరంగా తోస్తున్నపుడు ఇదే 'కొత్త రకమైన సాధారణ పరిస్థితి' అని ఆయన వ్యాఖ్యానించారు. 2021లో ప్రపంచ జనాభాలో 42శాతం మంది అంటే 310 కోట్ల మంది ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం లభించలేదని ఆ నివేదిక పేర్కొంది. 2019లో ఈ సంఖ్య కేవలం 13.4కోట్లుగా వుందని తెలిపింది. అనారోగ్యరమైన ఆహారానిన తీసుకునే వారి సంఖ్య తగ్గించడమనేది పెద్ద సవాలుగా పరిణమించిందని ఎఫ్ఎఓ ప్రధాన ఆర్థికవేత్త మాక్సిమో టోరెకో చెప్పారు. వ్యవసాయ రంగంలో, వ్యవసాయాధారిత ఆహార వ్యవస్థలో మన వనరులను ఉపయోగించుకునే తీరులో గణనీయంగా మార్పులు రావడమే ఇందుకు కారణమన్నారు. తాజా పరిశోధన ప్రకారం 2022లో తీవ్రంగా పోషకాహార లోపంతో బాధపడేవారి సంఖ్య సగటున 73.5కోట్లుగా వుందన్నారు. కోవిడ్ ప్రారంభం కావడానికి ముందు 2019లోని సంఖ్య కన్నా 12.2కోట్లు ఎక్కువగా వుందని చెప్పారు.

యశ్ ధుల్ సెంచరీ

ఎసిసి ఎమర్జింగ్ ఆసియాకప్‌లో ఇండియా-ఏ ఘన విజయం



కొలంబో: ఎసిసి ఎమర్జింగ్ ఆసియాకప్‌లో ఇండియా-ఏ జట్టు కెప్టెన్ యశ్ ధుల్ అజేయ సెంచరీతో కదం తొక్కాడు. దీంతో ఇండియా-ఏ జట్టు 8వికెట్ల తేడాతో యుఏఇ-ఏజట్టుపై ఘన విజయంసాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన యుఏఇ-ఏ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 175పరుగులు చేసింది. కెప్టెన్ చిదంబరం(46)టాప్ స్కోరర్. హర్షిత్ రాణాకు నాలుగు, నితీశ్‌రెడ్డి, మానవ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఇండియా-ఏ కెప్టెన్ యశ్ ధుల్(108నాటౌట్; 84బంతుల్లో 20ఫోర్లు, సిక్సర్), నికిన్ జోష్(41నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ యశ్ ధుల్‌కు లభించింది. గ్రూప్-బిలో మరో లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్-ఏ జట్టు 4వికెట్ల తేడాతో నేపాల్‌ను ఓడించింది. దీంతో ఈ గ్రూప్‌లో భారత్ అగ్రస్థానంలో ఉండగా.. పాకిస్తాన్ జట్టు రెండోస్థానంలో నిలిచింది. 17న ఇండియా-ఏ జట్టు నేపాల్-ఏతో తలపడనుంది.

జైస్వాల్ భారీ శతకం

డొమినిక: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలిటెస్ట్‌లో అరంగేట్రం యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్(171) భారీ శతకాని తోడు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి(72నాటౌట్) కూడా అర్ధసెంచరీతో రాణించారు. దీంతో భారతజట్టు మూడోరోజు లంచ్ విరామ సమయానికి 4వికెట్ల నష్టానికి 400పరుగులు చేసింది. ఆ సమయానికి కోహ్లి(72), జడేజా(21) క్రీజ్‌లో ఉన్నారు. దీంతో భారతజట్టుకు ఇప్పటికే 250పరుగుల ఆధిక్యత లభించింది. జైస్వాల్ ఔటయ్యాక క్రీజ్‌లోకి వచ్చిన సీనియర్ ప్లేయర్ అజింక్యా రహానే(3) నిరాశపరిచాడు. ఆ తర్వాత జడేజా-విరాట్ కోహ్లి కలిసి టీమిండియా ఇన్నింగ్స్‌ను ఆదుకున్నాడు.

షాట్‌పుట్‌లో తేజిందర్‌కు స్వర్ణం



బ్యాంకాక్: ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షాట్ పుటర్ తేజిందర్‌పాల్ సింగ్ తూర్ అదరగొట్టాడు. వరుసగా రెండోసారి బంగారు పతకం సాధించాడు. తొలి ప్రయత్నంలోనే షాట్‌పుట్‌ను 20.23 మీటర్ల దూరం విసిరాడు. ఇరాన్‌కు చెందిన సబేరి మెహ్ది(19.98 మీటర్లు), కజకిస్థాన్ అథ్లెట్ ఇవన్ ఇవనోవ్ (19.87 మీటర్ల) రజిత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తేజిందర్‌పాల్‌కు ఘనమైన రికార్డు ఉంది. 2019లో అతను 20.22 మీటర్లతో స్వర్ణం సాధించాడు. ఇటీవల జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో 21.77 మీటర్ల దూరం విసిరిన తేజిందర్‌పాల్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌కు క్వాలిఫై అయ్యాడు. బుడాపెస్ట్‌లో ఆగస్టు 17నుంచి ఈ పోటీలు జరగనున్నాయి.

సౌత్‌జోన్‌కు 248పరుగుల ఆధిక్యత

వెస్ట్‌జోన్‌తో దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్‌జోన్ జట్టు పట్టు బిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో వెస్ట్‌జోన్‌ను 146పరుగులకు ఆలౌట్ చేసిన సౌత్‌జోన్ జట్టు.. రెండో ఇన్నింగ్స్‌లో మూడోరోజు ఆట ముగిసే సమయానికి 7వికెట్ల నష్టానికి 181పరుగులు చేసింది. మయాంక్ అగర్వాల్(35), కెప్టెన్ హనుమ విహారి(42), రికీ బుయ్(37), సచిన్ బేబి(28) బ్యాటింగ్‌లో రాణించారు. శుక్రవారం ఆట నిలిచే సమయానికి సుందర్(10), సాయికిషోర్(16) క్రీజ్‌లో ఉన్నారు. నాగ్వాస్వల్లా, అతిథ్ సేఠ్, ధర్మేంద్రసింగ్ జడేజాకు రెండేసి, చింతన్ గాజాకు ఒక వికెట్ దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో సౌత్‌జోన్ జట్టు 213పరుగుల చేయడంతో ఇప్పటివరకు 248పరుగుల ఆధిక్యత లభించినట్లైంది.

ఐసిసి నుంచి బిసిసిఐకు వచ్చే ఆదాయం పెంపు

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి)నుంచి భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ)కు వచ్చే ఆదాయం పెరిగింది. దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో జరిగిన ఐసిసి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఐసిసి నుంచి ఇప్పటివరకు 22.4శాతం వాటా వస్తుండగా.. తాజాగా పెంపుదలతో బిసిసిఐ 38.5శాతం వాటా అందుకోనుంది. అంటే 72శాతం పెరిగినట్లైంది. ఈ పెంపుతో బిసిసిఐ ఏడాదికి 231 మిలియన్ల డాలర్లు (సుమారు రూ. 2,000 కోట్లు) అందుకోనుంది. ఐసిసికి భారీగా ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్న బిసిసిఐకి తిరిగి అదే స్థాయిలో డబ్బులు ఇవ్వాలని ఐసిసి తిరిగి ఇవ్వాలని నిర్ణయించుకోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఐసిసి నిర్ణయంపై బిసిసిఐ సెక్రటరీ జై షా హర్షం వ్యక్తం చేశాడు.

యూసీసీపై 28వరకు గడువు పెంపు !

న్యూఢిల్లీ : ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)పై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియచేసేందుకు గడువును జులై 28వరకు లా కమిషన్ పొడిగించింది. యూసీసీపై ప్రజలు, సంస్థలు తమ అభిప్రాయాలను తెలియచేయాల్సిందిగా జూన్ 14న లా కమిషన్ కోరింది. ఇచ్చిన ఒక నెల గడువు శుక్రవారంతో ముగిసింది. దాంతో మరో 14 రోజులు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు 50లక్షలకు పైగా ఫిర్యాదులు అందాయని అధికార వర్గాలు తెలిపాయి. ఈ అంశంపై ప్రజల నుంచి అధిక రీతిలో ప్రతిస్పందనలు వస్తున్నాయని, తమ వ్యాఖ్యలు తెలియచేయడానికి మరికొంత సమయం కావాలంటూ వివిధ వర్గాల నుంచి లెక్కకు మించి అభ్యర్థనలు వచ్చాయని లా కమిషన్, పబ్లిక్ నోటీసులో తెలిపింది. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు లేదా సంఘాలు ఈ అంశంపై 28వ తేదీలోగా లా కమిషన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలని కోరింది.

కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీ

- కో-చైర్మెన్‌గా పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తోన్న కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో ఈ సంవత్సరం చివర్లో జరగనున్న ఎన్నికల సన్నాహాలను పర్యవేక్షించేందుకు లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఏఐసీసీ పరిశీలకులను నియమించింది. వీరి నియామక ప్రతిపాదనకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపినట్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. వీరి నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్‌గా మాజీ ఎంపీ మధుయాష్కీని నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. కో-చైర్మెన్‌గా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్‌గా అజ్మతుల్ల నియమించారు. 37మందితో ప్రచార కమిటీని ఏర్పాటు చేశారు.

జకోవిచ్ జోరు

సెమీస్‌లో సిన్నర్‌పై వరుససెట్లలో గెలుపు

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు 9వ సారి



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి 2వ సీడ్, సెర్బియాకు చెందిన 36ఏళ్ల నొవాక్ జకోవిచ్ ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన తొలి సెమీస్‌లో జకోవిచ్ 6-3, 6-4, 7-6(7-4)తో 8వ సీడ్ జన్నిక్ సిన్నర్‌పై వరుససెట్లలో గెలిచాడు. తొలి రెండు సెట్‌లను సునాయాసంగా నెగ్గిన జకోవిచ్‌కు మూడో సెట్‌లో అనూహ్యంగా ప్రతిఘటన ఎదురైంది. ఆ సెట్‌ను టై బ్రేక్‌కు దారితీసింది. దీంతో చివర్లో వరుసగా మూడు పాయింట్లు సాధించి జకోవిచ్ మ్యాచ్‌ను ముగించాడు. దీంతో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో 9వ సారి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 2013లో మాత్రమే రన్నర్‌గా నిలిచిన జకోవిచ్.. ఫైనల్‌కు చేరిన ప్రతి సందర్భంలోనూ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. 2011, 2014, 2015, 2018, 2019, 2021, 2022లలో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను ముద్దాడాడు. ఈసారి టైటిల్‌ను ముద్దాడితే అత్యధికసార్లు వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను నెగ్గిన క్రీడాకారుణిగా రికార్డు నెలకొల్పనున్నాడు. పురుషుల సింగిల్స్‌లో 23గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల నెగ్గి జకోవిచ్ నయా చరిత్రను నెలకొల్పిన సంగతి తెలిసిందే. అలాగే ఈ ఏడాది జరిగిన ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లను జకోవిచ్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఆదివారం జరిగే ఫైనల్లో అల్కరాజ్-మెద్వదెవ్‌ల మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో తలపడనున్నాడు.

నేడు మహిళల సింగిల్స్ ఫైనల్..

మహిళల సింగిల్స్ ఫైనల్ శనివారం జరగనుంది. 6వ సీడ్, ట్యునీషియాకు చెందిన జబీర్, అన్‌సీడెడ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన వోండ్రోసోవాల మధ్య టైటిల్‌పోరు జరగనుంది. సెమీస్‌లో జబీర్ 6-7(5-7), 6-4, 6-3తో 2వ సీడ్ సబలెంకను, వోండ్రోసోవా 6-3, 6-3తో అన్‌సీడెడ్, ఉక్రెయిన్‌కు చెందిన స్విటోలినా ఓడించి ఫైనల్‌కు చేరారు. వోండ్రోసోవా కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్‌కు చేరగా.. జబీర్ గత ఏడాది వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ రన్నరప్. ముఖాముఖి పోరులో ఇరువురు మూడేసిసార్లు గెలిచారు.

కునో నేషనల్ పార్క్‌లో మరో చీతా మృతి

ఐదు నెలల్లో ఎనిమిదోది

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో మరో చీతా మృతి చెందింది. నమీబియా నుంచి తీసుకొచ్చిన సూరజ్ శుక్రవారం మరణించింది. గత ఐదు నెలల్లో ఇక్కడ మరణిం చిన ఎనిమిదవ చీతా ఇది. కొన్ని రోజుల క్రితం మంగళవారం దక్షిణాఫ్రికా నుంచి తీసుకుని వచ్చిన చీతా తేజాస్ మంగళవారం మరణించిన సంగతి తెలిసిందే. సూరజ్ మరణానికి ఇంకా కారణం తెలియలేదు. తేజాస్ గాయాలతో మరణించినట్లు అధికారులు చెబుతున్నారు. కునో నేషనల్ పార్క్‌లో మార్చి 27న తొలి చీతా మరణించింది. కిడ్నీల సమస్యతో సాషా అనే చీతా మరణించింది. తరువాత ఏప్రిల్‌లో ఒక చీతా గుండె సమస్యలతోనూ, మే ప్రారంభంలో ఒక చీతా ఇతర చీతాల దాడిలోని మరణించాయి. మార్చిలో సియ య అనే చీతా నాలుగు పిల్లలకు జన్మ నిచ్చింది. ఇందులో ఒకటి మేలోనూ, తరువాత అదే నెలలో కొన్ని రోజులకే మరో రెండు పిల్లలు మరణించాయి. ఈ మూడు చీతా పిల్లల మరణాలకు



నీరసంగా ఉండటం, అధిక ఉష్ణోగ్రతలు కారణంగా చెబు ఓతు న్నారు. నమీబియా నుంచి భారత్‌కు తీసుకు నివచ్చిన ఎనిమిది చీతా లను గత ఏడాది సెప్టెంబర్ 17న కునో నేషనల్ పార్క్‌లో ప్రవేశపెట్టారు. తరు వాత ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా నుంచి మరో 12 చీతాలను తీసుకుని వచ్చారు. ఇందులో ఆరు చీతాలు ప్రస్తుతం అడవిలో ఉండగా, మిగిలినవి కునోలోనే వివిధ ఎన్‌క్లోజర్లలో ఉన్నాయి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మోడీకి ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం ప్రదానం



పారిస్ : ఫ్రాన్స్ అత్యున్నత పౌర, సైనిక పురస్కారమైన గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లీజియన్ ఆఫ్ ఆనర్‌ను ప్రధాని నరేంద్ర మోడీకి ఫ్రెంచి అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ అందచేశారు. ఈ పురస్కారం అందుకున్న మొదటి భారత ప్రధాని మోడీనే. గురువారం ఎలిసీ ప్యాలెస్‌లో అవార్డు ప్రదానం జరిగింది. గతంలో ఈ అవార్డు అందుకున్న నెల్సన్ మండేలా, కింగ్ చార్లెస్, ఏంజెలా మెర్కెల్ వంటి ప్రముఖుల జాబితాలో మోడీ చేరారు. 1802లో నెపోలియన్ బోనాపార్టీ నెలకొల్పిన ఈ అవార్డు ఫ్రెంచి జాతీయులకే పరిమితమైనా, ఫ్రాన్స్‌కు సేవలందించిన లేదా ఫ్రాన్స్ విలువలు, ఆదర్శాలను పరిరక్షించిన వారికి కూడా లీజియన్ ఆఫ్ ఆనర్ అందచేస్తారు. అంతకుముందు ప్యాలెస్‌లో మోడీకి మాక్రాన్ దంపతులు ప్రైవేట్ విందు ఏర్పాటు చేశారు. 'భాగస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబించే చర్య ఇది' అని విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బగ్చి ట్వీట్ చేశారు. ఈ పురస్కారానికి గానూ భారత ప్రజల తరపున మోడీ కృతజ్ఞతలు తెలియచేశారని పేర్కొన్నారు.

పెట్టుబడులతో రండి..

రెండు రోజుల అధికార పర్యటనకు ఫ్రాన్స్ వచ్చిన మోడీ గురువారం సాయంత్రం అక్కడి భారతీయుల సమావేశంలో ప్రసంగించారు. ఫ్రాన్స్‌లో యుపిఐ వాడుకునేందుకు ఒప్పందం కుదిరినట్లు ప్రకటించారు. దీంతో నగదు రహిత చెల్లింపులకు భారత్ ఆవిష్కరణకు పెద్ద మార్కెట్ లభించింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా అక్కడి భారతీయులకు పిలుపిచ్చారు. పెట్టుబడుల కేంద్రంగా భారత్‌ను అంతర్జాతీయ నిపుణులు గుర్తిస్తున్నారని అన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, కొత్త వ్యవస్థ దిశగా ప్రపంచం ముందుకెళుతున్నపుడు భారత్ పాత్ర, బలం కూడా చాలా వేగంగా మారుతున్నాయని అన్నారు. మార్సెల్లెలో కొత్త భారత కాన్సులేట్‌ను ప్రారంభిస్తున్నట్లు మోడీ ప్రకటించారు. భారత్, ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి 25 ఏళ్ళు నిండాయన్నారు. రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలే ఈ భాగస్వామ్యానికి పునాది అని మోడీ వ్యాఖ్యానించారు. శుక్రవారం ఫ్రాన్స్ జాతీయ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా మోడీ పాల్గొన్నారు. అనంతరం ఇరువురు నేతలు ద్వైపాక్షిక సమావేశం జరిపారు.

నిరసనల వెల్లువ

ఫ్రాన్స్‌లో నరేంద్ర మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానిక ప్రజానీకం పలు చోట్ల ఆందోళనలు, ప్రదర్శనలు చేపట్టారు. మానవ హక్కులను హరించివేస్తున్న ప్రధాని మోడీని స్వాగతించేందుకు ఇక్కడ ఎవ్వరూ సిద్ధంగా లేరని రాసివున్న ప్లకార్డులు ప్రదర్శించారు. మోడీ భారీ దిష్టిబొమ్మలతో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. స్వేచ్ఛా, విముక్తి పోరాటాల దిగ్విజయానికి ప్రతీక అయిన 'బాస్టీల్ డే' వేడుకులకు మోడీని ముఖ్య అతిథిగా ఆహ్వానించడం సిగ్గు చేటు అని నినదించారు.

అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమే !

- తీర్మానాన్ని ఆమోదించిన అమెరికా సెనెట్ కమిటీ

శాన్‌ఫ్రాన్సిస్కో : అరుణాచల్ ప్రదేశ్‌ను భారత్‌లో అంతర్భాగంగా గుర్తిస్తూ అమెరికా సెనెట్ కమిటీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ అమెరికాలో పర్యటించి నెల రోజులు కూడా గడవకముందే సెనెట్ ఈ చర్య తీసుకుంది. మెక్‌మహన్ రేఖను చైనాకు, భారత్‌కు మధ్య గల అంతర్జాతీయ సరిహద్దుగా అమెరికా గుర్తించిందని తీర్మానం పేర్కొంది. ఈ రేఖ అరుణాచల్ ప్రదేశ్ గుండా సాగుతుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు భాగాలు చైనా భూభాగంలోనివేనని చైనా చేస్తున్న వాదనలను తీర్మానం తోసిపుచ్చింది. సెనెటర్లు జెఫ్ మెర్కిలీ, బిల్ హాగెర్టీ, టిమ్ కైనే, క్రిస్ హోలెన్‌లు ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. త్వరలోనే సెనెట్‌లో ఈ తీర్మానంపై ఓటింగ్ జరగనుంది. స్వేచ్ఛకు, నియమ నిబంధనల ఆధారిత వ్యవస్థకు అమెరికా విలువిస్తుందని, ప్రపంచవ్యాప్తంగా తమ చర్యలకు, సంబంధాలకు అదే కేంద్రంగా వుంటుందని సెనెటర్ మెర్కిలీ వ్యాఖ్యానించారు.

రాజ్‌ఘాట్‌లోకి యమునా వరద నీరు



న్యూఢిల్లీ : దేశరాజధాని నగరం న్యూఢిల్లీలో యమునా వరద ఉధృతి కొనసాగుతూనేవుంది. రాజ్‌ఘాట్‌లోని మహాత్మా గాంధీ స్మారకంలోకి వరద నీరు ప్రవేశించింది. అక్కడి పచ్చిక బయళ్లను ముంచెత్తింది. రాజ్‌ఘాట్‌లోకి వరదనీరు ప్రవేశించిన చిత్రాలను గాంధీ స్మృతి అండ్ దర్శన్ సమితి వైస్ చైర్మన్ విజయ్ గోయల్ ట్వీట్ చేశారు. రింగ్ రోడ్డును దాటుకుంటూ వచ్చిన వరద నీరు అక్కడ నుంచి రాజ్‌ఘాట్‌లోకి చేరుకున్నాయి. ఈ విషయంపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడుతూ ఆ ప్రాంతంలోని డ్రెయిన్ నుంచి బ్యాక్‌ఫ్లో కారణంగా రాజ్‌ఘాట్‌లోకి వరద నీరు ప్రవేశించిందని చెప్పారు. ఢిల్లీలోని యమునా నది పశ్చిమ ఒడ్డున రాజ్‌ఘాట్ 44.35 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. 1948లో మహాత్మా గాంధీ అంత్యక్రియలు జరిగిన ప్రదేశంలోనే ఆయన స్మారకాన్ని నిర్మించారు.

వరద నీటిలో మునిగి ముగ్గురు బాలురు మృతి

ఢిల్లీలోని యమునా నది వరద నీటిలో మునిగి ముగ్గురు బాలురు మృతి చెందారు. ముకుంద్‌పూర్ చౌక్ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం ఈ దారుణం జరిగింది. మెట్రో నిర్మాణ స్థలంలో చేరుకున్న వరద నీటిలో స్నానం చేయడానికి దిగిన ఈ బాలురు ప్రమాదవశాత్తూ మృతి చెందినట్లు అధికారులు చెప్పారు. మృతుల్ని ఈశాన్య ఢిల్లీకి చెందిన నిఖిల్ (10), పియూష్ (13), ఆశీష్ (13)గా గుర్తించారు.

అజిత్ పవార్‌కు ఆర్థిక శాఖ

ముంబయి : మహారాష్ట్ర మంత్రివర్గంలో అజిత్ పవార్ గ్రూపు ఎమ్మెల్యేలకు కీలక మంత్రి పదవులు కేటాయించారు. ఎన్‌సిపి నుంచి విడిపోయి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన సుమారు రెండువారాల తరువాత ఈ 9 మంది ఎమ్మెల్యేలకు శుక్రవారం మంత్రిత్వ శాఖలను కేటాయించారు. ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అజిత్ పవార్‌కు ఆర్థిక, ప్రణాళిక శాఖలను కేటాయించారు. భగన్ భుజబల్‌కు ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల రక్షణ శాఖను కేటాయించారు. అదిత తట్కరేకు మహిళా శిశు సంక్షేమ శాఖను కేటాయించారు. షిండే ప్రభుత్వంలో ఏకైక మహిళా మంత్రి ఆదిత కావడం విశేషం.

జ్ఞానవాపీ సర్వేపై 21న కోర్టు తీర్పు

వారణాసి : కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉన్న జ్ఞానవాపీ మసీదులో శాస్త్రీయ సర్వే నిర్వహించాలని కోరుతూ దాఖలైన పిటీషన్‌పై వారణాసిలోని కోర్టు విచారణను ముగించింది. తీర్పును ఈ నెల 21కి రిజర్వ్ చేసింది. మసీదు ప్రాంగణం మొత్తాన్ని సర్వే చేసేలా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ)కి ఆదేశాలు ఇవ్వాలని కొంత మంది హిందువులు ఈ పిటీషన్ దాఖలు చేశారు.



ఎట్టకేలకు కడెం, మొండికుంటవాగు డీపీఆర్లకు క్లియరెన్స్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

గోదావరి బేసిన్‌లోని కడెం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, మొండికుంటవాగు ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఎట్టకేలకు ఆమోదించింది. ఎప్పుడో పూర్తయిన ప్రాజెక్టులకు అభ్యంతరాలు వచ్చిన నేపథ్యంలో ఈ సాంకేతిక అనుమతులు అవసరమయ్యాయి. ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం తెలుగు రాష్ట్రాల్లోని సాగునీటి ప్రాజెక్టులు కృష్ణా నీటి యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ), గోదావరి నీటి యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ)ల పరిధిలోకి ఆయా ప్రాజెక్టులను తెచ్చాయి. రెండు రాష్ట్రాల్లో అనుమతులు లేకుండా నిర్మించిన ప్రాజెక్టులకు సంబంధించి ఏడాదిక్రితం మళ్లీ డీపీఆర్లు సమర్పించి అనుమతులు పొందాలని కేంద్ర జలసంఘం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఆమేరకు కడెం, మొండికుంటవాగు ప్రాజెక్టులకు సంబంధించి శుక్రవారం న్యూఢిల్లీలోని శ్రమశక్తి భవన్ కేంద్ర జలసంఘం ప్రత్యేక సమావేశం నిర్వహించింది. దీనికి కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్, అదనపు కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, సీడబ్ల్యూసీ చైర్మెన్ రుష్మిందర్ వోహ్రా, రాష్ట్ర సాగునీటి ఆయకట్టు శాఖ ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్, హరిరామ్, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే , ములుగు జిల్లా సీఈ విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అటు కేంద్ర జలవనరుల శాఖ, సీడబ్ల్యూసీ ఇంజినీర్లు, ఇటు రాష్ట్ర సాగునీటి శాఖ అధికారులు, ఇంజినీర్ల మధ్య చర్చోపచర్చలు సాగాయి. అనంతరం రెండు ప్రాజెక్టుల డీపీఆర్లకు ఆమోదం లభించినట్టు రాష్ట్ర సాగునీటి శాఖ అధికారులు తెలిపారు.

ఇసుక తవ్వకాలను నిషేధిస్తూ

ఎన్జీటి తీర్పుపై సుప్రీం స్టే నిరాకరణ

రూ.18 కోట్ల జరిమానాపై స్టే

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఏపి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఏపిలో ఇసుక తవ్వకాలపై నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో అడ్డగోలుగా కొనసాగుతున్న ఇసుక తవ్వకాలను నిషేధించాలంటూ ఎన్జీటి ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరించింది. గత మార్చి 23న ఇసుక తవ్వకాలపై ఎన్జీటీ విధించిన నిషేధాన్ని తొలగించాలని ఏపి ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ ను శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం ఎన్జీటి తీర్పుపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది.



జగన్ ప్రభుత్వం ఇసుక తవ్వకాలను గంపగుత్తగా జయప్రకాశ్ పవర్ వెంచర్స్ లిమిటెడ్ పరం చేసింది. పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలతో ఏపిలో ఇసుక తవ్వకాలను జయప్రకాశ్ పవర్ వెంచర్స్ లిమిటెడ్ చేపట్టింది. ఏపి ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టిన ఎన్జీటి, ఇసుక తవ్వాలపై నిషేధం విధించింది. ఎన్జీటి తీర్పును సుప్రీంకోర్టు సమర్థిస్తూ.. ఎన్జీటి తీర్పును యథాతథంగా అమలు చేయాలని ఆదేశించింది.

బి2 కేటగిరీ ఇసుక రీచ్‌లలో పాక్షికంగా యంత్రాలతో ఇసుక త్వవకానికి అనుమతి ఇవ్వడం చట్ట విరుద్ధమని ఎన్జీటి పేర్కొంది. బి1, బి2 కేటగిరీల కింద ఇసుక తవ్వకాల కోసం ఇప్పటికే ఇచ్చిన అన్ని రకాల పర్యావరణ అనుమతులను పరిశీలన చేయాలని ఎన్జీటి ఆదేశించింది. రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ పర్యావరణ అనుమతులను పున్ణ పరిశీలన చేయాలని ఎన్జీటి అదేశించింది. రాష్ట్రంలో ఇసుక రీచ్‌ల పరిధిలో పర్యావరణ విధ్వంసం పరిశీలన, అంచనా కోసం ఎన్జీటి నిపుణుల కమిటీని నియమించింది. ఇసుక తవ్వకాలతో పర్యావరణానికి జరిగిన నష్టాన్ని గుర్తించాలని కూడా నిపుణుల కమిటీని ఆదేశించింది. రివర్ బెడ్లు, నదీ తీరాల్లో భారీ యంత్రాలతో మైనింగ్ చేసుకోవచ్చంటూ అనుమతివ్వడంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ శాఖ కార్యదర్శిని ఆదేశించింది. ఎన్జీటి విధించిన రూ.18 కోట్ల జరిమానాపై మాత్రమే సుప్రీం ధర్మాసనం స్టే విధించింది. ప్రతివాదులైన నాగేంద్ర కుమార్, హేమ కుమార్‌లకు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది.

నాణ్యతా ప్రమాణాలు మరింత పెరిగేలా కృషి

అమూల్ టేక్ హెూం రేషన్ ఫ్యాక్టరీని సందర్శించిన 'తెలంగాణ ఫుడ్స్' బృందం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పిల్లలకు అందించే బాలామృతం నాణ్యతను మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ తెలిపారు.గుజరాత్‌లోని అహ్మదాబాద్, ఇండోర్ పర్యటనలో భాగంగా మొదటిరోజైన శుక్రవారం అక్కడి కైరా జిల్లా ఆనంద్‌లోని అమూల్ టెక్ హెూం రేషన్ ఫ్యాక్టరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమూల్ ఫ్యాక్టరీలో వినియోగిస్తున్న యంత్రాలు, సాంకేతికత అధునాతనమైనవని తెలిపారు. ఇక్కడ ఉపయోగించే రోస్టర్ల వల్ల నాణ్యమైన పోషకాహారం ఉత్పత్తితో పాటు కరెంటు ఛార్జీలను గణనీయంగా తగ్గించుకోవచ్చని వివరించారు. తెలంగాణలో ఇప్పటికే ఆసియాలో అతి పెద్ద ప్లాంట్ ద్వారా బాలా మృతాన్ని ఉత్పత్తి చేస్తున్నట్టు చెప్పారు.

అమూల్ కంపెనీలో ఉన్న రోస్టర్లను తెలంగాణలో ప్రవేశపెడితే ఇంకా నాణ్యమైన పోష్టికాహారం ఉత్పత్తి చేసి, పిల్లలకు అందించి రాష్ట్రాన్ని పోషకాహార లోపం లేకుండా చేయవచ్చని తెలిపారు. దీని వల్ల వ్యయం కూడా తగ్గుతుందన్నారు. గుజరాత్‌లో బాలశక్తి పేరుతో అందిస్తున్న బాలామృతం తయారీకి 75 రూపాయలు ఖర్చు అవుతుంటే మనకు 50 రూపాయలు మాత్రమే ఖర్చవుతుందన్నారు. ఈ పర్యటనలో తెలంగాణ ఫుడ్స్ జీఎమ్ విజయలక్ష్మీ, ఎజీఎమ్‌లు శ్రీనివాస్ నాయక్, యలమంద పాల్గొన్నారు.

వైఎస్ భారతికి ఊరట

ఈడీ పిటిషన్ సుప్రీం కొట్టివేత

- హైకోర్టు ఆదేశాలపై జోక్యానికి నిరాకరణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి భార్యా వైఎస్ భారతికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. అటాచ్ చేసిన ఆస్తులను ఎఫ్‌డిలతో భర్తీ చేయడానికి భారతి రెడ్డిని అనుమతించే తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులపై ఈడి అప్పీల్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. మనీలాండరింగ్ కేసులో కేంద్ర ఏజెన్సీ అటాచ్ చేసిన ఆస్తులను ఫిక్స్‌డ్ డిపాజిట్లతో భర్తీ చేసేందుకు వైఎస్ భారతిని అనుమతిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) దాఖలు చేసిన పిటిషన్ ను శుక్రవారం న్యాయమూర్తులు జస్టిస్ ఎఎస్ ఓకా, జస్టిస్ సంజయ్ కరోల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈడి అటాచ్ చేసిన స్థిరాస్తి నేరం వల్ల వచ్చిన ఆదాయమేనా? అని ప్రశ్నించింది. ఈడి తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్. రాజు వాదనలు వినిపించగా కాదని, అయితే "సమానమైన విలువ" అని చెప్పారు.



వైఎస్ భారతి తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి, న్యాయవాది లిజ్ మాథ్యూ వాదనలు వినిపించారు.

అటాచ్ చేసిన ఆస్తి ఆరోపించిన నేరానికి సంబంధించిన వాస్తవ ఆదాయాలు కాదని నిర్ధారించిన హైకోర్టు ఉత్తర్వుల్లో అనేక అంశాలను వారు ప్రస్తావించారు. భారతి సిమెంట్‌కు సంబంధించిన అవినీతి కేసులో మనీలాండరింగ్ ఆరోపణల కింద ఈ ఆస్తిని ఈడి అటాచ్ చేసింది.

హైకోర్టు ఆదేశంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం, "అటాచ్ చేసిన ఆస్తి అసలు నేరంతో సంపాదించిన ఆస్తి కాదు. ఈడి గుర్తించిన అంశాలు వివాదాల్లోనివి కాదు. పైగా, తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులలో పేర్కొన్న అటాచ్ చేసిన ఆస్తి విలువ తప్పుగా పేర్కొంది. ఈ వాస్తవ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ఈడి పిటిషన్‌ను స్వీకరించడానికి మేము నిరాకరిస్తున్నాము" అని ధర్మాసనం పేర్కొంది.

హైకోర్టు గత ఏడాది నవంబర్ 28న తన ఉత్తర్వులో "రూ.1,36,91,285 మొత్తానికి ఫిక్స్‌డ్ డిపాజిట్‌కి బదులుగా వైఎస్ భారతి సంబంధించిన అటాచ్ చేసిన స్థిరాస్తిని విడుదల చేయాలని తప్పుగా ఆదేశించింది" అని ఈడి పేర్కొంది. "సండూర్ పవర్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్‌కి చెందిన 61,38,937 ఈక్విటీ షేర్‌లకు బదులుగా రూ. 6,13,89,370 ఫిక్స్‌డ్ డిపాజిట్ ఇవ్వడానికి వైఎస్ భారతి రెడ్డిన్ని హైకోర్టు అనుమతించింది" అని పిటిషన్ లో పేర్కొంది. హేతుబద్ధత లోపించి నప్పటికీ, హైకోర్టు ఉత్తర్వులు మనీలాండరింగ్ నిరోధక చట్టం, 2002 స్ఫూర్తికి, లక్ష్యానికి "పూర్తిగా హానికరం" అని పిటిషన్‌లో ఈడి తెలిపింది. "2002 చట్టంలో స్థిర డిపాజిట్‌తో ధృవీకరించ బడిన అటాచ్ చేసిన ఆస్తులను ప్రత్యామ్నాయం చేయడం గురించి మాట్లాడే ఎటువంటి నిబంధన లేదని డిపార్ట్‌మెంట్ స్టాండ్‌ను పరిగణనలోకి తీసుకోవడంలో హైకోర్టు విఫలమైంది" అని ఈడి వాదించింది.

ఉక్కుపై కేంద్రం కక్ష సాధింపు!

అదానీ పోర్టు ద్వారా స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గు రాకుండా అడ్డుకుంటున్న వైనం

విశాఖ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ప్రయత్నాలకు తాజాగా అదానీ గంగవరం పోర్టు అడ్డాగా మారింది. ఉక్కు కర్మాగారాన్ని అమ్మడానికి వీల్లేదని, ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకుని తీరుతామని 883 రోజులుగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజానీకం పోరాడుతున్నా మోడీ సర్కారు చెవికెక్కడం లేదు. పైపెచ్చు ఈ ఉద్యమాన్ని దొంగదెబ్బ తీసేందుకు కేంద్ర పాలకులు స్టీల్‌ప్లాంట్‌కు రావాల్సిన రా మెటీరియల్‌ను పలు రకాలుగా అడ్డుకుంటున్నారు. అదానీ గంగవరం పోర్టు నుంచి రా మెటీరియల్ సరఫరా కావాల్సి ఉండగా, ఆ ప్రయివేట్ పోర్టును కేంద్రం అడ్డం పెట్టుకొని స్టీల్‌ప్లాంట్‌ను దిగ్బంధించాలని చూస్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గంగవరం పోర్టు ద్వారా దిగుమతి అయ్యే బొగ్గును అన్‌లోడింగ్ చేయకుండా బెర్త్ మీదనే వదిలేసే నిర్ణయం తీసుకుంది. దీంతో, స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 13న 15 వేల టన్నుల ఉత్పత్తి చేయాల్సి ఉండగా, కేవలం 12 వేల టన్నులకే పరిమితమైంది. విదేశాల నుంచి స్టీల్‌ప్లాంట్ దిగుమతి చేసుకున్న రెండు బొగ్గు వెస్సెల్స్ (ఓడలు)ను అదానీ గంగవరం పోర్టు తాజాగా బెర్తు మీదనే నిలిపేసింది. వీటిల్లో కొకింగ్ కోల్ ప్రధానంగా ఉన్నట్లు తెలుస్తోంది. గతం నుంచీ స్టీల్‌ప్లాంట్ ఈ పోర్టు నుంచి కొకింగ్ కోల్, ఇతర రా మెటీరియల్‌ను దిగుమతి చేసుకుంటోంది. కేంద్రం తీసుకున్న వ్యూహాత్మక అమ్మకం నిర్ణయంతో గడిచిన కొద్ది నెలలుగా స్టీల్‌ప్లాంట్ ఆర్థిక పరిస్థితి దినదినగండంగా మారింది. ఈ నేపథ్యంలో రూ.50 కోట్లు కార్గో హ్యాండ్లింగ్ ఛార్జీలను ఈ పోర్టుకు స్టీల్‌ప్లాంట్ బకాయి పడింది. బకాయి చెల్లించాకే నౌకల నుంచి బొగ్గును తీసుకెళ్లాలంటూ స్టీల్‌ప్లాంట్‌కు షరతు పెట్టింది. హాట్ మెటల్ (స్టీల్) ఉత్పత్తికి కొకింగ్ కోల్ కీలకమైనది. రష్యా నుంచి ఒక నౌకలో 75 వేల టన్నుల కొకింగ్ కోల్ ఈ పోర్టుకు చేరుకుంది. ఆస్ట్రేలియా నుంచి కూడా ఈ పోర్టుకు అదే స్థాయిలో కొకింగ్ కోల్ వచ్చింది. ఇదంతా స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లాల్సి ఉన్నా పోర్టు యాజమాన్యం అడ్డుకుంది.



1200 ఎకరాల ప్లాంట్ భూమి తీసుకున్న గంగవరం పోర్టు

2000 దశకంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ నుంచి గంగవరం ప్రయివేట్ పోర్టు కోసం నాటి టిడిపి ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి 1200 ఎకరాల భూమిని తీసుకుంది. పోర్టు ఏర్పాటు కోసం ఇచ్చిన భూమికి వాటా కింద పోర్టులో ఓ బెర్తు ఇవ్వాలన్న డిమాండ్‌ను స్టీల్‌ప్లాంట్ ఆనాడే చేసినా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒత్తిడి చేసి ఎస్.రాయవరం వద్ద భూమికి భూమి ఇచ్చారు. ఆనాడే బెర్తు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని స్టీల్‌ప్లాంట్ కార్మికులు తాజాగా ఆవేదన చెందుతున్నారు. నాడు చంద్రబాబు భూమికి భూమి పేరుతో స్టీల్‌ప్లాంట్‌కు ఇచ్చిన భూమి ఎందుకూ పనికిరాదని, స్టీల్‌ప్లాంట్‌కు తన వాటాగా గంగవరం పోర్టు నుంచి బెర్తును తీసుకుని ఉంటే ఈ రోజు ఈ సమస్య తలెత్తేది కాదని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు కెఎం.శ్రీనివాస్ తెలిపారు.

చిన్న, సన్న కారు రైతులకు న్యాయం చేస్తుంటే

రేవంత్ ఓర్వలేక పోతుండు

- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని చిన్న, సన్న కారు రైతులకు న్యాయం చేస్తుంటే రేవంత్‌రెడ్డి ఓర్వలేకపోతున్నారని హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్ విమర్శించారు. బుధవారం అర్ధరాత్రి రేవంత్‌రెడ్డి అనుచరులమంటూ కొంతమంది వ్యక్తులు ఫోన్ చేసి తనను బెదిరించారని, ఫోన్లో అసభ్య పదజాలం వాడుతూ రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్టు పేర్కొన్నారు. ఈ విషయంపై సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్, సంబంధిత పోలీసు అధికారులకు అధికారికంగా ఫిర్యాదు చేసినట్టు శ్రవణ్ చెప్పారు. ఈ బెదిరింపుల నేపథ్యంలో గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. దేశానికే తలమానికంగా తెలంగాణను అభివద్ధి చేస్తుంటే..అది చూసి ఓర్వలేక తండ్రి వయసున్న కేసీఆర్‌ని పట్టుకుని చార్లెస్ శోభరాజ్ అంటావా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

మూడో సారి కేసీఆరే సీఎం

- షిర్డీలో కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం తథ్యమని, మూడోసారి కూడా సీఎం కేసీఆరే అవుతారని రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్ ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం షిర్డీలోని సాయిబాబాను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దామోదర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరినట్టు తెలిపారు.

ఇస్రోకు అభినందనలు

- టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చంద్రయాన్-3ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలకు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి హదయ పూర్వక అభినందనలు తెలిపారు. శాస్త్రవేత్తల కృషి, పట్టుదల, అంకిత భావానికి ఇది నిదర్శనమన్నారు. ఈ ప్రయోగం విజయవంతంతో దేశ కీర్తి ప్రపంచంలో మరోసారి వెలిగిపోయిందన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయకుంటే.. సన్యాసమే : రాజాసింగ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ అధిష్టానం తనపై సస్పెన్షన్ వేటును ఎత్తివేయకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. అంతే తప్ప మరో పార్టీలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. శుక్రవారం ఆయన మంత్రి హరీశ్‌రావును కలవటం చర్చనీయాంశం అయింది. బీఆర్ఎస్‌లో చేరేందుకేనా అనే ఊహాగానాలు కూడా వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన మీడియాకు వివరణ ఇచ్చారు.

నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం, ధూల్‌పేట ఆస్పత్రిలో పడకల విస్తరణ, సౌకర్యాల కల్పన కోసమే ఆయన్ను కలిశానని చెప్పారు. అంతకు మించి ఏమీ లేదని తేల్చిచెప్పారు. గతేడాది ప్రవక్తపై ఆయన వివాదాస్పద వీడియో పోస్టు చేయడంతో పెద్దఎత్తున విమర్శలు వచ్చిన విషయం విదితమే. దాంతో అతన్ని బీజేపీ ఎల్పీ పదవి నుంచి తప్పించి అధిష్టానం పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

ఇంటర్ విద్యలో సాధారణ బదిలీలు చేపట్టాలి

- సీఎం కేసీఆర్‌కు టిగ్లా లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ విద్యలో ఐదేండ్లుగా సాధారణ బదిలీల్లేక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ ఇంటర్మీడియెట్ లెక్చరర్ల అసోసియేషన్ (టిగ్లా) తెలిపింది. వెంటనే సాధారణ బదిలీలను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం జంగయ్య, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామకృష్ణగౌడ్ లేఖ రాశారు. ఇదే అంశంపై మంత్రులు కేటీఆర్, టి హరీశ్‌రావు, పి సబితా ఇంద్రారెడ్డితోపాటు సీఎంవో, సీఎస్ శాంతికుమారికి ట్వీట్ చేశారు. ఇంటర్ వార్షిక, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ, ఫలితాలు విడుదలయ్యాయని వివరించారు. సాధారణ బదిలీల కోసం ఉద్యోగులు, అధ్యాపకులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ఇంటర్ విద్యలో బదిలీలు చేపట్టేందుకు ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

బదిలీలు, పదోన్నతుల కేసును త్వరగా పరిష్కరించాలి

- విద్యాశాఖ సంచాలకులకు ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను సంబంధించిన కేసును త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేనను శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. బదిలీలు, పదోన్నతుల విషయంలో విద్యాశాఖ అధికారులు పూర్తి చొరవ చూపాలని కోరారు. విద్యార్థులకు సంబంధించి యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలను పూర్తిస్థాయిలో అందించాలని సూచించారు. మన ఊరు-మనబడి పాఠశాలల్లో వాచ్‌మెన్‌లు లేక ప్రధానోపాధ్యాయులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఆ సమస్యను తీర్చాలని పేర్కొన్నారు.

ఆస్ట్రేలియా చేరుకున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత జాగృతి ఆస్ట్రేలియా' ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు బ్రిస్బేన్ నగరంలో జరిగే బోనాలు వేడుకల్లో పాల్గొనేందుకు బయల్దేరిన ఎమ్మెల్సీ కవిత ఆస్ట్రేలియాకు చేరుకున్నారు. ఆమెకు అక్కడి బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ జాగృతి ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. బోనాల కార్యక్రమంలో ఆమెతో పాటు ఆస్ట్రేలియా మంత్రులు, ఎంపీలు పాల్గొననున్నారు. కవితకు స్వాగతం పలికిన వారిలో తెలంగాణ జాగృతి ఆస్ట్రేలియా విభాగం అధ్యక్షులు శ్రీకర్ రెడ్డి అందెం, బీఆర్ఎస్ ఆస్ట్రేలియా విభాగం అధ్యక్షులు కాసర్ల నాగేందర్ రెడ్డి, బీటీఏ ప్రెసిడెంట్ కిషోర్, నాయకులు విజయ్ కోరబోయిన, స్వప్న దోమ, విరించి రెడ్డి తదితరులున్నారు.

యాక్టింగ్ చీఫ్ జస్టిస్ పి.నవీన్‌రావు పదవీవిరమణ



నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ (ఏసీజే) పి.నవీన్‌రావు శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఆయనకు హైకోర్టు న్యాయమూర్తులు వీడ్కోలు చెప్పారు. అనంతరం హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జస్టిస్ నవీన్‌రావును సన్మానించారు. కొత్తగా ఏసీజేగా జస్టిస్ అభినంద్‌కుమార్ షావలి వ్యవహరిస్తారని కేంద్రం ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే.